ప్రజలే ప్రభువులు

# జనబలం

డిసెంబర్ 2021 | లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాస పత్రిక | రూ.10/-




## ప్రజలు జేబుల్లో నుండి ఖర్చు చేయాల్సిన అవసరం లేకుండా

# 'అందరికీ ఆరోగ్యం'

## అందించే సమగ్ర, ఆచరణ సాధ్య నమూనాను విడుదల చేసిన జేపీ

## .. అమలు కోసం త్వరలో తెలంగాణ, ఏపీ సహా వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులను కలవనున్నట్లు వెల్లడి



# పంచుడు కోసమే అయితే ప్రభుత్వాలు అక్కర్లేదు..

# స్వచ్ఛంద సంస్థలు చాలు: జేపీ

ప్రభుత్వాలు తాము చేయాల్సిన శాంతి భద్రతల పరిరక్షణ, న్యాయం, చట్టబద్ధపాలన మొదలైన మౌలిక బాధ్యతల్ని విస్మరించి సంక్షేమం పేరుతో తాత్కాలిక తాయిలాల్ని అమలు చేయటమే పనిగా వ్యవహరిస్తుంటే వినాశకర ఫలితాలు ఎదురవుతాయని ప్రజాస్వామ్య పీఠం, లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ హెచ్చరించారు. మానవ సమాజం ఉన్నది తాయిలాల కోసం కాదన్నారు. పంచుడు కార్యక్రమం కోసమే అయితే అందుకు ప్రభుత్వం అక్కర్లేదని, ఆ పనిని స్వచ్ఛంద సంస్థలు చేయగలవన్నారు. 'ప్రజలకు సేవలందించటంలో ప్రభుత్వం పాత్ర' అంశంపై హైదరాబాద్ గీతమ్ డీమ్డ్ టు బి విశ్వవిద్యాలయంలో విద్యార్థులనుద్దేశించి జేపీ ప్రసంగించారు.

పన్నులు వసూలు చేసి, ఆ డబ్బును పంచటం అధమ స్థాయి ప్రభుత్వాలు చేసే పనిగా జేపీ అభివర్ణించారు. దాని వల్ల పేదరికం పోదని, సమానత్వం నెలకొనదని, మానవ గౌరవం పెరగదని, కేవలం పాలకులకు ఓట్లు, ప్రజలకు తాత్కాలిక ఉపశమనం మాత్రమే లభిస్తాయన్నారు. "చట్టబద్ధపాలనను అమలు చేయని ప్రభుత్వం ప్రజల పేదరికాన్ని ఆసరాగా చేసుకుని నిరంతరం ఓట్లు పొందేందుకు ప్రయత్నిస్తుంటుంది. నాణ్యమైన మౌలిక సౌకర్యాల్ని నిర్మించకుండా, ప్రజలకు కనీస వసతుల్ని అందుబాటులోకి తేకుండా ఉండే ప్రభుత్వం సమాజాన్ని దిగజారుస్తుంది. కలుషితంకాని గ్లాసుడు మంచినీళ్లు కూడా తాగే పరిస్థితి లేకపోవటం అవమానకరం" అని జేపీ అన్నారు. నాణ్యమైన విద్య, ఆరోగ్యాలు లేకుండా సమాజం అభివృద్ధి చెందదని, ఈ రెండూ వ్యక్తికి, సమాజానికి కూడా మేలు చేస్తాయన్నారు. విద్య, ఆరోగ్యం ద్వారా అందరికీ అవకాశాల్ని అందించకపోతే సమాజం వెనకబాటుతనంలోనే మగ్గుతుంటుందన్నారు.

ప్రభుత్వానికి ఒక నిర్దిష్ట పాత్ర ఉందని, ఆ బాధ్యతని నిర్వర్తించటంలో పాలకులు విఫలమవుతున్నారని జేపీ అన్నారు. మొత్తం అధికార వ్యవస్థను, అధికారం పట్ల పాతుకుపోయిన భ్రమల్ని ప్రక్షాళన చేసి పునర్నిర్వచించాలని స్పష్టం చేశారు. మన వైఫల్యాలకు కాకుండా, విజయాలకు సాకుల్ని వెతకటం మొదలవ్వాలన్నారు. కౌటిల్య స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ వ్యవస్థాపక డైరెక్టర్ శ్రీధర్ పెబ్బిసెట్టి, గీతమ్ ప్రో వైస్ ఛాన్సలర్ ఎన్. శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజలే ప్రభువులు

# జనబలం

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక


సంపుటి 24 సంచిక 12

డిసెంబర్ 2021

సంపాదకవర్గం

బండారు రామ్మోహనరావు

శిరమని నరేష్

వర్కింగ్ ఎడిటర్

దూసనపూడి సోమసుందర్


## జనబలం చందా రుసుము వివరాలు

| | |
|---|---|
| సంవత్సర చందా | రూ. 100.00 |
| మూడు సంవత్సరాలకు చందా | రూ. 290.00 |
| ఐదు సంవత్సరాలకు చందా | రూ. 475.00 |
| జీవితకాలపు చందా | రూ. 1200.00 |

*జనబలంలో ప్రచురితమవుతున్న వ్యాసాలలో రచయిత(త్రు)లు వెలిబుచ్చే అభిప్రాయాలు కేవలం వారి సొంతం. జనబలం సంపాదకవర్గం ఆ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్టు కాదు.*

### చందాదారులకు విజ్ఞప్తి

చందా మొత్తాలను, ప్రకటనల ధర మొత్తాలను చెక్కుగాని, డి.డి. ద్వారా గాని FOUNDATION FOR DEMOCRATIC REFORMS పేర పంపవచ్చును. NEFT సౌకర్యము ద్వారా పంపదలచినవారు SBI PUNJAGUTTA BRANCHలోని SB A/C. No. 52086568057కి IFSC CODE No. SBIN0020072కు పంపి, Transaction I.D. No. మరియు తారీఖు తప్పనిసరిగా తెలియజేయవలెను. నగదు రూపంలో చెల్లించదలచిన వారు లోక్‌సత్తా సంస్థ కేంద్ర కార్యాలయంలో ఇచ్చి రశీదు పొందవలెను.

## కార్టూన్ కార్నర్





కార్యాలయ చిరునామా : తులిప్స్ అపార్ట్‌మెంట్స్ 6-3-655, ప్లాట్ నెం 407, సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక, సోమాజిగూడ, హైదరాబాద్-500 082 ఫోన్: 040-23310288

Email: janabalam.loksatta@gmail.com, loksattaudyamasamstha@gmail.com

సంపాదకీయం

# విద్యారంగ సంక్షోభంపై అసర్ హెచ్చరికలు

అసలే మన పిల్లల చదువులు అంతంతమాత్రం! బడిపిల్లల పఠన, గణిత సామర్థ్యాలు నాసిగా ఉంటున్నాయి. వారికి తరగతి వారీ సామర్థ్యాలు బొత్తిగా లేవన్న సంగతి కూడా మనకు తెలుసు. గత పదిహేనేళ్లుగా క్రమం తప్పకుండా వెలువడిన అసర్ నివేదికలు మన చదువులలోని సమస్యలను వెలుగులోకి తెస్తున్న విషయం కూడా తెల్సిందే. చాలాకాలం పాటు మనం పాఠశాల నమోదు మీద దృష్టి పెట్టాం! ఇప్పుడిప్పుడే విద్యా నాణ్యత పైకి దృష్టి సారిస్తున్నాం! కొన్నేళ్లపాటు పట్టుదలతో ప్రయత్నిస్తే పిల్లల విద్యా ప్రమాణాలు మెరుగుపడే అవకాశం ఉంటుంది. అభ్యసనా సామర్థ్యాల పెంపుదల కోసం కుస్తీపడుతున్న మన విద్యారంగం కరోనా ప్రభావంతో కుదేలయ్యింది. చదువులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గత రెండేళ్లలో విద్యారంగం సంక్షోభం అంచులకు వెళ్లిపోయింది. విద్యారంగంపై కరోనా వేసిన తీవ్ర ప్రభావాన్ని అధ్యయనం చేయడానికి 'అసర్ ' ప్రయత్నించింది. 2020లో చేసిన తొలి ప్రయత్నానికి కొనసాగింపుగా 2021లో సైతం అసర్ ఒక అధ్యయనాన్ని చేసింది. అసర్ - 2021 నివేదిక నవంబర్ 17న వెలువడింది.

దేశ వ్యాప్తంగా 25 రాష్ట్రాలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాలలోని 581 జిల్లాల్లో అసర్ సర్వే నిర్వహించింది. క్షేత్రస్థాయికి వెళ్లి సర్వే నిర్వహించే వీలు లేకపోవడంతో మొబైల్ ద్వారా 17,184 గ్రామాలకు చెందిన 75,234 మంది విద్యార్థులను పలకరించి సమాచారాన్ని సేకరించడం జరిగింది. అలాగే 7,299 పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయుల నుండి కూడా సమాచారాన్ని సేకరించారు. విద్యారంగంపై కరోనా వేసిన ప్రతికూల ప్రభావాన్ని అసర్ నివేదిక వెల్లడించింది.

2020 మార్చి 25 నుండి లాక్‌డౌన్ విధించడంతో విద్యాసంస్థలన్నీ నిరవధికంగా మూతబడ్డాయి. మధ్యలో కొంతకాలం తెరిచినప్పటికీ రెండో విడత ముప్పు ముంచుకు రావడంతో మరోసారి మూసివేత తప్పలేదు. 2021 ఆగస్టు తర్వాత మెల్లిగా బడులు తెరుచుకోవడం మొదలైంది. బడుల మూసివేత కాలానికి సబంధించిన ప్రపంచ సగటు 35 వారాలు కాగా భారత్‌లో బడుల మూసివేత 75 వారాల పాటు కొనసాగింది.

పైకి బడులు మూసివేత కాలం ఎంత కనిపించినా మూడు విద్యా సంవత్సరాల బోధనాభ్యసన ప్రక్రియ దెబ్బతిన్నదన్న వాస్తవాన్ని గమనించాలి. 2020 మార్చినాటికి ఒకటో తరగతి చదివే విద్యార్థి 2021 ఆగస్టు నాటికి 3వ తరగతిలోకి వచ్చేయాల్సి వచ్చింది. రెండో తరగతి అభ్యసనం ఏమీ జరగలేదన్నది తెలిసిందే! మూడో తరగతి ఆలస్యంగా మొదలయ్యింది. దాంతో ఆ విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు నాసిగా తయారయ్యాయి. దీర్ఘకాలం బడుల మూసివేత ఫలితంగా బడి ఈడు పిల్లల నమోదుకు అంతరాయం ఏర్పడింది. దాంతో బడి బైటి పిల్లలు 5.8శాతానికి చేరుకున్నారు. ప్రైవేటు పాఠశాలలు చాలా వరకు మూతబడి పోవడంతో అక్కడ చదివే పిల్లల్లో కొందరు ప్రభుత్వ పాఠశాలల్లో చేరారు. దాంతో ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు పెరిగినట్లు అసర్ -2021 వెల్లడించింది. కుటుంబాల ఆర్థిక స్థితిగతులు తల్లకిందులు కావడం, వలస కార్మికులు సొంత గ్రామాలకు తిరిగి రావడం, ప్రైవేటు పాఠశాలల్లో నమోదు పడిపోవడం ప్రభుత్వ పాఠశాలల నమోదు పెరగడానికి దారి తీసిందని అసర్ పేర్కొన్నది.

ఏదో ఒక రూపంలో బోధనాభ్యసన ప్రక్రియను కొనసాగించడానికి విద్యాసంస్థలు ప్రయత్నించాయి. అనేక రాష్ట్రాల్లో ఆన్‌లైన్ బోధన జరిగింది. అయితే స్మార్ట్ ఫోన్లు లేని కుటుంబాల పిల్లలు అటువంటి బోధనకు దూరంగా మిగిలిపోయారు. ఇంటిలో స్మార్ట్ ఫోన్ ఉన్నప్పటికీ అవి పిల్లలకు అందుబాటులో లేకపోవడంతో దాదాపు 30శాతం పిల్లలు ఆన్‌లైన్ చదవులను అందుకోలేకపోయారు. ఆన్‌లైన్ బోధన తరగతి విద్యార్థుల్లో కొన్ని వ్యత్యాసాలను వెలుగులోకి తెచ్చింది. తల్లిదండ్రుల విద్యాస్థాయి, వారి ఆర్థిక స్థాయి, ఇంటిలోని సదుపాయాలు వంటివి ఆన్‌లైన్ బోధనకు అవరోధాలుగా ఎదురయ్యాయి. పిల్లలకు మధ్యాహ్న భోజనం బదులు డ్రైరేషన్ ఇవ్వడం వల్ల వారికి పౌష్టికాహారాన్ని అందించినట్లయ్యింది. అయితే మొబైల్ ఫోన్లు లేని తల్లిదండ్రులకు సమాచారమే అందలేదు. పాఠ్యపుస్తకాలు అత్యధిక శాతం పిల్లలకు అందించినప్పటికీ, ఇతర విద్యా సామాగ్రి, ఉపకరణాలు, కృత్యాల సమాచారం అందరికీ సమానంగా అందలేదని అసర్ తెలిపింది.

ప్రస్తుతం దేశవ్యాప్తంగా విద్యాసంస్థలన్నీ తెరుచుకున్నాయి. సాధారణ బోధనాభ్యసన ప్రక్రియ ప్రారంభమైంది. మూసివేతకారణంగా బడిబైట మిగిలిపోయిన వారందర్నీ తిరిగి బడికి తేవాలి. ప్రభుత్వ పాఠశాలల్లో పెరిగిన నమోదుకు అనుగుణంగా అక్కడి సదుపాయాలు మెరుగుపరచాలి. రెండేళ్లుగా వచ్చిన అభ్యసనా లోటును పూడ్చడానికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కలసికట్టుగా ప్రయత్నించాలి. ఆన్‌లైన్ బోధనకు అనుగుణంగా పాఠశాలలను, కుటుంబాలను సంసిద్ధం చేయాలి. సంక్షోభంలో పడిన విద్యారంగాన్ని తిరిగి గాడిలో పెట్టడానికి గట్టి ప్రయత్నం జరగాలని 'అసర్ -2021 నొక్కి చెప్పింది.

డి. సోమ సుందర్

# ప్రజలు జేబుల్లో నుండి ఖర్చు చేయాల్సిన అవసరం లేకుండా
# 'అందరికీ ఆరోగ్యం' అందించే సమగ్ర, ఆచరణసాధ్య నమూనాను విడుదల చేసిన జేపీ

..అమలు కోసం ఎఫ్‌డీఆర్ తరపున త్వరలో తెలంగాణ, ఏపీ సహా వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులను కలవనున్నట్లు వెల్లడి




ప్రజలు తమ జేబుల్లో నుండి సొంతంగా ఖర్చు చేయాల్సిన అవసరం లేకుండా, అందరికీ నాణ్యమైన ఆరోగ్యాన్ని అందించేలా ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్) రూపొందించిన సమగ్ర, ఆచరణసాధ్య విధానం నమూనాను ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ విడుదల చేశారు.

హైదరాబాద్ సోమాజీగూడ/పంజాగుట్ట జంక్షన్ వద్ద ఎఫ్‌డీఆర్ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో సమగ్ర ఆరోగ్య విధానం నమూనా పుస్తకాన్ని విడుదల చేసిన అనంతరం జేపీ మాట్లాడుతూ, ఈ ప్రచురణను ఇప్పటికే ప్రధానమంత్రి సహా సంబంధిత వర్గాలందరికీ పంపామని, అమలు కోసం త్వరలో ముఖ్యమంత్రులను వ్యక్తిగతంగానూ కలవనున్నామని తెలిపారు. నమూనాలోని అంశాలను స్థూలంగా వివరించారు.

"కొవిడ్-19 మహమ్మారి నిర్దాక్షిణ్యంగానే అయినా ప్రజల దృష్టిని ఆరోగ్యం వైపుకి మళ్లించింది. దీన్ని సంక్షోభంలో ఓ సదవకాశంగానే మనం భావించాలి. అయితే, మన ఆరోగ్య సంక్షోభం ఇప్పటికిప్పుడు వచ్చింది కాదు. మన ఆరోగ్య విధానంలోని వైఫల్యాల వల్ల కొవిడ్ మరింత తీవ్ర విపత్తుగా తయారై కోట్లమంది జీవితాల్ని అల్లకల్లోలం చేసింది. అలాగే ఆరోగ్య వ్యవస్థను దీర్ఘకాలంగా నిర్లక్ష్యం చేయటం వల్ల మన ఆరోగ్య రంగంలోని సవాళ్లు ఉన్నకొద్దీ తీవ్రతరమవుతూ వచ్చాయి. ఆరోగ్య రంగంపై ప్రభుత్వ వ్యయం మన దేశంలో అతి తక్కువగా, జాతీయాదాయంలో సుమారు 1.2% మాత్రమే ఉంటూ వస్తోంది. ఈ నేపథ్యంలో, ప్రభుత్వ వైద్య సదుపాయాల పట్ల ప్రజల్లో నమ్మకం, వాటిని వినియోగించుకోవటం కూడా తక్కువగా ఉంది. మొత్తం వైద్య సంప్రదింపుల్లో (డాక్టర్ కన్సల్టేషన్లు) 25% మాత్రమే ప్రభుత్వ రంగంలో ఉంటున్నాయి. దీనర్థం అత్యధిక శాతం వైద్య సేవల్ని ప్రయివేటు సదుపాయాల్లో, అధిక ఖర్చుతో ప్రజలు పొందుతున్నారు. వైద్యంలోని ప్రాథమిక, ద్వితీయ, తృతీయ - మూడు స్థాయిల మధ్యా సమన్వయం లేకుండా పోయింది. దీంతో ప్రతి చిన్న ఆరోగ్య సమస్యకూ పైస్థాయి వైద్యానికి వెళ్లే వారు ఎక్కువైపోతూ ద్వితీయ, తృతీయ స్థాయి ఆస్పత్రుల మీద విపరీత భారం పడుతోంది. మరోవైపు, జీవనశైలి వ్యాధుల భారం పెరుగుతుండటంతో మధుమేహం, రక్తపోటు, గుండెజబ్బు లాంటి దీర్ఘకాల అసాంక్రమిక (అంటుకోని) వ్యాధులు పెరుగుతున్నాయి. దీనివల్ల ఇప్పటికే అధ్వాన్నంగా ఉన్న ఆరోగ్య వ్యవస్థ మీద మరింత భారం పడటంతోపాటు, ఆరోగ్య వ్యయం ఇంకా ఇంకా పెరుగుతోంది. ఫలితంగా, అందుబాటు ఖర్చులో నాణ్యమైన ఆరోగ్య సేవలు అందక ఏటా దాదాపు ఆరు కోట్ల మంది భారతీయులు పేదరికంలోకి జారిపోతున్నారు. రెండు తెలుగు రాష్ట్రాలలో కలిపి కేవలం అనారోగ్య కారణంగా ప్రతి ఏడు దాదాపు 45 లక్షల మంది బీదరికంలోకి జారిపోతున్నారు.

ఈ నేపథ్యంలో, ఈవేళ్టి, రేపటి ఆరోగ్య అవసరాలను పరిగణలోకి తీసుకుంటూ, ప్రాథమికం నుండి మూడో దశ వైద్యం వరకూ ఎటువంటి గందరగోళం లేకుండా సజావుగా సేవలందించేలా అనుసంధానమైన ఒక సమగ్ర ఆరోగ్య విధానాన్ని రూపొందించటం తక్షణావసరం. అదృష్టవశాత్తూ, ఆరోగ్య రంగంలో భారత్‌కు పలు గణనీయ బలాలున్నాయి. మనం పెద్దసంఖ్యలో వైద్య వృత్తి నిపుణులకు శిక్షణనిస్తున్నాం, దీంతో మనకు సరిపడా మానవ వనరులున్నాయి. చైనా తర్వాత, ఏటా ఎక్కువ మంది వైద్య పట్టభద్రులు తయారవుతున్నది మన దేశంలోనే. అలాగే, అత్యంత సంక్లిష్టమైన వైద్య, శస్త్రచికిత్స ప్రక్రియలు సహా అత్యధిక వైద్య సేవలకయ్యే వ్యయం ప్రపంచంలో మన దేశంలోనే అతి తక్కువగా ఉంది. మరోవైపు, భారత ఔషధ పరిశ్రమ ఎంతో సమర్థవంతమైనది, తక్కువ ఖర్చుతో ఉత్పత్తి చేసేది. మన దేశ జనాభాకు అవసరమైన మందులను చౌకగా అందించటానికి ఇది భరోసానిస్తోంది. కాబట్టి, మనకున్న ఈ బలాల్ని సరైన రీతిలో ఉపయోగించుకుంటే నాణ్యమైన ఆరోగ్యాన్ని తక్కువ ఖర్చుతోనే అందించే పటిష్ఠమైన ఆరోగ్య వ్యవస్థను నిర్మించుకోవచ్చు.

'Towards Viable Universal Healthcare' పేరుతో ప్రజాస్వామ్య పీఠం/లోక్‌సత్తా రూపొందించిన ఈ ప్రచురణలోని ఆరోగ్య విధానం నమూనా అందరికీ సమర్థవంతంగా, అందుబాటులో, అతి తక్కువ వ్యయంతో ఆరోగ్య సేవల్ని అందించేందుకు చేసిన ఒక వినమ్రపూర్వకమైన ప్రయత్నం. ప్రస్తుతమున్న మౌలిక వసతులు, సంస్థలు, కార్యక్రమాలను కొనసాగిస్తూనే సమగ్ర ఆరోగ్య వ్యవస్థను ఈ నమూనా నిర్మిస్తుంది. ఆరోగ్య వ్యవస్థలో మనకున్న గణనీయ బలాలను వినియోగిస్తూ, విజయవంతమైన అత్యుత్తమ పద్ధతుల మీద ఇది నిర్మితమవుతుంది. సరళంగా, ఆచరణసాధ్యంగా కూడా ఉండటం వల్ల.. వివిధ రాష్ట్రాలు తమ స్థానిక పరిస్థితులకనుగుణంగా మార్పులు, చేర్పులు చేసుకునే వెసులుబాటు కూడా ఇందులో ఉంది. ఖర్చుకు తగ్గ ఫలితాలతో ప్రభుత్వంపై, అదే విధంగా ప్రజలపై వ్యాధుల భారాన్ని తగ్గించేందుకు ఇది సమర్థవంతమైన, దీర్ఘకాలంపాటు కూడా మనగలిగిన నమూనా.

## ఈ నమూనాలోని కీలక అంశాలు:

▶ అన్ని రకాల ఔట్‌పేషెంట్ సేవలకూ ప్రజలు తమకు నచ్చిన డాక్టర్‌ని ఎంపిక చేసుకునే స్వేచ్ఛ, వైద్య సేవల మధ్య పోటీతో ఫ్యామిలీ ఫిజిషియన్ (ఎఫ్.పి) నేతృత్వంలో ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థ. ఇది పైస్థాయి ఆస్పత్రి సేవలకు అనుసంధానమై ఉంటుంది. ఆస్పత్రి చికిత్స అవసరమనుకుంటే ఫ్యామిలీ ఫిజిషియనే సిఫార్సు చేస్తారు. ప్రభుత్వం నిధుల్ని సమకూరుస్తుంది.

▶ ద్వితీయ, తృతీయ స్థాయి చికిత్సల ఆస్పత్రులు ఇన్‌పేషెంట్ సేవలకు మాత్రమే పరిమితం. అయితే, అత్యవసరాలు మినహాయించి అన్ని కేసుల్లో కింద స్థాయి వైద్యుని నుండి సిఫార్సు (రెఫరల్) తప్పనిసరి.

▶ ఆయుష్మాన్ భారత్ (ప్రభుత్వం నిధులిచ్చే ఇతర ఏక చెల్లింపు (సింగిల్-పేయర్) ఆరోగ్య బీమా/హామీ పథకాలు) నుండి తృతీయ స్థాయి వైద్య సేవలను మినహాయించి, ఆ పథకాలు అన్ని ద్వితీయ స్థాయి చికిత్సలకూ, అందరు పౌరులకూ వర్తించేలా వాటి పరిధిని విస్తరించటం. తృతీయ స్థాయిలో నాణ్యమైన, ఖర్చుకు తగ్గ ఫలితాలనిచ్చే వైద్య సేవలందించేలా దేశంలోని జిల్లా, ప్రభుత్వ బోధనాస్పత్రులను అభివృద్ధి చేయటం, అదనపు వనరుల్ని సమకూర్చటం.

▶ నమూనాను అమల్లోకి తేవటానికయ్యే ఖర్చులో ఎక్కువ భాగాన్ని ప్రభుత్వమే భరిస్తున్నా, సమర్థవంతమైన, వ్యయ ప్రయోజనకరమైన సేవల్ని అందించటంలో ప్రయివేటు రంగానికి కూడా కీలక పాత్ర ఉంటుంది. ప్రభుత్వ-ప్రయివేటు-భాగస్వామ్యాలు, ఆర్థిక వనరుల సేకరణకు వినూత్న పద్ధతులతో ఈ నమూనా రూపొందింది.

దేశవ్యాప్తంగా ఈ నమూనా అమలుకు అదనంగా అయ్యే వ్యయం ఏడాదికి సుమారు రూ.85,000 కోట్లు. అంటే జీడీపీలో దాదాపు 0.4%. ఈ అదనపు వ్యయాన్ని కలుపుకున్నా కూడా దేశవ్యాప్తంగా ప్రభుత్వ వ్యయం ఆరోగ్యంపై 1.6%గా మాత్రమే, ప్రపంచంలోనే అన్ని ప్రధాన దేశాలతో పోలిస్తే అతి తక్కువగానే ఉంటుంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో అదనపు వ్యయం వరుసగా సుమారు రూ.1900 కోట్లు, రూ.2600 కోట్లు ఉంటుంది.

ఈ ప్రతిపాదిత నమూనాను అమలు చేస్తే, భారతదేశంలో ఒక పటిష్ఠమైన, ఆచరణసాధ్యమైన, అందుబాటులో ఉండే, అందరికీ నాణ్యమైన ఆరోగ్యాన్ని అందించే సార్వత్రిక ఆరోగ్య సంరక్షణ వ్యవస్థను నిర్మిస్తుంది. ఆరోగ్య రంగంలో గుణాత్మక మార్పునకు, కోట్ల మంది మన ప్రజల జీవితాల్ని మెరుగుపరచటానికి మన ఆరోగ్య వ్యవస్థను సమగ్రంగా పునర్నిర్మించటం అవసరం. ఈ సంస్కరణల అమలు ఆవశ్యకతను తెలియచెప్పి ఒప్పించే క్రమంలో ప్రధానమంత్రి, యూనియన్ మంత్రులు, నీతి ఆయోగ్, ఆర్థిక సలహా మండలి, పార్లమెంటు సభ్యులు, మీడియా, ఈ రంగంలో పనిచేస్తున్న ఇతర అనేక సంస్థలు, వ్యక్తులు ఇలా సంబంధితులందరికీ ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్) వివరాలను అందించింది. ఆరోగ్య రంగం రాష్ట్రాల జాబితాలోని అంశం కాబట్టి, అంతిమంగా సంస్కరణలు రాష్ట్రాల నుండి ప్రారంభం కావాలి. కాబట్టి, ఎఫ్‌డీఆర్ ఈ ప్రచురణను దేశంలోని అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఆరోగ్య మంత్రులు, ఇతర సంబంధిత ఉన్నతాధికారులకు పంపింది. దీంతోపాటు, ఈ సంస్కరణలను అమలు చేసేలా ప్రభుత్వాలను ఒప్పించేందుకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర, ఒడిషాతో మొదలుపెట్టి వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులని వ్యక్తిగతంగా కూడా కలవాలని ఎఫ్‌డీఆర్ భావిస్తోంది" అని జయప్రకాష్ నారాయణ్ వివరించారు.

# అమలు చేయదగిన నూతన ఆరోగ్య విధానం

- డా॥ రాము సూరావజ్జుల, సీనియర్ జర్నలిస్టు, జర్నలిజం ఎడ్యుకేటర్, కమ్యూనికేషన్ కన్సల్టెంట్



భావజాలం ఏదయినా రాజకీయ నేతలు సహజంగానే ఎంతో తెలివైనవారు. తమ పప్పులు ఎక్కడ ఉడుకుతాయో వారు ఇట్టే వాసన పట్టేస్తారు. స్వప్రయోజనాల కోసం సదరు నాయకులు ప్రజల ఎజెండాను ఎలా నిర్దేశిస్తారో, బహిరంగ చర్చను ఎలా పక్కకు మళ్లిస్తారో చూడండి. ప్రజలకు ప్రయోజనం చేకూర్చే అంశానికున్న ప్రాధాన్యతను, ఆవశ్యకతను వెనక్కునెట్టి, తాము ఎంచుకున్న అంశాన్ని హడావుడి, ఆర్భాటంతో భూతద్దంలో చూపుతూ ముందుకు తెస్తారు రాజకీయ నేతలు.

ప్రజల సెంటిమెంట్లపై ఆటలాడుతూ కీలకమైన అంశాల నుండి క్షణకాలంలోనే జనం దృష్టిని మళ్లించే కళలో రాజకీయులు సిద్ధహస్తులు. ప్రజలకు జ్ఞాపకశక్తి తక్కువగా ఉండటం, తాజా సమాచారాన్ని వేడివేడిగా వడ్డించాలనుకునే వార్తా మీడియా యావ మీద నాయకులు తమ రాజకీయ క్రీడను యధేచ్ఛగా సాగిస్తున్నారు. ఇందుకు రెండు ఉదాహరణలు చెబుతాను.

ఏప్రిల్, మే 2021లో కొవిడ్ రెండో అల మరణ మృదంగంతో ఉధృతంగా విరుచుకుపడినప్పుడు ఇతర రాష్ట్రాలు, దేశాలలాగానే తెలంగాణ తల్లడిల్లింది. ఈ ప్రపంచ ఆరోగ్య సంక్షోభం 1979 నాటి స్కైలాబ్ అనుభవాన్ని గుర్తుచేసింది. స్కైలాబ్ ఏ క్షణాన కూలుతుందోనని అందరూ బిక్కుబిక్కుమంటూ రోజులు, వారాలు గడిపారు. ఆ అతిపెద్ద అంతరిక్ష నౌక ఎప్పుడోకప్పుడు భూమి మీద పడుతుందని తెలిసినా ఎప్పుడు, ఎక్కడ కూలుతుందో తెలియని పరిస్థితి. అదేరీతిలో కంటికి కనిపించని కొవిడ్ వైరస్ అనేకమంది ఊపిరితిత్తుల్ని కబళిస్తున్నా, కచ్చితంగా ఎలా, ఎప్పుడు అనేది ఎవరికీ అంతుచిక్కని స్థితి.

స్కైలాబ్ మెటల్ బాల్ ప్రభావాన్ని తప్పించుకునేందుకు ఆ రోజుల్లోని రాజకీయ నేతలు బంకర్లలో తలదాచుకోగా, వారి ప్రస్తుత తరం వైరస్‌ని తప్పించుకునేందుకు ఫాంహౌస్‌లకు తరలివెళ్లారు, లేదంటే ప్రశాంత ఏకాంత ప్రకృతి సౌందర్య ప్రదేశాల్లో సేదతీరారు. మనుషులతో కలవకుండా ఉండటానికి సకల జాగ్రత్తలూ తీసుకున్నా ఆ విషక్రిమి బారిన పడ్డ నేతలు, అత్యంత అధునాతన కార్పొరేట్ ఆస్పత్రుల్లో చేరిపోయారు. ఎటొచ్చీ సాధారణ ప్రజలే ఆక్సిజన్ సిలిండర్లు, ఇంటెన్సివ్ కేర్ యూనిట్ పడకలు, విశ్వసనీయ ఔషధాల కోసం అటూఇటూ పరుగులు పెట్టారు. లక్షలాది మంది నిస్సహాయ స్థితిలో కన్నుమూశారు. వైరస్ సృష్టించిన భయంతో వారు సరైన అంతిమ సంస్కారాలకు కూడా నోచుకోలేదు.

తమ కుటుంబ సభ్యుల వైద్య అవసరాల కోసం ప్రజలు ఏళ్ల తరబడి పొదుపు చేసుకున్న డబ్బుని ఖర్చు చేశారు, బంగారు ఆభరణాలు, స్థలాలు, భూముల్ని అమ్మి తెచ్చి సొమ్ముల్ని గుమ్మరించారు. మన వైద్య వ్యవస్థలో అడుగడుగునా ఉన్న డొల్లతనాన్ని కంటికి కనిపించని ఆ క్రిమి నిర్దాక్షిణ్యంగా బట్టబయలు చేసింది. ఈ మానవతా సంక్షోభాన్ని ఎదుర్కోవటంలో ప్రభుత్వ ఘోరవైఫల్యానికి క్షోభించని వారంటూ లేరు. మరణాల సంఖ్యను కూడా ప్రభుత్వం తగ్గించి చూపిందన్న ఆరోపణలూ వెల్లువెత్తాయి.

సరిగ్గా ఇటువంటి ప్రమాదకర పరిస్థితుల్లోనే తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు ఆరోగ్య మంత్రి ఈటల రాజేందర్‌ను భూ ఆక్రమణకు సంబంధించిన ఆరోపణల మీద కేబినెట్ నుండి తొలగించారు. ప్రభుత్వ రాజకీయ నిర్ణయం తెలిసోతెలియకో ప్రజాగ్రహాన్ని మరుగున పడేసింది. మే నెల నుండి కొవిడ్-19 తరహాలో ఈటలకూ ప్రచారం లభించింది.

ఆ తర్వాత హుజూరాబాద్ ఉప ఎన్నిక వచ్చింది. ఆరు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి బీజేపీ తరపున నిలబడిన ఈటలను రాజకీయంగా నిర్వీర్యం చేసేందుకు టీఆర్ఎస్ ప్రభుత్వం డబ్బు, కండబలాన్ని ఉపయోగించి సర్వశక్తులూ ఒడ్డింది కానీ, ప్రయోజనం లేకపోయింది. నవంబర్ 2న ఫలితాలు వచ్చాక, తెరపై మరో అంశం కేంద్రబిందువయింది. ఎన్నికల సమయంలో చర్చకు వచ్చిన ధాన్యం కొనుగోలు వంటి సంబంధంలేని అంశాలు తెలంగాణలో వాడివేడి చర్చనీయాంశాలయ్యాయి.

పూనకాలు వచ్చినట్లు బీజేపీ, టీఆర్ఎస్‌ల మధ్య జరిగిన మాటల యుద్ధం, రాష్ట్రవ్యాప్త ధర్నాలకు రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీ పిలుపునివ్వటం చర్చలో అగ్గి రాజేసింది. కొవిడ్ మహమ్మారిని ఎదుర్కోవటంలో వైఫల్యం, ఉప ఎన్నిక సమయంలో ప్రదర్శించిన దుర్మార్గపు టక్కుటమారాది విద్యల గురించి ఏ రాజకీయ నాయకుడూ మాట్లాడరు. ఆ తర్వాత తెరపైకి మరో అంశం. ఎమ్మెల్సీ ఎన్నికలు, నవంబర్ 15 వరకు జిల్లా కలెక్టర్‌గా ఉన్న వెంకట్రామరెడ్డిని శాసనమండలికి పంపాలని చివరి నిమిషంలో నిర్ణయించటంపై చర్చ సాగింది. ఇది ఉద్దేశపూర్వకంగా కుమ్మక్కయి చేసినదో కాదో నాకు తెలియదుగానీ, ప్రజాప్రయోజనాల దృష్ట్యా ఎంతో ముఖ్యమైన అంశాలు కాస్తా రాజకీయ నాయకులు ముందుకు తెచ్చిన కొత్త అంశాల వల్ల కొట్టుకుపోయాయి. మన అనుభవాల నుండి మనం పాఠాలు నేర్చుకోమా? ప్రపంచంలోని ఇతర ప్రాంతాల్లో ఇప్పటికే ప్రాణాలు హరిస్తున్న కొవిడ్-19 మూడో అలను ఎదుర్కొనేందుకు సిద్ధమవటానికి బదులు చౌకబారు రాజకీయ విన్యాసాలా?




ఇదే సమయంలో 'Towards Viable Universal Healthcare' పేరుతో అందరికీ ఆరోగ్యాన్ని అందించే ఆచరణసాధ్య నమూనాను సమగ్ర నివేదిక రూపంలో లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ నేతృత్వంలోని ప్రజాస్వామ్య పీఠం (ఫౌండేషన్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్-ఎఫ్‌డీఆర్) విడుదల చేసింది. ఆరోపణలు, నిందల రాజకీయ గోలలో.. చిత్తశుద్ధితో చేసిన ఆ ప్రయత్నానికి తగిన ప్రచారం లభించలేదు.

2022 నాటికి అందరికీ ఆరోగ్యం అందించాలనే భారతదేశ ఆకాంక్ష కాస్తా సరైన కేటాయింపులు, బలమైన రాజకీయ సంకల్పం, అంకితభావం గల నాయకత్వం, భాగస్వామ్య వర్గాల నిబద్ధత, కమ్యూనిటీ భాగస్వామ్యం లేక విఫలమైన తరుణంలో.. ఈ నివేదిక అందరికీ ఆరోగ్యాన్ని అతి తక్కువ వ్యయంతో, అతి ఎక్కువ ప్రయోజనంతో అందించే ఒక ఆచరణసాధ్య నమూనాను అందించే మార్గదర్శిగా అందుబాటులోకి వచ్చింది.

సరైన ఆరోగ్యం అందుబాటులో లేక చికిత్సలకు జేబులో నుండి చేస్తున్న ఖర్చు వల్ల ఏటా సుమారు ఆరు కోట్ల మంది భారతీయులు పేదరికంలోకి జారిపోతున్నారని, దాదాపు 50 లక్షల మంది దుర్భర దారిద్ర్యంలో కూరుకుపోతున్నారని పత్రం వెల్లడించింది. ప్రజల్లో అత్యధికులు (74.6 శాతం) ఖర్చు ఎక్కువవుతున్నా కూడా తమ వైద్య అవసరాల కోసం ప్రయివేటు రంగం మీదే ఆధారపడాల్సిన పరిస్థితి ఉందంటే, ఎన్నికయిన ప్రజాప్రతినిధులు సిగ్గుతో తలదించుకోవాలి.

ఆరోగ్యంపై ప్రభుత్వ వ్యయం అతి తక్కువగా ఉండటం (జీడీపీలో 1.2 శాతం మాత్రమే) ప్రజల ఆర్థిక స్థితిగతుల్ని తీవ్రంగా దెబ్బతీస్తోంది. ఒక అంచనా ప్రకారం, హైదరాబాద్‌లో ప్రతి 22,323 మందికి ఒక మద్యం దుకాణం ఉండగా, 77,792 మంది నివాసితులకు ఒక పోలీస్ స్టేషన్ మాత్రమే ఉంది. రాష్ట్ర రాజధానిలో కొవిడ్-19 చికిత్సకు ప్రతి 34,691 మంది నివాసితులకు ఒక ఆస్పత్రి మాత్రమే ఉంది. ఇక బెల్టుషాపులు విచ్చలవిడిగా ఉండి, వైద్య సదుపాయాలు అరకొరగా ఉన్న గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితిని ఊహించుకోవచ్చు.

ఎఫ్‌డీఆర్ కీలక సిఫార్సుల్లో ఒకటేమిటంటే, ప్రభుత్వ చెల్లింపులతో ఫ్యామిలీ డాక్టర్ నేతృత్వంలో పోటీ, ఎంపిక అవకాశాలున్న పటిష్ఠ ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థ ఏర్పాటు. ఇందులో పది మంది డాక్టర్ల బృందం నుండి తమకు నచ్చిన ఫ్యామిలీ ఫిజీషియన్‌ను ప్రజలు ఎంచుకోవచ్చు. ఈ డాక్టర్ ప్రస్తుతమున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆ ప్రాంతంలోని ఉచిత డయాగ్నొస్టిక్‌లు, కేంద్రీకృత ఔషధ సేకరణ ఏర్పాట్లతో అనుసంధానమై ఉంటారు. మనకు నిజమైన శ్రేయోభిలాషిగా ఉంటూ, లాభాపేక్ష లేకుండా సేవలందించే, మన ఆరోగ్యం గురించి శ్రద్ధ తీసుకునే మన సంప్రదాయ ఫ్యామిలీ వైద్యునిలా ఈ ఏర్పాటు కనిపిస్తుంది. రోగులు, డాక్టర్ల మధ్య లోపిస్తున్న మానవీయ స్పర్శను ఈ నమూనా తిరిగి తీసుకొస్తుంది.

ఫ్యామిలీ డాక్టర్ సిఫార్సు (రెఫరల్)తో రోగులకు ఆస్పత్రి చికిత్సలందించాలని, ద్వితీయ, తృతీయ స్థాయి ఆస్పత్రి సేవల్ని ఇన్‌పేషెంట్ సేవలకే పరిమితం చేయాలని, జిల్లా, ప్రభుత్వ బోధనాస్పత్రుల్ని నాణ్యమైన, ఖర్చుకు తగ్గ ఫలితాలనిచ్చే తృతీయ స్థాయి వైద్యానికి కేంద్రాలుగా చేయాలని నివేదిక సూచిస్తుంది. ప్రజల జేబులకు చిల్లు పెట్టకుండా.. ఈ నివేదిక ప్రభుత్వ - ప్రయివేటు భాగస్వామ్యమున్న వినూత్న పెట్టుబడి పద్ధతుల్ని ప్రతిపాదించింది. ఈ నమూనాను అమలు చేస్తే తెలంగాణకు రూ.1900 కోట్లు (బడ్జెట్‌లో 0.8%), ఆంధ్రప్రదేశ్‌కు రూ.2,600 కోట్లు (బడ్జెట్‌లో 1.13%) మాత్రమే ఏడాదికి అదనంగా ఖర్చవుతుంది.

**ఆస్పత్రులు, డాక్టర్లకు ర్యాంకులు**

ఆరోగ్య సంరక్షణ విషయంలో వరుస ప్రభుత్వాల చేతుల్లో ప్రజలు దగాపడ్డారనటంలో సందేహం లేదు. రకరకాల స్కీములున్న ప్రస్తుత ఆరోగ్య వ్యవస్థ పట్ల ప్రజలు వేసారిపోయారు. కొవిడ్-19 వారి భ్రమల్ని మరింత పటాపంచలు చేసింది. అధ్వాన్న మౌలిక వసతులు, అపరిశుభ్ర పరిసరాలతో ఎక్కువ శాతం ప్రభుత్వాస్పత్రులు రోగుల, వారి కుటుంబ సభ్యుల విశ్వాసాన్ని చూరగొనటంలో విఫలమయ్యాయి. డాక్టర్ కన్సల్టేషన్ ఫీజు, డయాగ్నొస్టిక్ పరీక్షల బిల్లులు, మందుల ధరలు - ఇలా పెరిగిపోతున్న ఖర్చులకు భయపడి అల్పాదాయవర్గాలు తమ ఆరోగ్యాన్ని పణంగా పెట్టి ఇతర చౌక వైద్య పద్ధతుల్ని ఆశ్రయిస్తున్నారు. ముఖ్యంగా ఆస్పత్రుల్లో తాము అందుకుంటున్న వైద్య సేవలు ఎలా ఉన్నాయో రోగుల అభిప్రాయాల్ని ఎప్పటికప్పుడు సేకరించే ఒక యంత్రాంగం ఉండాలని బలంగా భావిస్తున్నాను.

యూఎస్ 'హాస్పిటల్ కన్స్యూమర్ అసెస్‌మెంట్ ఆఫ్ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ అండ్ సిస్టమ్స్' (హెచ్‌సీఏహెచ్‌పీఎస్) సర్వే తరహాలో సమస్యలను తెలుసుకునేందుకు రోగుల నుండి అభిప్రాయాల్ని సేకరించాలి. 'ఆస్పత్రిలో ఉన్న సమయంలో నర్సులు మిమ్మల్ని ఎన్ని సందర్భాల్లో మర్యాదగా, గౌరవప్రదంగా చూశారు?' అనేది సర్వేలోని మొత్తం 27 బేసిక్ ప్రశ్నల్లో మొదటిది. సర్వేలో అభిప్రాయాన్ని బట్టి ఆస్పత్రులు, డాక్టర్లకు ర్యాంకులనివ్వాలి. ఆరోగ్య రంగంలో మరింత జవాబుదారీతనం తీసుకురావటానికి ఇది ఉపయోగపడుతుంది.

ఎట్టకేలకు ఆరోగ్య మంత్రిని నియమించాల్సిన అవసరాన్ని తెలంగాణ ముఖ్యమంత్రి గుర్తించటం ముదావహం. ఉప ఎన్నికల్లో తన మాజీ ఆరోగ్య మంత్రికి వ్యతిరేకంగా పోరాటంలో గట్టి ఎదురుదెబ్బతిన్న ఆర్థిక మంత్రి టి.హరీష్‌రావుకు ఆ మంత్రిత్వ శాఖను అప్పగించారు. ఈ కీలక సమయంలో ఆరోగ్య శాఖ వల్ల మరింత ప్రచారం, ప్రజాదరణ లభించే అవకాశం ఉన్నందువల్ల హరీష్‌కు కాకుండా కేటీఆర్‌కు అప్పగించాల్సింది.

ఏమైనా, వైద్య సాయం కోసం ప్రజలు కేటీఆర్ ట్విటర్ హ్యాండిల్‌ను నమ్ముకుంటున్నారు. ఆ డైనమిక్ యువనాయకుడు కూడా ఉత్సుకతతో ప్రతిస్పందిస్తూ అవసరంలో ఉన్న ప్రజలకు తన ఆపన్నహస్తాన్ని అందిస్తున్నారు. ఎవరెంత చేసినా అంతిమంగా అదనపు బాధ్యతలున్నవారికి అప్పచెప్పటం కంటే.. ఆరోగ్యశాఖకు పూర్తిస్థాయి మంత్రి ఉంటేనే ఫలితాలు బాగుంటాయి.

పటిష్ఠమైన ఆరోగ్య వ్యవస్థ నిర్మాణానికి డాక్టర్ జేపీ అపార అనుభవాన్ని, ఆయన బృందాన్ని ఉపయోగించుకుంటే నష్టం లేదు. రెండేళ్ల కాలానికి లోక్‌సత్తా వ్యవస్థాపకుడ్ని ఆరోగ్య సలహాదారుగా నియమించుకోవటంలో తప్పేముంది? ఈ రకమైన ఉదాత్త నిర్ణయం దేశంలో కొత్త రాజకీయ సంస్కృతికి నాంది పలుకుతుంది.

జేపీ వైద్య నేపథ్యమున్న ఉన్నత విద్యావంతుడు, పాలనా నిపుణుడు. మచ్చలేని వ్యక్తిత్వం కలిగిన, విలువలున్న రాజకీయవేత్త. నివేదికలోని తరువాయి మాటలో జేపీ చెప్పినట్లు.. నిజమైన రాజకీయం లక్ష్యం మనిషి ఆనందాన్ని పెంపొందించటం, ఆ ఆనందాన్ని సాధించటంలో కీలకమైన అంశం ఆరోగ్యం.

ఈ సలహాను పరిగణలోకి తీసుకునేముందు, సాధారణ ప్రజానీకం కోసం కేసీఆర్, కేటీఆర్, హరీష్ త్రయం డా॥ జేపీ బృందం రూపొందించిన ఆరోగ్య విధానం నమూనాపై మేధోమథన సమావేశాన్ని జరపాలి. జేపీ చెప్పినట్లు, సార్లూ, ఆరోగ్య రంగాన్ని మెరుగుపరిచే ఏ సానుకూల చర్య అయినా, ఓట్లను కూడా తెచ్చిపెడుతుంది.

**(ఆంగ్ల వ్యాసానికి స్వేచ్ఛానువాదం)**

# ఎఫ్‌డీఆర్/లోక్‌సత్తా ఆరోగ్య విధానాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తాం



ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ రూపొందించిన అందరికీ ఆరోగ్యం విధానాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని లోక్‌సత్తా పార్టీ తెలంగాణ రాష్ట్ర విభాగం నాయకులు తెలిపారు. పుస్తకం విడుదల సందర్భంగా ఎఫ్‌డీఆర్ కార్యాలయంలో వారు జేపీతో సమావేశమయ్యారు. ఆరోగ్య విధానం నమూనాను పార్టీలకతీతంగా అందరు ప్రజాప్రతినిధులకు కూడా అందచేసి మద్దతు కోరతామని, ప్రజల్లో కూడా అవగాహన కలిగించేందుకు కార్యక్రమాల్ని నిర్వహిస్తామని తెలిపారు. దళితులు, గిరిజనులు సహా అన్ని వర్గాల ప్రజలకూ కావలసిన ప్రధానాంశాలు నాణ్యమైన ఆరోగ్యం, విద్య అని, ఎన్నికల్లో పోటీ చేయకపోయినా ఇలాంటి అసలైన రాజకీయ కృషి చేస్తున్న ఉద్యమ పార్టీ లోక్‌సత్తా అని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మనపల్లి శ్రీనివాస్ అన్నారు. అతి తక్కువ ఖర్చుతో అందరికీ ఆరోగ్యాన్ని అందించే ఎఫ్‌డీఆర్ హెల్త్‌కేర్ పాలసీ అమలుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకొస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నందిపేట రవీందర్, శ్రీనివాసవర్మ, వంశీ ప్రసాద్, పెద్దగళ్ల రాజీవ్, వైబీఐ అధ్యక్షుడు బొర్రా శివరామకృష్ణ తదితర నేతలు పాల్గొన్నారు.

**రైతులకు ఆదాయం పెంచే విధానాల కోసం పనిచేద్దాం**

వ్యవసాయ రంగ సంక్షోభానికి పాలకుల పాపాలే ప్రధాన కారణమని తుమ్మనపల్లి శ్రీనివాస్ అన్నారు. జాతీయ స్థాయిలో, రాష్ట్రంలో అధికార పార్టీలు తెలంగాణ రైతులను రాజకీయ క్రీడలో పావులుగా మార్చాయన్నారు. ప్రభుత్వమే ధర్నాలకు దిగితే ఇక సమస్యలను పరిష్కరించటం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. దళారులకు, రాజకీయ నిరుద్యోగులకు ఆశ్రయంగా మారిన వ్యవసాయ మార్కెట్లను రైతులకే అప్పగించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజల్లో ఆదరణ ఉన్న నాయకుడని, రాజకీయ డ్రామాలాడాల్సిన అవసరం లేదని, రాష్ట్ర ప్రభుత్వం వాస్తవాలను ప్రజల ముందుంచాలన్నారు. యూనియన్ ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ మార్కెట్‌లో రైతులకు ఆదాయం వచ్చేలా విధానాలను రూపొందించాలన్నారు. బీజేపీ కూడా ఢిల్లీలో ఒక మాట, రాష్ట్రంలో మరోమాట కాకుండా హేతుబద్ధ విధానాలకు కట్టుబడి ఉండాలన్నారు. వ్యవసాయ సంస్కరణలకు లోక్‌సత్తా పూర్తిస్థాయి సహకారాన్ని అందిస్తుందన్నారు.

## అకాల వర్షాల బాధిత రైతులను ఆదుకోవాలి

అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని లోక్‌సత్తా పార్టీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు కె. ఆనందాచారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్టీ నేతలతో కలిసి ఆయన పత్తికొండ మండలంలోని మరిమాన్ తండా, ఎద్దులదొడ్డి, పెండేకల్, జొన్నగిరి, చందోలి తదితర ప్రాంతాల్లో పంట పొలాలను పరిశీలించారు. వేరుసెనగ, కంది, టమాట పంటలు దెబ్బతిన్నాయని, నల్లరేగడి భూముల్లో రబీ సీజన్లో వేసిన పప్పుసెనగ, ఉల్లి, వాము పంటలు కూడా దెబ్బతిన్నాయన్నారు. గత సంవత్సరంలాగే ఈ ఏడాది కూడా వర్షాలు రైతులకు నష్టాల్ని కలిగించాయన్నారు. ఎకరాకు రూ.30 వేల చొప్పున రైతులు ఖర్చు చేశారని, వారికి తగిన నష్టపరిహారంతోపాటు 90 శాతం సబ్సిడీపై విత్తనాలు పంపిణీ చేయాలని, కొత్తగా బ్యాంకు రుణాలకు వెసులుబాటు ఇవ్వాలని కోరారు. పత్తికొండ అధ్యక్షుడు జయరాముడు, ప్రధాన కార్యదర్శి ప్రసాద్, లక్ష్మణస్వామి, శ్రీనివాసులు, ఎర్రిస్వామి, రంగప్పరాజు, రంగస్వామి, చాంద్ బాషా తదితరులు పాల్గొన్నారు.



# లోక్‌సత్తాకు గొప్ప స్నేహితుడు, మద్దతుదారుడు




## -సిరివెన్నెలకు జేపీ ఘననివాళి-

సిరివెన్నెల సీతారామశాస్త్రి అకాల మరణం తెలుగు సాహిత్య, సినిమా రంగాలకు భారీ వెలితి అని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. అసాధారణ ప్రతిభాశాలి కవిగా, గొప్ప పౌరుడు, మంచి మనిషిగా ఆయన తన చుట్టూ అనేక జీవితాల్ని సుసంపన్నం చేశారన్నారు. తనకు, లోక్‌సత్తా ఉద్యమానికి ఆయన గొప్ప స్నేహితుడు, మద్దతుదారుడని జేపీ ఘననివాళులర్పించారు.

# ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు వైద్య సేవల్ని ప్రాథమిక సెంటర్లలోనే అందించాలి..

ప్రతి ఎయిడ్స్ బాధితునికీ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే దీర్ఘకాలిక పింఛను మంజూరు చేయాలని లోక్‌సత్తా పార్టీ ఏపీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ డిమాండ్ చేశారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులను ఆదుకోవాలని విజయనగరం జిల్లా కలెక్టరేట్ వద్ద బాధితులతో కలసి ఆయన నిరసన దీక్ష చేశారు. జోతిబా పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించిన అనంతరం మాట్లాడుతూ, ఒక్క విజయనగరం జిల్లాలోనే సుమారు ఏడు వేల మంది ఎయిడ్స్ వ్యాధితో బాధపడుతున్నారని, ఏఆర్టీ సెంటర్ నుండి మందులు తీసుకోవటానికి కూడా జిల్లాలోని ఇతర ప్రాంతాల నుండి వచ్చే స్తోమతు లేక ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరోగ్యశ్రీ ఉన్నా కూడా ఎయిడ్స్ రోగులకు ఆపరేషన్లు చేయటానికి ఆస్పత్రులు ముందుకు రావటం లేదన్నారు. అవసరమైతే తప్పనిసరిగా శస్త్రచికిత్స చేయాలనే నిబంధన పెట్టాలన్నారు. లోక్‌సత్తా ఆరోగ్య విధానం ప్రతిపాదిస్తున్నట్లు ఎక్కడికక్కడ ఫ్యామిలీ డాక్టర్ నేతృత్వంలో ప్రాథమిక ఆరోగ్య సెంటర్లను ఏర్పాటు చేసి ఎయిడ్స్ రోగులకు మందులు, పరీక్షలు, ఇతరత్రా అవసరాలు ఉచితంగా అందించాలన్నారు. పౌష్టికాహార సరఫరా పర్యవేక్షణను కూడా ప్రాథమిక ఆరోగ్యం పరిధిలోకి తేవాలన్నారు. ఈ డిమాండ్ల కోసం త్వరలో



రాష్ట్రవ్యాప్త కార్యక్రమం చేపడతామన్నారు. విజయ ఎయిడ్స్ పాజిటివ్ నెట్‌వర్క్ జిల్లా అధ్యక్షురాలు మజ్జి పద్మావతి మాట్లాడుతూ, జిల్లాలో, రాష్ట్రంలో ఎయిడ్స్ బాధితులు రోజురోజుకీ పెరిగిపోతున్నారని, సరైన వైద్య సేవలు అందక పలువురు చనిపోతున్నారన్నారు. ఎయిడ్స్ వ్యాధి ఇప్పుడేమీ ప్రాణాంతకం కాదని, వారికి సానుభూతి కన్నా సరైన వైద్యం కావాలన్నారు. దీక్షా కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్ ఇజ్రాస్ అసోసియేషన్ అధ్యక్షుడు కొండబాబు, దవడ మీనా, స్రవంతి, ప్రజాసంఘాల జిల్లా ప్రతినిధులు ఇప్పవలస గోపి, మమ్ముల తిరుపతిరావు, ఎన్.వి.ఎన్ నాగేశ్వరరావు, చౌదరి, ఇజ్రాయెల్ కనకరాజు, ఆచారి తదితరులు పాల్గొన్నారు.

### ఆంగ్లేయుల సవాలుకి సమాధానమే మన రాజ్యాంగం

దేశంలోని ప్రజలందరికీ ఆమోదయోగ్యమైన రాజ్యాంగాన్ని భారతీయులు రాసుకోలేరని బ్రిటీష్ వారు చేసిన సవాలుగా దీటుగా బాబా సాహెబ్ అంబేద్కర్ నేతృత్వంలో ఇచ్చిన సమాధానమే మన రాజ్యాంగమని భీశెట్టి అన్నారు. వివక్ష లేకుండా అందరికీ ఎదిగే అవకాశాలను అందించేందుకు రాజ్యాంగం స్పష్టమైన భరోసానిస్తుందన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా విజయనగరం జిల్లా జామి మండలం అట్టాడ బీఎన్ఆర్ ఆశ్రమంలో జరిగిన సమావేశంలో బాబ్జీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రాజ్యాంగానికి, సమాజానికి మధ్య అంతరాన్ని తొలగించేందుకు తగిన విధానాలను రూపొందించి వాటిని అమలు చేయటమే రాజకీయం చేయాల్సిన పని అని, అలాంటి అసలైన రాజకీయం కోసమే లోక్‌సత్తా పోరాడుతోందని వివరించారు. సామాజిక కార్యకర్త రాయవరపు రామ సత్యం తదితరులు ప్రసంగించారు.

అసర్-2021

# పిల్లల చదువులకు కరోనా కష్టాలు

- డి. సోమసుందర్



అసర్-2021 నివేదికను నవంబర్ 17న ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఒక కార్యక్రమంలో విడుదల చేసారు. అసర్ నివేదికల వరుసలో ఇది 16వ నివేదిక. 2005 నుండి 2014 వరకూ ప్రతి ఏటా అసర్ నివేదికలు వెలువడగా ఆ తర్వాత ఏడాది విడిచి ఏడాదికి ఒక నివేదిక చొప్పున వెలువడ్డాయి. గ్రామీణ భారతదేశంలోని 5-16 వయోవర్గంలోని విద్యార్థుల పాఠశాల నమోదు, అభ్యసనా స్థాయి, పఠన, గణిత అంశాలలో వారి సామర్థ్యాలను అంచనా వేస్తూ వచ్చింది.

గత సంవత్సరం కోవిడ్ కారణంగా అసర్ ప్రయత్నానికి అవరోధం ఏర్పడింది. మార్చి 2020 నుండి పాఠశాలలు నిరవధికంగా మూతపడ్డాయి. పాఠశాలలు, విద్యార్థులు, కుటుంబాలు కోవిడ్‌తో ప్రభావితమైన తీరును పరిశీలించడం ఒక ప్రాధాన్యతాంశంగా ముందుకు వచ్చింది. పిల్లల చదువులపై కరోనా ప్రభావాన్ని పరిశీలించడానికి 2020లో అసర్ ఒక ప్రయత్నం చేసింది. అందుకోసం జాతీయస్థాయిలో ప్రాతినిధ్యం వహించగలిగే ఒక నమూనాను అసర్ తీసుకుంది. ఫోన్ ఆధారంగా సర్వే నిర్వహించే పద్ధతిని రూపొందించి పిల్లలకు చదువులు అందుబాటులో ఉన్నదీలేనిదీ తెలుసుకున్నది.

కరోనా పరిస్థితులు మరో ఏడాది కూడా కొనసాగాయి. దాంతో జాతీయస్థాయిలో క్షేత్రస్థాయి అధ్యయనం నిర్వహించే పరిస్థితి లేకపోయింది. అందువల్ల 2021లో కూడా ఫోన్ ఆధారిత సర్వే పద్ధతినే అనుసరించాల్సి వచ్చింది. లాక్‌డౌన్ తొలిసారి విధించిన 18 నెలల తర్వాత 2021 సెప్టెంబర్-అక్టోబర్ నెలల్లో అసర్-2021 సర్వే నిర్వహించడం జరిగింది. 5-16 వయోవర్గం విద్యార్థులు లాక్‌డౌన్ కాలంలో ఏ విధంగా చదివారో తెలుసుకున్నది. అలాగే విద్యాసంస్థలు క్రమేపీ తెరుచుకోవడం మొదలుకావడంతో ఎదురవుతున్న కొత్త సవాళ్ళను కుటుంబాలూ, విద్యార్థులు ఎదుర్కున్న తీరును అసర్-2021 అధ్యయనం చేసింది.

అసర్-2021 సర్వే దేశంలోని 25 రాష్ట్రాలలో, మూడు కేంద్రపాలిత ప్రాంతాలలో జరిగింది. 76,706 కుటుంబాలకు చెందిన 75,234 మంది విద్యార్థుల్ని అసర్ కలుసుకున్నది. అలాగే 7,299 ప్రాథమిక పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులనుగానీ, ప్రధానోపాధ్యాయులనుగానీ అసర్ కలుసుకున్నది.

**పాఠశాల నమోదులో కొన్ని ధోరణులు**

తొలినుంచీ అసర్ సర్వేల్లో పాఠశాల నమోదులో కన్పించే ధోరణులను పరిశీలించడం జరుగుతోంది. 2021, 2020, 2018 సంవత్సరాలలోని నమోదు గణాంకాలను పోల్చి చూసినపుడు కొన్ని ఆసక్తికరమైన ధోరణులు వెల్లడయ్యాయి.

దేశవ్యాప్తంగా విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల నుండి ప్రభుత్వ పాఠశాలలకు మరలుతున్న ధోరణి ఒకటి కన్పిస్తున్నది. 6-14 వయోవర్గంలో ప్రైవేటు పాఠశాలల్లో నమోదైన విద్యార్థులు 2018లో 32.5 శాతం ఉండగా 2021 నాటికి ఈ సంఖ్య 24.4 శాతంగా తగ్గింది. బాలురు, బాలికలు అనే తేడా లేకుండా అన్ని తరగతుల విద్యార్థుల్లోనూ ప్రభుత్వ పాఠశాలల వైపు మొగ్గు స్పష్టంగా కన్పించింది. అదే సమయంలో ప్రైవేటు పాఠశాలల్లో నమోదౌతున్నవారిలో బాలుర సంఖ్య ఎక్కువగానే ఉంటోంది.

బడిలో అస్సలు నమోదుకాని పిల్లల సంఖ్య 2018లో 1.4 శాతం ఉంది. అది 2020 నాటికి 4.6 శాతానికి పెరిగింది. కరోనా కారణంగా పిల్లల బడి నమోదు సరిగ్గా జరగకపోవడం మనకు తెలిసినదే! 2021లో కూడా బడి బైటి పిల్లల సంఖ్య దాదాపు అంతే ఉంది. 15-16 వయోవర్గం విద్యార్థుల్లో ప్రభుత్వ పాఠశాలల్లో నమోదైనవారు 2018లో 57.4 శాతం ఉండగా, 2021 నాటికి వారి సంఖ్య 67.4 శాతానికి పెరిగింది. అదే వయోవర్గం విద్యార్థులకు సంబంధించి ప్రైవేటు పాఠశాలల నమోదు 2018లో 12.1 శాతం ఉండగా, 2021లో వారి సంఖ్య 6.6 శాతానికి పడిపోయింది.

ప్రభుత్వ పాఠశాలల నమోదుకు సంబంధించిన పెరుగుదలలో రాష్ట్రాలవారీ వ్యత్యాసాలు గణనీయంగా కన్పిస్తాయి. ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, పంజాబ్, హర్యానా, మహారాష్ట్ర, తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలలో ప్రభుత్వ పాఠశాలలో పెరిగిన నమోదు, జాతీయస్థాయి పెరుగుదల రేటును పెంచడంలో తోడ్పడింది. అయితే ఈశాన్య రాష్ట్రాలలో మాత్రం ప్రభుత్వ పాఠశాలల నమోదు గణనీయంగా పడిపోయింది. బడిలో అస్సలు నమోదుకాని విద్యార్థుల సంఖ్య కూడా అదే దామాషాలో పెరగడం చూడవచ్చు.

కరోనా కారణంగా మూతపడిన పాఠశాలలను ఇప్పుడిప్పుడే తెరుస్తున్నారు. అందువల్ల ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు పెరుగుతున్న ధోరణి తాత్కాలికమా లేక భారతీయ గ్రామీణ విద్యారంగంలో చోటుచేసుకుంటున్న ఒక పరిణామమా అనేది ప్రస్తుతానికి చెప్పలేం!

**ప్రైవేటు ట్యూషన్లు**

పిల్లలు తమ చదువులకు తోడ్పాటుగా ప్రైవేటు ట్యూషన్లు తీసుకుంటారన్న సంగతి తెలిసిందే! అసర్ ప్రతి ఏటా ట్యూషన్ల సమాచారాన్ని సేకరిస్తుంటుంది. 2021లో ట్యూషన్లు గురించిన సమాచారం కొత్త ధోరణిని వెలుగులోకి తెచ్చింది. ప్రైవేటు ట్యూషన్లు తీసుకుంటున్న విద్యార్థుల సంఖ్యలో పెరుగుదల జాతీయ స్థాయిలోనే కన్పిస్తోంది. 2018 నాటికి ప్రైవేటు ట్యూషన్లు తీసుకుంటున్నవారు 30 శాతం లోపు ఉండగా 2021 నాటికి అలాంటి విద్యార్థులు 40 శాతం వరకూ ఉన్నారు. ఈ పెరుగుదలలో బాలురు-బాలికల తేడా లేదు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల వ్యత్యాసం లేదు. అన్ని తరగతుల పిల్లలూ ఇందులో ఉన్నారు.

తల్లి-తండ్రులు ఇంటిదగ్గర పిల్లల చదువులకు తోడ్పాటు ఇవ్వడాన్నీ, ట్యూషన్లు చెప్పించడాన్నీ ఆయా కుటుంబాల ఆర్థిక స్థితికి సూచికగా పరిగణిస్తుంటాం! అయితే ఆర్థికస్థితితో సంబంధం లేకుండానే ట్యూషన్ చెప్పించుకునే విద్యార్థుల సంఖ్య పెరిగిందని అసర్-2021 వెల్లడించింది.

తక్కువ విద్యాస్థాయి కలిగిన తల్లి-తండ్రుల పిల్లల్లో ట్యూషన్ చెప్పించుకునే విద్యార్థులు 12.6 శాతం పెరిగారు. ఎక్కువ విద్యాస్థాయి కలిగిన తల్లి-తండ్రుల పిల్లల్లో ట్యూషన్ చెప్పించుకునే విద్యార్థుల పెరుగుదల 7.2 శాతం మాత్రమే ఉండటం గమనార్హం.

పాఠశాలలు తిరిగి తెరిచిన ప్రాంతాల్లో ట్యూషన్లు చెప్పించుకునే విద్యార్థుల సంఖ్య తక్కువగా కన్పించింది. ఇప్పటికీ పాఠశాలలు తెరవని ప్రాంతాల్లో ట్యూషను చెప్పించుకునే విద్యార్థుల సంఖ్య ఎక్కువగానే ఉంది. ఒక్క కేరళ మినహా దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో ట్యూషన్ చెప్పించుకునే విద్యార్థుల సంఖ్యలో పెరుగుదల స్పష్టంగా కన్పించింది.

**స్మార్ట్ ఫోన్ల వినియోగం**

విద్యాసంస్థల మూసివేతతో బోధనాభ్యసన కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ పరిస్థితుల్లో స్మార్ట్ ఫోన్లు ఒక ప్రధాన ఆధారంగా అందివచ్చాయి. స్మార్ట్ ఫోన్లులేని పేద కుటుంబాల విద్యార్థులు చదువులో వెనుకబడిపోయే పరిస్థితి తలెత్తింది.

నిజానికి 2018 తర్వాత స్మార్ట్ ఫోన్లు ఉన్న తల్లి-తండ్రుల సంఖ్య రెట్టింపు అయ్యింది. స్మార్ట్ ఫోన్లు కలిగిన కుటుంబాలు 2018లో 36.5 శాతం ఉండగా, ఆ కుటుంబాలు 2021 నాటికి 67.6 శాతానికి పెరిగాయి.

ప్రైవేటు పాఠశాలల్లో చదివే విద్యార్థుల తల్లి-తండ్రుల్లో స్మార్ట్ ఫోన్ ఉన్నవారు 79 శాతం కాగా, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల తల్లి-తండ్రుల్లో స్మార్ట్ ఫోన్ కలిగినవారు 63.7 శాతం ఉన్నారు. ఎక్కువ విద్యాస్థాయి కలిగిన తల్లితండ్రులలో స్మార్ట్ ఫోన్ల వినియోగం కూడా ఎక్కువగానే ఉంది. 5వ తరగతి, అంతకంటే తక్కువ విద్యాస్థాయి కల్గిన తల్లి-తండ్రుల్లో స్మార్ట్ ఫోన్ కలిగున్నవారు 50 శాతం మాత్రమే! అయితే 9వ తరగతి అంతకంటే ఎక్కువ చదువుకున్న తల్లి-తండ్రుల్లో స్మార్ట్ ఫోన్ ఉన్నవారు 80 శాతం ఉన్నారు.

అయితే ఇంటిలో స్మార్ట్ ఫోన్ ఉన్నంత మాత్రాన అది విద్యార్థులకు అందుబాటులో ఉన్నదని చెప్పడానికి వీల్లేదు. నమోదైన విద్యార్థుల్లో తమ ఇంటి వద్ద స్మార్ట్ ఫోన్ ఉన్నవారు 67.6 శాతం ఉన్నారు. అయితే అందులో 26.1 శాతం విద్యార్థులకు స్మార్ట్ ఫోన్ అందుబాటులో లేదని వెల్లడయ్యింది. పైతరగతులు చదివే విద్యార్థులకు అందుబాటులో ఉన్నస్థాయిలో కింది తరగతుల పిల్లలకు స్మార్ట్ ఫోన్లు అందుబాటులో ఉండటం లేదు.

**పిల్లలకు ఇంటిలో విద్యాసంబంధ తోడ్పాటు**

పిల్లలకు తమ తమ ఇళ్లలో విద్యాసంబంధమైన తోడ్పాటు ఏ మేరకు లభిస్తున్నదనే అంశాన్ని అసర్-2021 గుర్తించే ప్రయత్నం చేసింది. 2020లో కూడా ఈ సమాచారాన్ని అసర్ సేకరించింది. గత సంవత్సరంతో పోలిస్తే పిల్లలకు ఇంటిలో లభించే విద్యాసంబంధ తోడ్పాటు లభించిందని అసర్-2021 వెల్లడించింది. తమ ఇంటిలో తగిన తోడ్పాటు లభిస్తున్నదని చెప్పిన విద్యార్థులు 2018లో 75 శాతం ఉండగా, 2021 నాటికి అలాంటి విద్యార్థులు 66.6 శాతం మాత్రమే ఉన్నారు. పైతరగతులు చదివే పిల్లల్లో తోడ్పాటు పొందిన వారి సంఖ్య ఇంకా తక్కువగా ఉంది. అలాగే విద్యాసంస్థలు ప్రారంభం అయిన ప్రాంతాల్లో ఇంటి నుండి విద్యాసంబంధ తోడ్పాటు పొందే విద్యార్థుల సంఖ్య బాగా తగ్గిపోయింది. ప్రైవేటు పాఠశాలల్లో చదివే విద్యార్థుల్లో సైతం ఇదే ధోరణి కన్పించింది. బడి తెరవక ముందు ఇంటి నుండి తోడ్పాటు పొందినవారు 75.6 శాతం ఉండగా, బడి తెరిచాక తోడ్పాటు పొందినవారు 70.4 శాతం ఉన్నారు.

**అభ్యసనా సామాగ్రి**

పిల్లలకి పాఠ్యపుస్తకాలు, అభ్యసనా సామాగ్రి అందుతున్న తీరును అసర్-2020 పరిశీలించింది. అలాగే 2021లో సైతం అదే ప్రయత్నం చేసింది. నమోదైన విద్యార్థుల్లో ప్రస్తుతం తమ తరగతికి చెందిన పాఠ్యపుస్తకాలు అందుకున్నామని చెప్పిన విద్యార్థులు 91.9 శాతంగా ఉన్నారు. గతంతో పోలిస్తే పాఠ్యపుస్తకాలు అందుబాటుకు రావడం చాలా మెరుగ్గా ఉందని తేలింది. ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల వ్యత్యాసం లేకుండా అందరికీ పాఠ్యపుస్తకాలు అందుబాటులో ఉంటున్నాయని అసర్-2021 ధృవీకరించింది. నమోదైన విద్యార్థుల్లో ఎక్కువ శాతం మంది తమకు విద్యాసంబంధ సామాగ్రిగానీ, కృత్యాల పరికరాలు గానీ ఉపాధ్యాయుల నుండి అందాయని తెలిపారు. గత సంవత్సరం ఈ సంఖ్య 35.6 శాతంగా ఉంది. విద్యాసంస్థలు తెరిచిన ప్రాంతాల్లో ఈ సంఖ్య 46.4 శాతం కాగా, ఇంకా బడులు తెరవని చోట ఈ సంఖ్య 39.8 శాతంగా ఉంది. బడులు తెరిచినచోట ఉపాధ్యాయులు పిల్లలకు హోమ్‌వర్క్ ఇవ్వడం వల్ల అక్కడ ఆ మేరకు సంఖ్య ఎక్కువగా కన్పిస్తుంది.

**అసర్ నిర్ధారణలు - విధాన నిర్ణయాలు**

పద్దెనిమిది నెలలపాటు మూసివేసిన విద్యాసంస్థలను ఈమధ్యే తెరిచారు. బడుల మూసివేత ప్రభావాన్ని అంచనా వేయాలి. మూసివేత వల్ల తలెత్తిన సమస్యల పరిష్కారానికి అవసరమైన తగు విధానాలను రూపొందించాలి. అసర్-2021 నివేదిక సారాంశాన్ని బట్టి మనం కొన్ని నిర్ధారణలు చేయవచ్చు.

- ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు గణనీయంగా పెరిగింది. ఈ పెరుగుదలకు తగినట్లుగా పాఠశాలలు, ఉపాధ్యాయులు సంసిద్ధం కావాల్సి ఉంది.
- విద్యాసంస్థలు తెరిచాక పిల్లలకు ఇంటిలో లభించే విద్యాసంబంధ తోడ్పాటులో తగ్గుదల కన్పించింది. బాగా చిన్న పిల్లలకు మాత్రమే ఇంటిలో తగిన తోడ్పాటు లభిస్తున్నది. జాతీయ విద్యావిధానం సూచించినట్లు పిల్లల అభ్యసనంలో తల్లి-తండ్రుల భాగస్వామ్యాన్ని పెంచాలి. అందుకు అనువుగా విద్యాభివృద్ధి ప్రణాళికను రూపొందించాలి.
- కరోనా రోజుల్లో విద్యార్థులు తమ తమ ఇళ్ళ దగ్గర పలు రకాల అభ్యసనా పద్ధతులను అనుసరించారు. పాఠశాల అందించిన తోడ్పాటుతోపాటు అదనంగా తల్లి-తండ్రుల నుండి, ప్రైవేటు ట్యూటర్ల నుండి తోడ్పాటు పొందారు. సంప్రదాయక బోధనాభ్యాస ప్రక్రియకు తోడు మరింత ప్రభావవంతమైన మిశ్రమ అభ్యసనా పద్ధతుల్ని కలగలిపి పిల్లల అభ్యసనా స్థాయిలను మెరుగుపరచాలి.
- ప్రైవేటు ట్యూషన్లు చెప్పించుకునే విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. విద్యాసంస్థల మూసివేత, అనిశ్చిత పరిస్థితుల కొనసాగింపు ఫలితంగా ఈ సంఖ్య మరింత పెరుగుతోంది. దాంతో డబ్బు చెల్లించి ట్యూషన్ చెప్పించుకోగలిగే విద్యార్థులకూ అలా చెప్పించుకోలేని విద్యార్థులకూ మధ్య అభ్యసనా స్థాయిల్లో వ్యత్యాసం ఏర్పడుతోంది. ఈ సమస్యపై దృష్టి సారించాలి.
- తల్లి-తండ్రుల విద్యాస్థాయి తక్కువ ఉన్న పిల్లలకూ, స్మార్ట్ ఫోన్ లేని కుటుంబాల పిల్లలకూ అభ్యసనా అవకాశాలు సన్నగిల్లిపోతుంటాయి. అయితే అలాంటి కుటుంబాలు కూడా తమ పిల్లలకు తోడ్పాటు ఇవ్వాలనే పట్టుదలతో ఉన్నాయి. పిల్లల చదువుల కోసం స్మార్ట్ ఫోన్లు కొనుగోలు చేస్తున్న తల్లి-తండ్రులు ఉన్నారు. విద్యాసంస్థలు తెరిచిన తర్వాత ఇలాంటి విద్యార్థులపై ప్రత్యేకంగా దృష్టి సారించాలి. వారికి తగిన తోడ్పాటు అందించాలి.
- ఇంటిలో స్మార్ట్ ఫోన్ ఉన్నంత మాత్రాన అది పిల్లల చదువుకు అందుబాటులో ఉన్నట్లు కాదని అసర్-2021 వెల్లడించింది. భవిష్యత్తులో ఆన్‌లైన్ తరగతులు నిర్వహించాల్సి వచ్చినపుడు, డిజిటల్ కంటెంట్‌ను, డిజిటల్ సామాగ్రిని అందించాల్సి వచ్చినప్పుడూ విద్యార్థులకు ఇంటిలో ఉండే అనుకూలతలను దృష్టిలో ఉంచుకోవాలి.

విద్యారంగంలో డిజిటల్ డివైడ్ వల్ల ఎదురయ్యే సమస్యలను అధిగమించే ప్రయత్నం జరగాలని అసర్-2021 సూచించింది.

## లోక్‌సత్తా రూపొందించిన ప్రత్యామ్నాయ మహిళా బిల్లును

# పట్టుపట్టి సాధించుకోవాలి




వచ్చే ఏడాది ప్రారంభంలో జరగనున్న ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో మహిళలకు 40% టికెట్లు కేటాయించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది.

'మహిళా శక్తిని రాష్ట్ర ప్రభుత్వం పెన్షన్లు, వంటగదికి పరిమితం చేసింది. రూ.2,000, గ్యాస్ సిలిండర్‌తో అంతా బాగుందని ప్రభుత్వం అనుకుంటోంది. ఎవరూ మిమ్మల్ని రక్షించరు. మిమ్మల్ని రక్షిస్తున్నామని చెప్పేవాళ్లే రక్షణ పొందుతారు. మనం కలసికట్టుగా ఈ దేశ, రాష్ట్ర రాజకీయాలను మారుద్దాం. మేం బలమైన మహిళా అభ్యర్థులను గుర్తించి, వారికి మద్దతుగా నిలుస్తాం. బలోపేతమయ్యేలా చేస్తాం. కేవలం కులం, మతం ఆధారంగా కాకుండా ప్రతిభ ఆధారంగా ఈ టికెట్లను కేటాయిస్తాం. పురుషాధిక్య దౌష్ట్యానికి బలయిన బాధితులతోపాటు, ప్రధానమంత్రి స్థాయి వరకు ఎదగాలనుకుంటున్న మహిళలందరూ తమ ఆకాంక్షలకనుగుణంగా ఎదిగేందుకు పార్టీ నిర్ణయం దోహదం చేస్తుంది" అని కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీ మహిళలనుద్దేశించి పేర్కొన్నారు.

ఉత్తరప్రదేశ్ మహిళలకు ప్రత్యేక మేనిఫెస్టోను రూపొందించినట్లు కూడా ఆమె ప్రకటించారు.

ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ ఇలా ప్రకటించకముందే, మహిళలకు 33% టికెట్లు కేటాయిస్తామని ఒడిషాలో నవీన్ పట్నాయక్, పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ ప్రకటించి 2019 సాధారణ ఎన్నికల్లో అమలు కూడా చేశారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో మమత మహిళలకు 50 సీట్లనే కేటాయించినప్పటికీ ప్రస్తుత పరిస్థితుల్లో అది గణనీయ సంఖ్యగానే చెప్పుకోవచ్చు. అలాగే, ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీకి పెద్దగా సీట్లు గెలిచే అవకాశం లేదనే విస్పష్ట అంచనాలూ ఉన్నాయి. ఇంతమంది మహిళలకు టికెట్లిస్తోంది కాబట్టి కాంగ్రెస్‌కు మహిళలు ఓటు వేయాలనుకున్నా, ఓడిపోయే పార్టీ కాబట్టి మనకున్న ఎన్నికల వ్యవస్థలో ఓటు వృథా అవుతుందని భావించి వేయకపోవచ్చని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రియాంక గాంధీ ప్రకటనకు పెద్ద ప్రాధాన్యత ఏముందనే వాదనలు వినిపిస్తున్నాయి. అయితే ఇవన్నీ ఉన్నా కూడా.. యూపీలో కాంగ్రెస్ పార్టీ ప్రకటనకు ప్రాముఖ్యత ఉంది.

ఒక ప్రధాన జాతీయ పార్టీ ఒక పెద్ద రాష్ట్రంలో మహిళలకు ఇలా 40% సీట్లు కేటాయిస్తామని ప్రకటించటం తీసిపారేయల్సిన విషయం కాదు. ఇదే ఒరవడిని ఇతర రాష్ట్రాల్లో కూడా ఆ పార్టీ కొనసాగిస్తే, బీజేపీ సహా మిగతా పార్టీలు కూడా అనుసరించకతప్పదు.

మన వద్ద మహిళల గెలుపునకు పురుషుల నుండి కూడా పెద్దగా ఎటువంటి అవరోధాలూ లేవు, అలాగే మహిళా ఓటర్లూ పెద్ద సంఖ్యలో ఉన్నారు కాబట్టి.. కాంగ్రెస్ గెలిచే రాష్ట్రాల్లో

మహిళలు పెద్ద సంఖ్యలో గెలుస్తూ మహిళా ఓటర్లు కూడా వారికి మద్దతిస్తుంటే ఆ ప్రభావం అన్ని పార్టీల మీదా పడుతుంది. కాకపోతే, టికెట్ల కేటాయింపులో మహిళల సంఖ్యను ఎక్కువగా చూపుతూ ఎన్నికల్లో ఓడిపోయే అవకాశమున్న స్థానాలనే వారికి ఎక్కువగా కేటాయించకుండా మాత్రం ముందు జాగ్రత్త అవసరం. ఇందుకోసం, ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ 1998లోనే చేసిన యూనిట్ పద్ధతి సూచనకు చట్టబద్ధత కల్పించి అమలు చేయవచ్చు. తద్వారా పార్టీలకు తగిన వెసులుబాటునిస్తూనే.. కొన్ని ప్రాంతాలకే, ఓడిపోయే సీట్లకే మహిళలను పరిమితం చేయకుండా నియంత్రించవచ్చు.

అయితే కాంగ్రెస్ పార్టీ మిగతా రాష్ట్రాల్లో, ముఖ్యంగా గెలిచే రాష్ట్రాల్లో మహిళలకు సీట్ల కేటాయింపులో ఎంత చిత్తశుద్ధితో, సంకల్పంతో వ్యవహరిస్తుంది అన్నది పెద్ద ప్రశ్నార్థకమే.

రిజర్వేషన్లేమీ లేకుండా లోక్‌సభలో మహిళా ఎంపీల సంఖ్య 33 శాతానికి చేరుకోవాలంటే మరో 40 ఏళ్లు పడుతుందని డాక్టర్ కరోల్ స్రే అనే బ్రిటన్ ప్రొఫెసర్ లెక్కేశారు. అంటే మరో ఎనిమిది సార్వత్రిక ఎన్నికల దాకా అవకాశం లేదు. పలువురు మహిళా ఎంపీలు, పురుష ఎంపీలను ఇంటర్వ్యూ చేసిన అనంతరం కరోల్ ఈ నిర్ధారణకు వచ్చారు.

ఈ మొత్తాన్నీ బేరీజు వేసుకుంటే.. మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంటులో ఆమోదించటం తప్పనిసరి అవసరం.

మహిళా బిల్లుకు వ్యతిరేకంగా ఏ ప్రధాన పార్టీ లేదు. ప్రస్తుతం జాతీయ స్థాయిలో అధికారంలో ఉన్న నరేంద్ర మోదీ ప్రభుత్వం వచ్చే సార్వత్రిక ఎన్నికలకు ఈ చట్టాన్ని ఓ అస్త్రంలా ఉపయోగించుకుంటుందనే అంచనాలూ ఉన్నాయి. అలాగే బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టి ఈ ఏడాదికి పాతికేళ్లయింది. ఈ సందర్భంగా మళ్లీ కొంత చర్చ కూడా జరిగింది. మహిళలను ఓటు బ్యాంకుగా గుర్తించిన దశ నుండి వారికి సముచిత ప్రాతినిధ్యాన్ని రాష్ట్ర, జాతీయ స్థాయిలో కూడా ఆమోదించే దశకు రాజకీయాలు చేరుకుంటున్నాయి. మహిళా రిజర్వేషన్ బిల్లులోని లోపాల్ని సరిదిద్దుకుని చట్టాన్ని సాధించటానికి ఇది సరైన తరుణం.

చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం కోరుకుంటున్నవారంతా యధాతథంగా బిల్లును ఆమోదించాలని డిమాండ్ చేయకుండా లొసుగుల దిద్దుబాటునూ కోరాలి. 1996లో ప్రతిపాదించిన మహిళాబిల్లును ఇప్పుడు యధాతథంగా ఆమోదించినా కూడా పేరుకే తప్ప మహిళలకు అధికారం రాదు, కృత్రిమ నాయకత్వాన్ని తయారుచేసినట్టవుతుంది. ప్రజాస్వామ్యానికి ప్రతికూల ఫలితాలు వస్తాయి. మహిళలు సమానహక్కుల్ని పొందేవారుగా కాకుండా వివక్షకు గురై అదనపు సదుపాయాల్ని పొందుతున్న ఓ ప్రత్యేకవర్గంగానే మిగిలిపోతారు.

**ప్రస్తుత మహిళా బిల్లులో లోటుపాట్లు**

ప్రస్తుత మహిళా బిల్లు చట్టరూపం దాలిస్తే లోక్‌సభలో మూడోవంతు అంటే దాదాపు 181 సీట్లు మహిళలకు



కేటాయించాల్సి వస్తుంది. అది కూడా ప్రతి సాధారణ ఎన్నికలో రొటేషన్ పద్ధతికావటంతో ఏ ఒక్క నియోజకవర్గం నుంచి ఓ అభ్యర్థి వరుసగా పోటీచేయలేని పరిస్థితి ఏర్పడుతుంది. అంటే, సిట్టింగ్ అభ్యర్థుల్లో మూడింట రెండొంతుల మంది ప్రతి సాధారణ ఎన్నికల్లో బలవంతంగా తమ సీటును ఖాళీచేయాల్సి వస్తుంది. ఒక పురుష అభ్యర్థికి ఈ పరిస్థితి వస్తే, అక్కడ మహిళా అభ్యర్థిగా తన కుటుంబసభ్యులనే నిలబెడతాడు. ఇది ప్రజాస్వామిక ప్రాతినిధ్య విధానాన్నే దెబ్బతీస్తుంది. ప్రజాప్రతినిధి ఓ నియోజకవర్గాన్ని ఎంచుకుని అక్కడ కార్యక్రమాలు చేపట్టే అవకాశాలుండవు. మరోసారి అదే నియోజకవర్గం నుంచి ఎన్నికయ్యే అవకాశంలేదని తెలిశాక, రాజకీయాలు మరింత ఉదాసీనంగా, బాధ్యతారహితంగా మారిపోతాయి. ఒకవేళ మహిళా అభ్యర్థే అక్కడ జనరల్ అభ్యర్థిగా పోటీచేయాలంటే మొత్తం సీట్లన్నీ మహిళలే ఉండే పరిస్థితి వస్తుంది.

**1999లో లోక్‌సత్తా రూపొందించిన ప్రత్యామ్నాయ మహిళా బిల్లు**

వీటన్నింటినీ పరిశీలించాక, 1999లోనే ప్రజాస్వామ్య పీఠం/లోక్‌సత్తా జాతీయ స్థాయిలో చొరవ తీసుకుని మహిళా బిల్లులోని లోపాలను సవరిస్తూ ప్రత్యామ్నాయ బిల్లును యోగేంద్ర యాదవ్, మధు కిష్వర్, ధీరూబాయ్ సేథ్‌లతో కూర్చుని రూపొందించింది. అప్పటి ప్రధాని వాజ్‌పేయి సహా పార్లమెంటు సభ్యులందరికీ అందించింది. వారంతా సానుకూలంగా స్పందించారు.

**లోక్‌సత్తా రూపొందించిన ప్రత్యామ్నాయ మహిళా బిల్లులోని ప్రధానాంశాలు:**

1) ప్రతి గుర్తింపు పొందిన రాజకీయపార్టీ మూడోవంతు నియోజకవర్గాల్లో మహిళా అభ్యర్థుల్ని నిలబెట్టేలా 1951 ప్రజాప్రాతినిధ్య చట్టాన్ని సవరించాలి.
2) స్థానిక రాజకీయ, సామాజిక సమీకరణలకు అనుగుణంగా ఎక్కడ మహిళా అభ్యర్థుల్ని నామినేట్ చేయాలో ఆయా పార్టీలు నిర్ణయించుకోవచ్చు.

# మహిళా బిల్లు.. దశాబ్దాలుగా

- పంచాయతీల్లో మహిళలకు రిజర్వేషన్ కల్పిస్తూ 1993లో రాజ్యాంగ సవరణ వచ్చిన సమయంలోనే కాలక్రమంలో అసెంబ్లీ, పార్లమెంటుల్లో కూడా మహిళా రిజర్వేషన్ అమలు చేయాలన్న ఆలోచన ముందుకొచ్చింది.
- తొలిసారి దేవెగౌడ నేతృత్వంలోని యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం 1996 సెప్టెంబర్ 12న మహిళా రిజర్వేషన్ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టింది. ఈ బిల్లు చట్టంగా వస్తే, లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ లభిస్తుంది.
- సీపీఐ ఎంపీ గీతా ముఖర్జీ అధ్యక్షతన బిల్లుపై ఏర్పాటైన సంయుక్త పార్లమెంటరీ కమిటీ తన నివేదికను 1996 డిసెంబర్ 9న లోక్‌సభకు సమర్పించింది. తర్వాత కొద్దికాలానికే దేవెగౌడ ప్రభుత్వం మైనారిటీలో పడిపోయి లోక్‌సభ రద్దయింది.
- దేవెగౌడ, గుజ్రాల్‌ల తర్వాత వచ్చిన వాజ్‌పేయి నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం 1998 జూన్ 26న మహిళా బిల్లును లోక్‌సభ ముందుకు తెచ్చింది. అయితే అటల్‌జీ సర్కారు కూడా మైనారిటీలో పడిపోవటంతో లోక్‌సభ రద్దయింది.
- ఎన్నికల తర్వాత మళ్లీ వాజ్‌పేయి ప్రభుత్వమే 1999 నవంబర్ 22న మహిళా బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టింది. కానీ బిల్లుపై ఏకాభిప్రాయం రూపొందలేదు.
- ఆ తర్వాత 2002లో, 2003లో కూడా వాజ్‌పేయి సర్కారు బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టింది. కానీ అప్పుడూ ఏకాభిప్రాయం సాధ్యం కాలేదు.
- ఆ తర్వాత 2004లో అధికారంలోకి వచ్చిన యూపీయే ప్రభుత్వం మహిళా బిల్లును చట్టం చేస్తామని హామీ ఇచ్చినా 2008 వరకు ఆ దిశగా అడుగులు వేయలేదు. 2008 మే 6న రాజ్యసభలో ప్రవేశపెట్టింది. లా అండ్ జస్టిస్ స్థాయీ సంఘం పరిశీలనకు పంపింది.
- వంద రోజుల్లో మహిళా బిల్లును ఆమోదించటానికి కార్యాచరణ చేపడుతున్నట్లు డా॥ మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని యూపీయే సర్కార్ జూన్ 2009లో ప్రకటించింది.
- 2009 డిసెంబర్ 17న మన్మోహన్ ప్రభుత్వం లోక్‌సభ, రాజ్యసభల్లో బిల్లును ప్రవేశపెట్టింది. ఎస్పీ, జనతాదళ్ (యు), ఆర్జేడీ తీవ్ర అభ్యంతరాల మధ్య బిల్లుపై ఏకాభిప్రాయాన్ని సాధించలేకపోయింది.
- మహిళా బిల్లును సాధ్యమైనంత త్వరగా తీసుకొచ్చేందుకు ప్రభుత్వం గట్టి ప్రయత్నం చేస్తోందని 2010 ఫిబ్రవరి 22న రాష్ట్రపతి ప్రతిభా పాటిల్ తన ప్రసంగంలో పేర్కొన్నారు.
- యూనియన్ మంత్రిమండలి 2010 ఫిబ్రవరి 25న మహిళా రిజర్వేషన్ బిల్లుకు ఆమోదం తెలిపింది.
- 2010 మార్చి 8న బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టింది. బిల్లును వ్యతిరేకిస్తూ సభలో ఎస్పీ, ఆర్జేడీ ఆందోళన కొనసాగించాయి.
- 2010 మార్చి 9న పెద్ద మెజారిటీతో మహిళా బిల్లు రాజ్యసభ ఆమోదం పొందింది.
- 2014లో, ఆ తర్వాత 2019లో కూడా ప్రభుత్వం ఏర్పాటు చేసిన నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీయే.. మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదిస్తామని చెబుతోంది గానీ ఇంతవరకూ నిర్దిష్ట చర్యలు లేవు.











3) మహిళా ప్రాతినిధ్యం ఒకే ప్రాంతానికి పరిమితంకాకుండా అన్ని ప్రాంతాల్లో ఉండేలా చూసేందుకు వీలుగా, ప్రతి మూడు లోక్‌సభ స్థానాలను ఒక యూనిట్‌గా చేసి అందులో ఖచ్చితంగా మహిళలకు మూడోవంతు (ఒక ఎంపీ సీటు) ఇచ్చేలా చూడాలి. జాతీయస్థాయిలో రాష్ట్రాన్ని యూనిట్‌గా ఈ ప్రాతిపదికను పాటించాలి.

4) గుర్తింపు పొందిన ఏ పార్టీ అయినా అలా మూడోవంతు మహిళా అభ్యర్థుల్ని నిలపలేకపోతే, అందుకు పరిహారంగా కొన్ని సీట్లు కోల్పోవాల్సి ఉంటుంది. ఒక్కో మహిళా అభ్యర్థికీ ఇద్దరు పురుష అభ్యర్థులు తమ నియోజకవర్గాల్లో పార్టీ గుర్తును కోల్పోవాల్సి ఉంటుంది. దాంతోపాటు గుర్తింపుకు సంబంధించిన అన్ని అర్హతల్నీ వారు కోల్పోతారు.

5) అలాగే రాజ్యసభ లేదా విధానపరిషత్తుల్లో కూడా మహిళలకు మూడోవంతు సీట్లు ఎన్నిక లేదా నామినేషన్ ద్వారా కల్పించే ఏర్పాటు. ఆ సమయంలో ఎన్నికల కమిషనర్‌గా ఉన్న ఎం.ఎస్ గిల్ కూడా లోక్‌సత్తా ప్రత్యామ్నాయ బిల్లు ఆచరణసాధ్యమైనది అంటూ అమలుకు సిఫార్సు చేశారు.

లోక్‌సత్తా ఆధ్వర్యంలో రూపొందించిన ప్రత్యామ్నాయ బిల్లు సాకారమైతే, కేవలం చట్ట సవరణతో మహిళలకు 33% ప్రాతినిధ్యాన్ని చట్టసభల్లో అమల్లోకి తెచ్చేయొచ్చు. నాయకుల కుటుంబ సభ్యులు, బంధువులు కాకుండా నిజమైన నాయకత్వం మహిళల నుండి ఎదిగేలా చేయవచ్చు. ఓటర్లకు కూడా మెరుగైన అభ్యర్థులను ఎంచుకోవటానికి కావలసిన ప్రజాస్వామిక అవకాశాన్ని అందించవచ్చు. అవసరమనుకుంటే సులువుగా అమలుకు ఇంకొన్ని మార్పుల్ని కూడా బిల్లులో చేసుకోవచ్చు.

మహిళా బిల్లు యధాతథంగా రావాలని డిమాండ్లు చేయకుండా, ఆచరణసాధ్యమైన ఈ ప్రత్యామ్నాయాన్ని చూపితే వాయిదాలతో తప్పించుకోకుండా బిల్లు ఆమోదానికి అవకాశాలు పెరుగుతాయి. ఇక ఏమాత్రం వాయిదాలకు ఆస్కారం లేకుండా పట్టుపట్టి సాధించుకోవాల్సిన లక్ష్యమిది.

# ప్రాతినిధ్యం అసెంబ్లీల్లో ఇంకా తక్కువ

## భారత పార్లమెంటులో మహిళా భాగస్వామ్యం 14.4% దగ్గర నిలిచిపోగా, అసెంబ్లీల్లో ఇంకా తక్కువగా 10% లోపే ఉంది.

# మహిళలు, అణగారిన వర్గాలకు సాధికారతతో కూడిన ప్రాతినిధ్యాన్ని అందించాలి: జేపీ

అమెరికా కంటే ఘనంగా మనదేశంలో మహిళలకు స్వతంత్రం వచ్చిన వెంటనే ఓటు హక్కును ఇచ్చినా, ప్రధానమంత్రి స్థాయిలో మహిళను ప్రజాదరణతో ఆమోదించినా, రాజకీయాల్లో మహిళలకు తగిన ప్రాతినిధ్యానికి మౌలికమార్పులు వాటంతటవే వచ్చే వాతావరణం ఇప్పటికిప్పుడైతే మనదేశంలో లేదు. డబ్బు, అధికారమే పరమావధిగా ఉన్న ప్రస్తుత పెత్తందారీ రాజకీయ సంస్కృతి.. సమర్థత, నిబద్ధత ఉన్న మహిళల ప్రవేశానికి, వారు ఎదగటానికి అవరోధంగా ఉంది.

మహిళలకు రాజకీయాలలో ప్రవేశించే అవకాశాల్ని గణనీయంగా పెంచే ఏర్పాటుతోపాటు వారు భర్త చాటునో, కుటుంబ సభ్యుల చాటునో పనిచేయకుండా స్వతంత్రంగా పనిచేసి తమ వినూత్న నాయకత్వ శైలిని ప్రదర్శించే అవకాశాల్ని నిర్మించాలి. ఇప్పటికే 50% రిజర్వేషన్లు ఉన్న స్థానిక ప్రభుత్వాల్లో దాదాపు అన్ని రాష్ట్రాల్లో మహిళలకు పదవులు తప్ప అధికారాలు లేవు అనే అంశాన్ని మనం గుర్తించాలి. మహిళలు, అణగారిన వర్గాలలో సమర్థులకు సాధికారతతో ప్రాతినిధ్యాన్ని అందించే సంస్థాగత ఏర్పాటు ఉండాలి.

ఇందిర, నందిని శతపథి, జయలలిత, మాయావతి, మమతా బెనర్జీ వంటి వారు సొంత నాయకత్వ లక్షణాలతో పెద్దపెద్ద నాయకుల మధ్య కూడా గొప్పగా రాణించారు. వారి పట్ల ఎన్ని అభ్యంతరాలున్నా వారి నాయకత్వ సామర్థ్యాన్ని అంగీకరించనివారు మాత్రం ఉండరు. అలాంటి నాయకత్వాన్ని ఎక్కువ శాతం మహిళలు ప్రదర్శించే అవకాశాలు ఉండాలి.

రాజకీయాలలో మహిళల ప్రాధాన్యం పెరగటం వల్ల రాజకీయ సంస్కృతి కూడా త్వరగా మారుతుంది. హింసవిద్వేషాలు తగ్గి నాగరిక పద్ధతులు, మెరుగైన బహిరంగ చర్చాప్రమాణాలు సాధ్యమవుతాయి. బాధ్యతగా పనిచేయటం పెరుగుతుంది.

# PREAMBLE ( ప్రాదేశిక )

## WE, THE Jugaad Voters OF INDIA, On the occasion of Azadi ka Amrit Mahotsav having solemnly resolved:

To establish a financially self-sustainable MODEL POLITICAL SYSTEM [MPS] (temporarily termed as Jugaad Party) based on the proposed Party's founding principles of "COOPERATION BASED ON TRUST" in order to enable all the Law Abiding Voters with good normal character and political integrity, who are registered with Election Commission of India under the Sovereignty of our SOCIALIST SECULAR DEMOCRATIC CONSTITUTION, every word there in pleasantly and meaningfully defined in the MPS manifesto, to participate in a conflict-free good governance to the citizens of India, in a peaceful and transparent manner. Corruption free Jugaad Voters irrespective of their own individual ideologies shall collectively run the proposed party with their own funds, with declared rules of decentralised power and expenditure for the common benefit of citizens, within the Party, and in all collective daily public activities involving other political parties.

On this auspicious day the 26th November 2021 we THE Jugaad Voters OF INDIA, HEREBY ADOPT, IMPLEMENT AND OWN TO OURSELVES THIS Jugaad Party Constitution.

## జుగాడ్ ఓటర్ల 50:50 రాజకీయ సంకల్పం !

మనరాజ్యాంగమే మన సర్వజన రక్ష. దానిప్రకారం, శాంతియుత "రహస్య ఓటింగుపద్ధతి" లో ఎన్నుకునేవాడూ, ఎన్నుకోబడినవాడూ ఇద్దరూ ఓటర్లే. "లౌకికవాద ప్రజాతంత్ర సామ్యవాదం" (Secular Democratic Socialism), అనగా, అంతర్గత ప్రజాస్వామ్యంతోకూడిన, స్వజాతీయ స్వాధికార స్వపరిపాలన. "జుగాడ్ ఓటర్లచే నిర్వచించబడిన మెజార్టీపాలన". నిర్వహణ ఖర్చులనిమిత్తం ఓటర్లు వారియొక్క ఆర్థిక స్తోమతను బట్టి ఒకేసారి పార్టీకి ఇచ్చే విరాళం 2 వేలు, లేదా 5 వేలు, లేదా 10 వేల రూ.ద్వారా మాత్రమే "జుగాడ్ పార్టీ" లో ప్రవేశం. తాము స్వీకరించిన పనికి తగ్గ తాత్కాలిక నేతృత్వాధికారం ఉంటుంది. ఎవ్వరికీ అధినేత హొదా ఉండదు. సందర్భోచితంగా అనుసంధానకర్తలకు 3 ఓట్లతో వీటోహక్కు ఉంటుంది. MLA నియోజకవర్గం నుండి గ్రామ సర్పంచి వరకూ నిధులు, బాధ్యతలు, జవాబుదారీతనం ప్రాతిపదికగా జుగాడ్ ఓటర్ల పర్యవేక్షణలో స్వయంపాలనాధికారం.

ఏ పార్టీ అభ్యర్థి అయినా, ఎన్నికల సమయంలో ఓటర్లంతా సమానమే, కాబట్టీ ఓట్ల వ్యాపారం జరగదు. జుగాడ్ పార్టీ అభ్యర్థిని చూడగానే జనాలు గుర్తుపడతారు. కండువాలుండవు, కటౌట్లుండవు, ఫ్లెక్సీలుండవు. ఈపార్టీలో నేరచరితులకు B-Form లభించదు. ఈపార్టీ అభ్యర్థులందరూ గెలుపు గుఱ్ఱాలే. ఎవర్నిఎన్నుకుంటారో ఓటర్ల ఇష్టం. ఎన్నికలనిమిత్తం చేసే ఖర్చు ఎన్నికలకమిషన్ పరిమితికి మించేప్రసక్తేలేదు. గ్రామస్థాయినుండీ ఎక్కడికక్కడ ఆర్థికవనరుల వికేంద్రీకరణతో పారదర్శకంగా జరగవలసిన అధికారవికేంద్రీకరణ - "చట్టబద్ధ సుపరిపాలన ద్వారానే" సాధ్యం. దానికోసం కనీసం 100 మంది, "భావజాలాల సంకెళ్ళనుండీ విముక్తిచెందిన" చిత్తశుద్ధిగల, కార్యకర్తల/జుగాడ్ ఓటర్ల నిధులతో, వినూత్నమైన ఆలోచనతో, ఒక జాతీయ రాజకీయ పార్టీ వ్యవస్థ కేంద్ర ఎన్నికల కమిషన్ నియమావళితో నిర్మించడమే - జుగాడ్ ఓటర్ల ఉద్యమ ప్రాథమిక సంకల్పం!

**M.Parthasarathy (9866416798) &**
**25 other Jugaad Voters READY with Rs 1 lakh starting Fund.**

Advt.

# మహిళా రిజర్వేషన్ల వెనుక సహేతుక ఆర్థిక కారణాలు కూడా

- రామచంద్ర గుహ, చరిత్రకారులు

**సహేతుకమైన ఆర్థిక కారణాలు కూడా మహిళా రిజర్వేషన్లకు మద్దతునిస్తున్నాయని వీడెర్ అధ్యయనంతో స్పష్టమయింది. ఈ కారణంగా మహిళా రిజర్వేషన్ల బిల్లును పునరుద్ధరించి, పార్లమెంటులో పునఃప్రవేశపెట్టి, ఆమోదింపచేసేందుకు కిందిస్థాయి నుంచే ఒత్తిడి తీసుకురావలసిన అవసరం ఎంతైనా ఉన్నది. ఇందుకు చైతన్యయుతులైన ప్రజలు, ప్రజాసంఘాలు కృషి చేయాలి.**

భారత కోకిల సరోజినీ నాయుడు 1925లో భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షురాలు అయ్యారు. ఆమె అభ్యర్థిత్వానికి గాంధీజీ సంపూర్ణ మద్దతునిచ్చారు. హిందూ-ముస్లిం సమైక్యతకు ప్రతీకగా సరోజినీ దేవిని ఆయన గౌరవించేవారు. 1925లో పాశ్చాత్య దేశాలలోని ఒక ప్రధాన రాజకీయ పార్టీకి మహిళ ఒకరు అధ్యక్షురాలు కావడం అనేది అనూహ్యం, అసాధ్యం. బెంగళూరులో నేను వెలువరించిన ఒక ఉపన్యాసంలో ఈ వాస్తవాన్ని పేర్కొన్నప్పుడు సభికులు పెద్దపెట్టున, ఒకింత జాతీయ అభిజాత్యంతో హర్షధ్వానాలు చేశారు. నేను వారిని వారించి, మీ ఆనందోత్సాహాలను ఉపసంహరించుకోవాలని సూచించాను. ఎందుకు? 1925 దరిమిలా రాజకీయాలలో అత్యున్నత స్థాయిలో మహిళలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించడంలో పాశ్చాత్య దేశాలు ఇతోధిక పురోగతి సాధించాయి. గొప్పగా ప్రారంభమైన మన పురోగతి మందకొడిగా సాగుతోంది.

నవీన స్త్రీవాద ప్రమాణాలతో చూస్తే గాంధీజీ, మహిళా స్వాతంత్ర్యం విషయంలో, అంతగా ప్రగతిశీలి కాదని చెప్పక తప్పదు. సతీమణి కస్తూరి బాను ఆయన తనకొక విస్తరణగా పరిగణించారు. అయితే తన సమకాలిక ప్రపంచ నాయకులలో మరెవ్వరి కంటే మహాత్ముడు మాత్రమే, ఎంతోమంది మహిళలను ప్రజాజీవితంలోకి తీసుకువచ్చి ప్రోత్సహించారు. భారత జాతీయ కాంగ్రెస్‌లో సరోజినీ నాయుడేకాక మరెంతో మంది ప్రముఖ మహిళా నేతలు ఉన్నారు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా గాంధీజీ నిర్వహించిన ఉద్యమాలలో మరెంతో మంది మహిళలు పాల్గొని జాతి గౌరవాదరాలకు పాత్రులయ్యారు. గాంధీజీకి భిన్నంగా, ఆ తరం మహోన్నత పాశ్చాత్య నాయకులు అందరూ పూర్తిగా పురుష సహచరులతోనే కలిసి పనిచేశారు. ఫ్రాంక్లిన్ రూజ్‌వెల్ట్‌కు గానీ, విన్‌స్టన్ చర్చిల్‌కు గానీ వారి వారి పార్టీల్లో సీనియర్ మహిళా సహచరులు ఎవ్వరూ లేరు. అలాగే ఛార్లెస్ డీ గాల్, మావో, హోచిమిన్ లకు సైతం సీనియర్ మహిళా



సహచరులు ఎవ్వరూ లేరు.

మొదటి లోక్‌సభలో మహిళా సభ్యులు ఐదు శాతం మేరకు ఉన్నారు. స్వాతంత్ర్యోద్యమ కాలంలో విద్యావంతులలో మహిళా హక్కుల గురించి ఒక అపూర్వ జాగృతిని తీసుకొచ్చినప్పటికీ సమాజంలో పితృస్వామ్య వ్యవస్థ ప్రభావంలో ఎటువంటి ప్రగతిశీల మార్పు చోటు చేసుకోలేదు. అయినప్పటికీ ఆ కాలంలో భారత్, పాశ్చాత్య దేశాల కంటే చాలా ముందున్నది. 1951లో అమెరికా కాంగ్రెస్ దిగువ సభ-ప్రతినిధుల సభ-సభ్యులలో కేవలం 2 శాతం మంది మాత్రమే మహిళలు. అదే కాలంలో బ్రిటన్ పార్లమెంటులో మహిళా సభ్యులు కేవలం 3 శాతం మంది మాత్రమే ఉన్నారు. 1950వ దశకం అనంతర దశాబ్దాలలో ఈ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. పాశ్చాత్య దేశాలు మహిళా ప్రాతినిధ్యం విషయంలో గొప్ప పురోగతి సాధించాయి. బ్రిటిష్ పార్లమెంటులో మహిళా సభ్యుల సంఖ్య 1951లో 17 నుంచి 2017లో 208కి పెరిగింది. అమెరికాలో, 2018 మధ్యంతర ఎన్నికలకు ముందు ప్రతినిధుల సభలో 84 మంది మహిళా సభ్యులు ఉన్నారు. తర్వాత ఆ సంఖ్య పెద్దఎత్తున

పెరిగింది. అమెరికాలో రాష్ట్రాల స్థాయిలో మహిళా శాసనకర్తల సంఖ్య మరింత ఎక్కువగా ఉన్నది. రాష్ట్రాల కాంగ్రెస్‌లలో మహిళా సభ్యులు సగటున 25 శాతం మేరకు ఉన్నారు. మరి మనదేశంలో రాష్ట్ర అసెంబ్లీలో మహిళా సభ్యుల నిష్పత్తి కేవలం 9 శాతం మాత్రమే. అంటే పార్లమెంటులో కంటే చాలా తక్కువ.

1925లో, మహిళలను ప్రజా జీవితంలోకి తీసుకురావడంలో పాశ్చాత్య నాయకుల కంటే గాంధీజీ చాలా ప్రగతిశీలంగా వ్యవహరించారు. అయితే, ఆ తరువాత చట్టసభలలో మహిళా ప్రాతినిధ్యం విషయంలో పాశ్చాత్య దేశాలు ఆదర్శప్రాయమైన పురోగతిని సాధించాయి. ఇందుకు ఆ దేశాలలో ప్రజ్వరిల్లిన మహిళా వాద ఉద్యమాలే ప్రధాన కారణం. మహిళా హక్కుల గురించి ఆ ఉద్యమాలు చేసిన వాదనలను పురుష రాజకీయవేత్తలు అంగీకరించక తప్పలేదు. అందుకు భిన్నంగా మనదేశంలో పితృస్వామ్య వ్యవస్థ ప్రభావంతో మహిళా హక్కుల పురోగతి చాలా నెమ్మదిగా చోటు చేసుకుంటోంది. ఇప్పుడు చట్టసభలలో మహిళలకు కోటాల విషయాన్ని చూద్దాం. 1980వ దశకంలో జర్మనీలో గ్రీన్ పార్టీ ప్రతి ఎన్నిక– స్థానిక, ప్రాంతీయ, జాతీయ–లలోనూ 30 శాతం మంది అభ్యర్థులు మహిళలే ఉంటారని ప్రకటించింది. ఈ ప్రగతిశీల ఆలోచనను ఇతర పార్టీలు కూడా అంగీకరించాయి. తమ అభ్యర్థుల జాబితాలలో మరింతమంది మహిళలను చేర్చసాగాయి. మూడు దశాబ్దాల క్రితం జర్మనీలోని మహిళలకు పార్టీ కోటాలు మంచి ఫలితాలనిచ్చాయి. అయితే మన సమాజంలో ప్రగతిశీల ధోరణులు అంతగా లేకపోవడంతో మహిళలకు చట్టబద్ధమైన కోటాలు కల్పించాల్సిన అవసరమున్నది. పంచాయత్, మునిసిపాలిటీ స్థాయిల్లో ఇటువంటి కోటాలు ఉన్నాయి. అయితే సమాజంపై ఇతోధిక ప్రభావం చూపగల అసెంబ్లీ, పార్లమెంటు స్థాయిల్లో మహిళలకు కోటాలు లేవు. ఈ లోపాన్ని పూరించడానికి యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ బిల్లును తీసుకొచ్చింది. లోక్‌సభ, శాసనసభలలో 33 శాతం సీట్లను మహిళలకు కేటాయించాలని ఆ బిల్లు నిర్దేశించింది. విచారకరమైన విషయమేమిటంటే ఈ బిల్లుకు పార్లమెంటు ఆమోదం పొందే విషయమై యూపీఏ ఛైర్‌పర్సన్ సంపూర్ణ శ్రద్ధ చూపలేదు. యూపీఏ అధికారంలో ఉన్నప్పుడు లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా ఒక మహిళ –సుష్మా స్వరాజ్– ఉన్నారు. అయినప్పటికీ యూపీఏ ఛైర్‌పర్సన్ సోనియాగాంధీ, సుష్మ మద్దతును పొందడంలో విఫలమయ్యారు. ఫలితంగా మహిళా రిజర్వేషన్‌ల బిల్లు రాజ్యసభలో ఆమోదం పొందినప్పటికీ లోక్‌సభలో ఆమోదం పొందనే లేదు.

మహిళా రిజర్వేషన్ బిల్లుపై బీహార్ రాజకీయవేత్త శరద్ యాదవ్ ఒక అవమానకరమైన వ్యాఖ్య చేశారు. ఆ బిల్లు చట్టమై అమలయితే లోక్‌సభ 'పరకట్టి ఔరత్' (శిరోజాలను కత్తిరించుకున్న ఆధునిక మహిళ) ఆక్రమణకు దారితీస్తుందని ఆయన అన్నారు. పురుషాధిక్యంలో ఉన్న ఉత్తరాది రాజకీయ పక్షాలలో మహిళా స్వాతంత్ర్యం పట్ల ఎంత వ్యతిరేకత ఉన్నదో శరద్ యాదవ్ వ్యాఖ్య స్పష్టీకరించింది. ఇటువంటి దురభిప్రాయాలకు వ్యతిరేకంగా పోరాడడానికి బదులు సోనియా గాంధీ పూర్తిగా మౌనం వహించారు.

చట్టసభలలో మరింతమంది మహిళా సభ్యులు ఉండడం వల్ల భారతీయ ప్రజాస్వామ్యం ఇతోధిక లబ్ధి పొంది సమున్నతమవుతుందని కొన్నాళ్లక్రితం ఒక అధ్యయనం నిరూపించింది. 'వరల్డ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెవలప్‌మెంట్ ఎకనామిక్స్ రీసెర్చ్' (వీడెర్) నిర్వహించిన ఈ అధ్యయనంలో రాష్ట్రాల అసెంబ్లీలో ఎమ్మెల్యేల పనితీరును జెండర్ వారీగా విశ్లేషించారు. శాసననిర్మాతలయిన తరువాత మహిళా సభ్యుల ఆస్తుల పెరుగుదల పురుషసభ్యుల ఆస్తుల పెరుగుదల కంటే పదిశాతం తక్కువగా ఉన్నట్టు ఆ విశ్లేషణలో వెల్లడయింది. తమ తమ నియోజకవర్గాలలో రోడ్డు నిర్మాణ ప్రాజెక్టులు మొదలైన వాటికి మహిళా, పురుష సభ్యులు సమానస్థాయిలో డిమాండ్ చేసినప్పటికీ మంజూరయిన ప్రాజెక్టుల అమలు సత్వర పూర్తికి మహిళలు ఎక్కువ శ్రద్ధ చూపుతున్నారని ఆ అధ్యయనం పేర్కొంది. మహిళా సభ్యుల నియోజకవర్గాలలో ఆర్థికాభివృద్ధి పురుష సభ్యుల నియోజకవర్గాలలో కంటే 1.8 శాతం అధికంగా ఉన్నట్టు వినూత్న పద్ధతుల ద్వారా వీడెర్ అధ్యయనం స్పష్టం చేసింది. ఇతర అంశాలలో కూడా మహిళా సభ్యుల తీరుతెన్నులు పురుష సభ్యుల కంటే చాలా మెరుగ్గా ఉన్నాయని ఆ అధ్యయనం తెలియజేసింది. పురుషసభ్యుల కంటే మహిళా సభ్యులు వినయవిధేయతలతో వ్యవహరించడం, సభా మర్యాదలను పూర్తిగా పాటించడం ఎక్కువ అని, ఇతర పార్టీల సభ్యులతో విభేదాలను చర్చల ద్వారా పరిష్కరించుకొనే వైఖరి మహిళా సభ్యులలో అధికమని వీడెర్ అధ్యయనంలో వెల్లడయింది.

శాసనసభలు, పార్లమెంటులో మహిళా రిజర్వేషన్లకు నైతికత, న్యాయం మౌలికంగా ప్రేరణనిచ్చాయి. సహేతుకమైన ఆర్థిక కారణాలు కూడా మహిళా రిజర్వేషన్లకు మద్దతునిస్తున్నాయని వీడెర్ అధ్యయనంతో స్పష్టమయింది. ఈ అధ్యయనం వెల్లడించిన వాస్తవాలు, మహిళా రిజర్వేషన్ల బిల్లును చట్టంగా చేయడంలో యూపీఏ వైఫల్యం ప్రగతిశీలురను మరింత విచారగ్రస్తులను చేస్తుందనడంలో సందేహం లేదు. కాంగ్రెస్ గానీ, బీజేపీ గానీ మళ్లీ ఆ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టి ఆమోదింప చేసేందుకు కృషి చేస్తాయనే విషయంలో ఎటువంటి భరోసా లేదు. ఈ కారణంగా మహిళా రిజర్వేషన్ల బిల్లును పునరుద్ధరించి, పార్లమెంటులో పున:ప్రవేశపెట్టి, ఆమోదింపచేసేందుకు కిందిస్థాయి నుంచే ఒత్తిడి తీసుకురావలసిన అవసరం ఎంతైనా ఉన్నది. ఇందుకు చైతన్యయుతులైన ప్రజలు, ప్రజాసంఘాలు కృషి చేయాలి.

**(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో)**

# ఉపాధిలోనూ పెరగాల్సిన ప్రాతినిధ్యం



మహిళల స్వావలంబనకు, సమాజంలో, రాజకీయాల్లో వారు నిర్మాణాత్మక పాత్రను పోషించటానికి ఎంతో కీలకమైనది ఉపాధి. కానీ మన దేశంలో ఉపాధి పొందుతున్న మహిళల సంఖ్య నానాటికీ తగ్గుతోంది!

గత రెండు మూడు దశాబ్దాలుగా ఉద్యోగాలకు వెళ్లే స్త్రీల సంఖ్య పెరుగుతోంది, విజిబిలిటీ పెరుగుతోంది గానీ.. జనాభా పెరుగుదలతో పోల్చి చూసినప్పుడు మాత్రం తగ్గుదల కనిపిస్తోంది. ప్రతి ముగ్గురు భారతీయ మహిళల్లో ఇద్దరు ఏ విధమైన వృత్తి లేదా ఉద్యోగం చేయటం లేదని ప్రపంచ బ్యాంకు అధ్యయనం వెల్లడించింది. దేశ జనాభాలో మహిళలు 48.5 శాతం మేర ఉండగా, ఆర్థిక వ్యవస్థలో, జీడీపీ వృద్ధిలో స్త్రీల భాగస్వామ్యం సుమారు ఆరో వంతుగా మాత్రమే ఉంది.

ప్రపంచంలోని అనేక దేశాల్లో మహిళా శ్రామిక శక్తి గణనీయంగా పెరుగుతుంటే.. మన దేశంలో మాత్రం అది తిరోగమనంలో ఉంది. ఆర్థిక కార్యకలాపాల్లో మహిళా భాగస్వామ్యంలో భారతదేశం 145 దేశాల్లో చివరి నుండి ఆరవ స్థానంలో ఉంది. అలాగే ఆర్థిక వ్యవస్థలోని అన్ని రంగాలకూ విస్తరించకుండా కేవలం కొన్నిటికే ఎక్కువగా స్త్రీలు పరిమితమై ఉన్నారు.

కొన్ని రాష్ట్రాల్లో కొద్దిపాటి మినహాయింపులున్నా మొత్తంగా భారత కార్మికశక్తిలో స్త్రీల వాటా 22.3 శాతం మాత్రమే. గ్రామీణ భారతాన్ని తీసుకుంటే, ఓ సర్వే ప్రకారం.. 2004-05తో పోలిస్తే 2017-18 నాటికి ఉపాధి కార్యక్రమాల్లో గ్రామీణ మహిళల సంఖ్య 48.5 శాతం నుంచి 23.7 శాతానికి తగ్గింది. ఖాళీ సమయంలో వేర్వేరు పనుల్ని చేసి ఉపాధి పొందటం వంటి సాంప్రదాయేతర ధోరణుల్ని పరిగణలోకి తీసుకోకపోవటం వంటి లోపాలు ఈ సర్వేలో ఉన్నా, మొత్తంగా ఇంటి బయట పనిచేసే పల్లె మహిళల సంఖ్య మనదేశంలో తగ్గుముఖం పట్టిందన్నది వాస్తవం.

కొవిడ్ వచ్చాక ఆర్థిక భాగస్వామ్యంలో మహిళల పరిస్థితి మరీ దిగజారింది. ఉపాధి అవకాశాలు తగ్గటంతోపాటు వారిపై హింస హెచ్చింది. తిరిగి పాత ఉపాధిని అందుకోవటం పురుషులకు సాధ్యమైనంత వేగంగా మహిళలకు సాధ్యం కావటం లేదు. సాంకేతిక రంగాల్లో మహిళల భాగస్వామ్యం 29 శాతానికి దిగజారింది. సీనియర్ మేనేజ్‌మెంట్ పదవుల్లో మహిళల శాతం 14.6 కాగా, అత్యున్నత సారథ్య హోదాల్లో వారి వాటా కేవలం 8.9 శాతం. వేతనాల్లోనూ వీరు వివక్షను ఎదుర్కొంటున్నారు. ఈ వివరాలను కొన్ని సంస్థలు, కొందరు వ్యక్తుల అధ్యయనాలు వెల్లడిస్తున్నాయిగానీ, ప్రభుత్వం వద్ద మాత్రం గణాంకాలు లేవట. తన దగ్గర కార్మిక శక్తిలో మహిళా భాగస్వామ్యానికి సంబంధించిన గణాంకాలు లేవని యూనియన్ కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ ఇటీవల పార్లమెంటరీ కమిటీ ముందు చెప్పింది. ఉపాధి అంటే పురుషులు మాత్రమే అన్నట్లు సాక్షాత్తూ ప్రభుత్వ మంత్రిత్వ శాఖే వ్యవహరిస్తోంది.

**పాకిస్తాన్‌లో మాత్రమే మన కంటే తక్కువ**

▶ 2017 గణాంకాల ప్రకారం.. దేశంలో పనిచేసే వయసున్న మహిళల సంఖ్య 47 కోట్లయితే, వేతనాలు చెల్లించే ఉద్యోగాల్లో కొనసాగుతున్న మహిళల సంఖ్య 26 శాతం

# బహిరంగ స్థలాల్లో వేధింపుల వల్ల పని కోసం ఎక్కువ దూరం వెళ్లలేకపోతున్నారు

వేగంగా జరుగుతున్న నగరీకరణ వల్ల ఉపాధి అవకాశాలు పెరుగుతున్నా, మన దేశంలో చట్టబద్ధపాలన అధ్వాన్నంగా ఉండటం వల్ల మహిళలు ఒక పరిమితి దాటి ముందుకు వెళ్లలేకపోతున్నారు. బహిరంగ ప్రదేశాల్లో వేధింపుల వల్ల విద్య, పని, విశ్రాంతి అంశాల్లో మహిళలు రాజీపడుతున్నారు. ముఖ్యంగా చీకటి పడ్డాక వారు గడప లోపలే మగ్గాల్సి వస్తోంది.

సెంటర్ ఫర్ కేటలైజింగ్ ఛేంజ్ సంస్థ 'ది అర్బన్ కాటలిస్ట్స్' పేరిట నిర్వహించిన సర్వే ప్రకారం.. బహిరంగ స్థలాల్లో వేధింపుల కారణంగా మహిళలు పనికోసం తామున్న చోట నుంచి ఎక్కువ దూరం పోలేకపోతున్నారు. వీరిలో చాలామంది కాలినడకనే బయటకు వెళ్లి పనులు చేయాల్సి వస్తోంది (2011 జనాభా లెక్కల ప్రకారం గృహ పరిశ్రమలు, వ్యవసాయ వృత్తులు కాకుండా ఇతర పనులు చేస్తున్న మహిళలు తమ స్వస్థలాల నుంచి చాలా తక్కువ దూరంలో ఉన్న చోటే పనులు చేసుకుంటున్నారు. పురుషులతో పోలిస్తే 14 కోట్ల మంది శ్రామికుల్లో ఎక్కువమంది మహిళలు కేవలం ఒక కిలోమీటర్ దూరంలోని పనిస్థలాలను మాత్రమే ఎంచుకుని పనిచేస్తున్నారు).

ఇక సేఫ్టీపిన్ ఇండియా సంస్థ దేశంలోని మూడు నగరాల్లో నిర్వహించిన సర్వే ప్రకారం రాత్రిపూట మహిళలు సంచరించే వాతావరణం ప్రమాదకరంగా ఉంటోంది. పాట్నాలో 62 శాతం, గయలో 52 శాతం, ముజఫర్‌పూర్‌లో 61 శాతం మంది మహిళలు ఏమాత్రం భద్రతలేని మార్గాల్లో నడవాల్సి వస్తోంది.

ఇంతవరకు ఈ అంశంపై నిర్వహించిన సర్వేలలో మూడింట రెండు వంతుల అధ్యయనాలు బహిరంగ స్థలాల్లో పేద మహిళలకు నడిచే వాతావరణం కూడా అత్యంత అననుకూలంగా ఉందని చెబుతున్నాయి. రాత్రిపూట పరిస్థితి మరీ అననుకూలం. ఇరుకు ఫుట్‌పాత్‌లు, నీళ్లతో నిండి ఉండే రహదారులకు తోడు ఉద్దేశపూర్వకంగా పురుషులు ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ మహిళలను వేధించటం పరిపాటయింది. ప్రయాణ సమయాల్లో పురుషుల మద్దతు తీసుకోవడం పట్ల అధిక శాతం శ్రామిక మహిళలకు విశ్వాసం లేదని, తమపై తాము ఆధారపడిన వారు పనులకు వెళుతున్నారని తేలింది. మొత్తంగా చూస్తే, హింసతోపాటు.. దారిద్ర్యం, ఆర్థిక సమస్యల వల్ల మహిళలు ఎక్కువ దూరం ప్రయాణించలేకపోతున్నారని, దీంతో వారి అవకాశాలు కూడా పరిమితమవుతున్నాయని అధ్యయనాలు చెబుతున్నాయి.

## స్త్రీ, పురుష సమానత్వ సూచీల్లోనూ వెనకడుగే

స్త్రీ, పురుష సమానత్వంలోని ఇతర ప్రమాణాలను పరిగణలోకి తీసుకున్నా.. భారత్ ఇంకా సుదూరంలోనే ఉంది. ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) రూపొందించిన లింగ సమానత్వ (గ్లోబల్ జెండర్ గ్యాప్) నివేదిక 2021 ప్రకారం.. స్త్రీ-పురుష సమానత్వ సూచీలో మన దేశం ర్యాంకు మరింత పడిపోయింది. మొత్తం 156 దేశాల్లో అధ్యయనం చేసి రూపొందించిన మహిళా సమానత్వ సూచీలో భారత్ 140వ స్థానంలో నిలిచింది. గత ఏడాది కన్నా 28 స్థానాలు దిగువకు వచ్చింది. దక్షిణాసియాలో పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్ మాత్రమే మన కంటే తక్కువ ర్యాంకుల్లో ఉన్నాయి. ప్రపంచంలో మరే దేశంలో లేనిరీతిలో మన దేశం మహిళల్ని ఉత్సవ విగ్రహాలుగా తయారుచేస్తూ ఇంటికే పరిమితం చేస్తోంది.

అంతకుముందు 'ఈక్వల్ మెజర్స్-2030' సూచీలోనూ ఈ కఠోర వాస్తవాలు వెల్లడయ్యాయి. 129 దేశాల్లో పేదరికం, ఆరోగ్యం, అక్షరాస్యత, విద్యార్హతలు, రాజకీయ ప్రాతినిధ్యం వంటి అంశాల ప్రాతిపదికన మదింపు చేయగా.. 56.2 సగటు స్కోరుతో భారత్ 95వ స్థానంలో నిలిచింది. ఆసియా-పసిఫిక్ ప్రాంతంలోని 23 దేశాలలో 17వ ర్యాంకు సాధించింది. మనతో పోల్చదగిన చైనా దేశం అంతర్జాతీయంగా 74వ స్థానంలో నిలిచింది. 'ఈక్వల్ మెజర్స్-2030' నిర్దేశించిన 'స్త్రీ-పురుషుల సమానత్వ స్థిరాభివృద్ధి లక్ష్యాలు'ను చేరుకునే దిశగా ఈ సూచీలను 2019లో విడుదల చేశారు. ఆఫ్రికన్ ఉమెన్స్ డెవలప్‌మెంట్ అండ్ కమ్యూనికేషన్ నెట్‌వర్క్, ఆసియన్-పసిఫిక్ రిసోర్స్ అండ్ రీసెర్చ్ సెంటర్ ఫర్ ఉమెన్, గేట్స్ ఫౌండేషన్, అంతర్జాతీయ సంస్థలు సంయుక్తంగా ఈ క్రతువులో పాలుపంచుకున్నాయి.

మాత్రమే. 2004-05లో ఇది దాదాపు 35 శాతం ఉంది.

- చైనాలో 65-70 శాతం మంది మహిళలు ఉపాధిని పొందుతున్నారు. ప్రపంచంలోనే ఇది అత్యధిక శాతం.
- అమెరికాలో ఇది 56 శాతం.
- మన పొరుగుదేశం పాకిస్తాన్‌లో మాత్రం భారత్‌లో కంటే తక్కువమంది మహిళలు ఉపాధి పొందుతున్నారు.
- జీ-20 దేశాల్లో మన దేశంలోనే (సౌదీ అరేబియా తప్ప) తక్కువ మంది మహిళలు పనిచేస్తున్నారు.
- 10 శాతం మంది గ్రామీణ పేదల్లో కనీసం 16 శాతం మంది మహిళలు, 10 శాతం మంది ధనికుల్లో 8 శాతం మంది మహిళలు ఉపాధికి దూరమయ్యారు. అన్ని కులాల్లోనూ ఈ తిరోగమనం ఉంది.
- 2005 తర్వాత దేశంలో 3.6 కోట్ల ఉద్యోగాల సృష్టి జరిగితే అందులో 90 శాతం ఉద్యోగులు పురుషులే.
- దాదాపు 90 శాతం ఇంటి పనిని మహిళలే చేస్తున్నారు. ఇతర పెద్ద దేశాలతో పోల్చినపుడు ఈ పరిస్థితి ఇక్కడే ఎక్కువ.

## ఎందుకు ఇలా

- మహిళలకు సమానావకాశాలు కల్పించాలన్న సామాజిక స్పృహ మన దేశంలో తక్కువ.
- స్త్రీలు కూడా పురుషాధిక్యతను స్వచ్ఛందంగా అంగీకరించటం ఇప్పటికీ మన వద్ద ఎక్కువ (భర్త కొట్టటం తప్పేమీ కాదని తెలుగు రాష్ట్రాల్లోనే దాదాపు 84% మంది మహిళలు అనుకుంటున్నారని జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ఇటీవల వెల్లడించింది).
- నాణ్యమైన విద్య, ఆరోగ్యం కల్పించటంలో వైఫల్యం, విపరీత జనాభా, ఆర్థిక సంస్కరణల అవకాశాలను జారవిడవటం కారణంగా - మన దేశం ఉపాధినందించటంలో వెనుకబడటం.
- ఉన్నత విద్యావకాశాలను కోరుకునే యువతులు తక్షణం ఏదో ఒక ఉద్యోగంలో చేరడానికి పెద్దగా ఇష్టపడటం లేదు.
- కుటుంబాల ఆదాయం పెరుగుతుండడం వల్ల మహిళల్ని పనుల్లోకి పంపడానికి చాలామంది ఇష్టపడటం లేదు.
- పెళ్లి తర్వాత ఎక్కువ మార్పులు వస్తున్నాయి. అప్పటిదాకా ఉద్యోగాలు చేసినవారు సైతం పెళ్లి తర్వాత- కుటుంబం, పిల్లల సంరక్షణపై ఎక్కువగా దృష్టి పెట్టి ఉద్యోగాల్ని వదిలివేస్తున్నారు. ఉన్నత విద్యావంతులైన మహిళలు సైతం ఇలా అర్ధంతరంగా కెరీర్‌ను ఆపేస్తున్నారు. ఇతర వర్ధమాన దేశాలతో పోల్చుకుంటే భారత్‌లో ఈ శాతం ఎక్కువ. ఇంటి పని, ఉద్యోగం సమతుల్యం చేసుకోవడం వారికి సవాలుగా మారుతోంది.

## మహిళల ఉపాధి పెరిగితే..

- పురుషుల స్థాయికి మహిళల ఉపాధి రేటును పెంచగలిగితే దేశంలో మరో 23.5 కోట్ల మంది ఉద్యోగులు అందుబాటులోకి వస్తారు. యూరోపియన్ యూనియన్‌లో పనిచేసే ఉద్యోగులందరికన్నా ఈ సంఖ్య ఎక్కువ. ఇంతమందితో ఆసియాలో ఫ్యాక్టరీలన్నిటినీ నింపేయొచ్చు! శ్రామికశక్తిని సమతుల్యం చేయగలిగితే - ఐఎంఎఫ్ అంచనా ప్రకారం భారత్ మరో 27 శాతం ధనిక దేశంగా మారుతుంది (స్త్రీ పురుషుల మధ్య ఉపాధి అంతరాల్ని తగ్గిస్తే భారత ఆర్థిక వ్యవస్థ మూడేళ్లలో 10 లక్షల కోట్ల రూపాయల మేర పెరుగుతుందని 2017లో హైదరాబాద్ వచ్చినప్పుడు అప్పటి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుమార్తె ఇవాంకా వ్యాఖ్యానించారు).

**మహిళలకు ఉపాధి ఎందుకు**

- పురుషులతో సమానంగా సమాజంలో సగర్వంగా బతకొచ్చు.
- పనిచేసి, సంపాదించడం వల్ల కలిగే సంతృప్తి చాలా ఎక్కువ.
- విధాన నిర్ణయాలు తీసుకునే శక్తి పెరుగుతుంది.
- ఆస్తుల నియంత్రణ సామర్థ్యం వస్తుంది.
- గృహ హింసను తగ్గించుకోవచ్చు.
- కుటుంబ ఎదుగుదలలో తన వంతు పాత్రను నిర్వర్తించవచ్చు.
- రాజకీయ, పాలనా రంగాల్లో తగిన ప్రాతినిధ్యాన్ని అందుకోగలగటంతోపాటు, నాయకత్వ పాత్ర పోషించగల సామర్థ్యాన్ని పెంపొందించుకోగలుగుతారు.
- దేశ ఆర్థిక వ్యవస్థ పురోగమనానికి ఇతోధికంగా సాయపడగలరు.

## ఇప్పటికీ పెద్దగా పెరగని సామాజిక మద్దతు

ఇంటిపని, వంటపని, పిల్లలు, పెద్దల సంరక్షణ లాంటి విషయాల్లో మహిళల శ్రమ వెలకట్టలేనిది. గ్రామాల్లో ఇంటి

## వ్యవస్థాపక సామర్థ్యాన్నీ అభివృద్ధి చేయాలి

**స్టార్టప్‌లకు భారతదేశం కేంద్రంగా మారుతోందని ప్రధాని మోదీ ఇటీవల చెప్పారు. చిన్న పట్టణాల నుండి కూడా అంకురాలు రావటం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. సొంతంగా ఏదైనా చేయాలన్న తపన భారతీయ యువతలో పెరుగుతున్నా, నిరుద్యోగాన్ని, పేదరికాన్ని నిర్మూలించటంలో ప్రధాన పాత్ర పోషించే వ్యవస్థాపకత సామర్థ్యంలో మహిళా ప్రాతినిధ్యం తక్కువగా ఉంటోంది. పరిశ్రమల స్థాపనలో పురుషులతో పోల్చుకుంటే మహిళల పాత్ర చాలా తక్కువ. ఆరవ ఎకనామిక్ సెన్సస్ ప్రకారం.. మన దేశంలోని మొత్తం వ్యవస్థాపకుల్లో కేవలం 14 శాతం మాత్రమే మహిళలు ఉన్నారు. రష్యాలో సుమారు 34.6 శాతం, ఆస్ట్రేలియాలో 32.1 శాతం, న్యూజిలాండ్‌లో 33 శాతం, వియత్నాంలో 31.3 శాతం, చైనాలో 23.1 శాతం, అమెరికా, బ్రిటన్‌లలో సుమారు 25 శాతం మేర మహిళా వ్యవస్థాపకత ఉంది. కేవలం ఉపాధి పొందటానికే పరిమితం కాకుండా, ఉపాధిని అందించగల వ్యవస్థాపన సామర్థ్యాన్ని విద్యార్థి దశలోనే పెంపొందించేలా మన పాఠ్యాంశాలు, బోధనా కార్యక్రమాల రూపకల్పన ఉండాలి.**

పనితోపాటు పొలం పనులు, పశుపోషణ.. ఇలా అన్నింటిలోనూ స్త్రీలు భాగం పంచుకుంటున్నారు. అక్కడ పనికి తగిన పారితోషికం, గుర్తింపు ఉండట్లేదు. ఇంట్లో బండచాకిరీ చేసి, తిరిగి ఉపాధిలోకి వెళ్లే మహిళలకు ఒత్తిడి సహజమే. వారికి తగినంత సామాజిక మద్దతు లభించటం లేదు. మధ్యలో పని మానేసి.. తిరిగి ఉద్యోగంలోకి వెళ్లాలనుకునే మహిళలకు ఆ మేరకు సహకారం ఉండట్లేదు. సామాజిక కట్టుబాట్లు, భద్రతాపరమైన అంశాలు, రాత్రివేళ్లలో పనిచేయాల్సి రావడం లాంటివి కూడా మహిళల ఉపాధికి అడ్డంకి అవుతున్నాయి. సంప్రదాయ కుటుంబాల్లో తాను ఉద్యోగానికి వెళతానని ఇంట్లోవారికి నచ్చచెప్పుకోవడమే యువతికి ఇంకా తొలి సవాలుగా కొనసాగుతోంది. మహిళలకు నాణ్యమైన విద్య, వైద్యాలను అందించటం, సాంకేతికతతో నైపుణ్యాలను పెంపొందించటం, జీవన భద్రతతో కూడిన ఉపాధి అవకాశాలను అందుబాటులోకి తేవటం, చట్టబద్ధపాలన అమలు, రవాణా సౌకర్యాలలో మహిళలకు అనువైన మౌలిక వసతుల్ని ఏర్పాటు చేయటం, మహిళల హక్కులపట్ల గుర్తింపు, శాస్త్రీయ ఆలోచనా ధోరణులను పెంచేందుకు బహుముఖ కార్యక్రమాలు వంటి చర్యల ద్వారా మాత్రమే ఈ తరతరాల తప్పిదాన్ని సరిచేయగలం.

## సహకార చక్కెర కర్మాగారాలపై ప్రభుత్వ నిర్ణయం ప్రకటించండి



సహకార రంగంలో ఎంతో కీలకమైన విశాఖపట్నం జిల్లాలోని తాండవ, ఏటికొప్పాక, అనకాపల్లి, చోడవరం, విజయనగరం జిల్లా భీమసింగి షుగర్ ఫ్యాక్టరీలపై ప్రభుత్వం ఏమీ తేల్చకుండా అటు చెరకు రైతులను, ఇటు కార్మికుల కుటుంబాలను నడిరోడ్డు మీద నిలబెట్టటం సరికాదని లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. వీరిని ఆదుకునే విధంగా ప్రభుత్వ నిర్ణయం ప్రకటించాలన్నారు. ఈ మేరకు ఆయన రాష్ట్ర కేన్ కమిషనర్‌ని తాడేపల్లి కార్యాలయంలో కలసి విజ్ఞాపన పత్రం అందచేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సహకార ఫ్యాక్టరీలను పటిష్ఠం చేయాలన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో ఉత్తరాంధ్రలో అఖిలపక్ష పోరాటాన్ని ఉధృతం చేస్తామన్నారు.

## రైతులకు పెట్టుబడి వ్యయాన్ని తగ్గించాలి



సహకారం రంగంలోని తాండవ, ఏటికొప్పాక తదితర షుగర్ ఫ్యాక్టరీలను ప్రభుత్వం ఆదుకోవాలని, చెరకు రైతులు, కార్మికులకు బకాయిలు వెంటనే చెల్లించాలని జేడీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు వి.వి లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. లోక్‌సత్తా పార్టీ ఏపీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, వివిధ పార్టీలు, ప్రజాసంఘాల నేతలతో కలసి ఆయన విశాఖపట్నం జిల్లాలోని తాండవ, ఏటికొప్పాక, అనకాపల్లి, చోడవరం కర్మాగారాలను సందర్శించారు. చక్కెర కర్మాగారాలను మూసివేయటం పరిష్కారం కాదని, సామర్థ్యాన్ని పెంచి గాడిలో పెట్టాలని అన్నారు. రైతులకు పెట్టుబడి వ్యయాన్ని తగ్గించేందుకు ఉపాధి హామీని వ్యవసాయంతో అనుసంధానం చేయాలని సూచించారు. దశాబ్దాల చరిత్ర ఉన్న తాండవ షుగర్ ఫ్యాక్టరీని మూసివేసి భూములు పొందాలని కొందరు చూస్తున్నారని, ఒకపక్క సహకార రంగాన్ని బలోపేతం చేస్తామంటూనే ఇలాంటి పనులు తగవని బాబ్జీ అన్నారు. బీజేపీ నేత తోట నగేష్, సీపీఎం నేత లోకనాథం, టీడీపీ, కాంగ్రెస్ నాయకులు పెదిరెడ్డి చిట్టిబాబు, జగతా శ్రీనివాసరావు, సీఐటీయూ నేతలు సీహెచ్ నరసింగరావు, ఎం. అప్పలరాజు, రైతు సంఘం నాయకులు సత్యనారాయణ, అన్నం వెంకటరావు, సియ్యాదుల అచ్యుత కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఓ స్థానిక ప్రభుత్వ ప్రజాప్రతినిధీ.. ఏమిటీ దుస్థితి!

## నిర్వహణలేక అధ్వాన్నంగా తయారైన వర్షపు నీటి కాలువలు, భూగర్భ డ్రయినేజీతో జీవన విధ్వంసం







**బాధ్యతాయుతమైన కె.పి.హెచ్.బి కార్పొరేటర్ గారికి తెలియచేయునది ఏమనగా,**

అసౌకర్యాలను సౌకర్యాలుగా మార్చుకోవటం తెలివితేటలు, సమర్థత! ఉన్న సౌకర్యాలను పాడుచేసి అసౌకర్యాలుగా మార్చుతున్న మన గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్‌ను ఏమనాలి?

గత కొన్ని ఏళ్లుగా వర్షపు నీటి కాలువలు, భూగర్భ డ్రయినేజీ, రోడ్ల విషయంలో జి.హెచ్.ఎం.సిలో ఒకరకమైన విధ్వంసమే జరుగుతోంది. కె.పి.హెచ్.బి కాలనీనే తీసుకుంటే, కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా హౌసింగ్ బోర్డు వారు వర్షపునీటి కాలువలు, భూగర్భ డ్రయినేజీలను విడివిడిగా చక్కగా నిర్మాణం చేసి కార్పొరేషన్‌కి అప్పచెప్పారు. కానీ వాటిని ఎంతో బాధ్యతతో నిర్వహించవలసిన జి.హెచ్.ఎం.సి వారి అసమర్థత, అవగాహనా లోపం, నైపుణ్యలేమి, నిర్లక్ష్య వైఖరి వల్ల భూగర్భ డ్రయినేజీ, వర్షపునీటి కాలువలు కలసిపోతున్నాయి. ఆ లీకేజీలను అదుపు చేయటం చేతకాక, కొన్ని చోట్ల జి.హెచ్.ఎం.సి వారే భూగర్భ డ్రయినేజీని వర్షపునీటి కాలువలో కలిపేస్తున్నారు. ఇలా భూగర్భ డ్రయినేజీ పైప్‌లైన్ ద్వారా వెళ్లవలసిన మానవ వ్యర్థాల మురుగునీరు వర్షపు ఓపెన్ కాలువ ద్వారా బహిరంగంగా ప్రవహిస్తోంది. ఇదీ మన జి.హెచ్.ఎం.సి ఇంజినీర్ల నిర్వహణా నైపుణ్యం.

వర్షపు నీటి కాలువలకు, భూగర్భ డ్రయినేజీలకు తేడా లేకుండా చేసిన తెలివితక్కువ, మూర్ఖపు ఆలోచనల వల్ల నగరంలో చాలా ప్రాంతాలు కూడా మురికికూపాలుగా మారిపోయాయి. మన కె.పి.హెచ్.బి కాలనీలో ప్రజల సౌకర్యం కొరకు వర్షపునీరు రోడ్లపై రాకుండా అనేక చిన్న చిన్న కాలువలు ప్రజల పన్నుల సొమ్ముతో ఏర్పాటు చేసి అవన్నీ రెండు పెద్ద వర్షపునీటి నాలాలకు అనుసంధానం చేసి రోడ్ నెంబర్ 1 దాటి ఐ.డి.ఎల్ వారి ఓపెన్ ప్రాంతం ద్వారా కూకట్‌పల్లి ఐ.డి.ఎల్ చెరువులోకి వెళ్లే ఏర్పాటు చేశారు. అలాగే మానవ వ్యర్థాల మురుగునీరు బహిరంగంగా ప్రవహించకుండా పైప్‌లైన్ల ద్వారా మళ్లించటానికి ప్రజల పన్నుల సొమ్ముతో భూగర్భ డ్రయినేజీ నిర్మించటం జరిగింది. జనాభా పెరుగుదలకు అనుగుణంగా పాత భూగర్భ డ్రయినేజీ స్థానంలో పైప్‌లైన్ సైజు పెంచి కొత్తగా అనేకచోట్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. ఈ మొత్తం మానవ వ్యర్థాల మురుగునీటిని భూగర్భ డ్రయినేజీ పైప్‌లైన్ బహిరంగ ప్రదేశాలలో ప్రవహించకుండా ట్రీట్‌మెంట్ ద్వారా శుభ్రపరచటానికి ఐ.డి.ఎల్ చెరువు వద్ద ఒక ఎస్.టి.పిని కూడా నిర్మించటం జరిగింది. ప్రజల పన్నుల సొమ్ముతో కొన్ని కోట్ల రూపాయలు వెచ్చించి ఇన్ని నిర్మాణాలు ఏర్పాటు చేసుకున్నా పూర్తి సామర్థ్యంతో పనిచేయటం లేదు. మన స్థానిక (జి.హెచ్.ఎం.సి) ప్రభుత్వాల వైఫల్యం వల్ల భూగర్భ డ్రయినేజీ ద్వారా వెళ్లవలసిన మానవ వ్యర్థాల డ్రయినేజీ మన వర్షపునీటి కాలువలతో నిత్యం అనేక వ్యర్థాలతో జీవనదుల్లా ప్రవహిస్తున్నాయి.

**జరుగుతున్న నష్టాలు, జీవన విధ్వంసాలు:**

1. భూగర్భ డ్రయినేజీ ద్వారా వెళ్లవలసిన మానవ వ్యర్థాల మురుగునీరు బహిరంగంగా రోడ్లపై, వర్షపునీటి కాలువలలో ప్రవహించటం వల్ల విపరీతమైన దుర్గంధం, విచ్చలవిడిగా దోమలు వ్యాపిస్తూ ప్రజలు పలు రోగాల బారినపడి తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

2. డెంగీ, చికెన్ గున్యా, మలేరియా లాంటి విషజ్వరాల బారినపడి ఆస్పత్రులపాలై ఆర్థికంగా నష్టపోవటమే కాకుండా కొంతమంది ప్రాణాలు సైతం పోతున్నాయి.

3. కొన్ని సందర్భాలలో నిర్వహణాలోపం వల్ల ఈ మానవ

వ్యర్థాల మురుగునీరు తాగునీటి పైప్‌లైన్లలో కలసిపోతున్నాయి. ఆ నీటిని తాగటం వల్ల వాంతులు, విరేచనాలతో అనారోగ్యం, ఆస్పత్రుల పాలవటం, ఆర్థిక, ప్రాణ నష్టాలు వాటిల్లటం జరుగుతోంది.

4. భూగర్భ డ్రయినేజీ ద్వారా వెళ్లవలసిన మానవ వ్యర్థాల మురుగునీరు బహిరంగంగా రోడ్లపై ప్రవహించటం వల్ల రోడ్లు త్వరగా దెబ్బతింటున్నాయి. తద్వారా ప్రజలకు అసౌకర్యమే కాకుండా ప్రమాదాల బారిన పడుతున్నారు.

5. డబ్బూ పోయె శనీ పట్టే అన్న చందాన కోట్ల రూపాయల ప్రజల పన్నుల సొమ్ముతో నిర్మాణాలు జరుగుతున్నా, వాటి ఫలితాల్ని సక్రమంగా ప్రజలు పొందలేక పోతున్నారు. పన్నులు చెల్లిస్తూ మరీ అనేక అసౌకర్యాలకు, కష్టాలకు గురవుతున్నారు.

6. వర్షపునీటి కాలువలు నిర్మించి 35 ఏళ్లపైన కావడం, ఇదే కాలంలో అనేకసార్లు రోడ్లు వేయటం వల్ల రోడ్ల ఎత్తు పెరిగి, వర్షపునీటి కాలువల రిటైనింగ్ వాల్స్ రోడ్ల ఎత్తు కంటే దిగువై పోయాయి. దీనివల్ల రోడ్లపై ఉన్న చెత్తచెదారం, పూడికతీసిన మట్టి మళ్లీ కాలువలోకి పడిపోతున్నాయి. దీంతో పూడికతీత పనుల వల్ల ఉపయోగం లేకపోగా వర్షాకాలంలో వర్షపునీరు రోడ్లపై ప్రవహించటం వల్ల కోతకు గురై రోడ్లన్నీ పాడయిపోయి ప్రజలు తీవ్ర అసౌకర్యానికి, ప్రమాదాలకు గురవుతున్నారు.

7. అన్నిటికంటే దారుణం ఏమిటంటే, పైన తెలిపిన విషయాలకు సంబంధించి ఫిర్యాదులు వస్తున్నాయని వర్షపునీటి కాలువలలో పూడికలు తీయకుండా, వాటిలో కలుస్తున్న మానవ వ్యర్థాల మురుగునీటిని అదుపుచేయకుండా వాటిపై సిమెంట్ కాంక్రీట్ శ్లాబులను వేస్తున్నారు. సామెత చెప్పినట్లు, 'కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడినట్లు' పరిస్థితి తయారైంది. ఇలా చేయటం వలన వర్షపునీటి కాలువల్లో గాలి ఆడక, లోపలంతా మానవ వ్యర్థాల మురుగునీరు, చెత్తచెదారం చేరటం వల్ల కుళ్లిపోయి విపరీతమైన దుర్వాసనతో మన నివాస ప్రాంతాలు విషవలయంలో చిక్కుకుపోయే ప్రమాదం ఉంది.

ప్రజలు ఒకవైపు ప్రభుత్వాలకు పన్నులు కడుతూ, మరొకపక్క అనారోగ్యం పాలై ఆస్పత్రుల బిల్లులు కట్టుకోవాలా? ఆర్థికంగా చితికిపోవాలా? ఇదెక్కడి పనితీరు! ఇలా మన పరిసరాలను జి.హెచ్.ఎం.సివారు పట్టించుకోకుండా, పైగా పాడుచేస్తే రోగాలు రావా?

నిర్వహణకు కేటాయిస్తున్న వందల కోట్ల మన పన్నుల సొమ్ములు ఏమైపోతున్నాయి? ఎక్కడికి పోతున్నాయి?

ప్రభుత్వ, ప్రయివేటు ఏ ఆస్పత్రులైనా రోగులతో కిటకిటలాడుతున్నాయి. కారణం ఇలాంటి ప్రభుత్వాల వైఫల్యమే. ప్రజల పన్నుల సొమ్ములతో సుమారుగా 40 శాతం జీతభత్యాలు, అనేక సౌకర్యాలు పొందుతున్న మన ప్రభుత్వంలోని ప్రజాప్రతినిధులకు, అధికారులకు, ఇతర సిబ్బందికి బాధ్యత లేదా? ఇంత అసమర్థతా, ఇంత లెక్కలేనితనమా, ప్రజల పట్ల, ప్రజల ఆరోగ్యం పట్ల ఇంత నిర్లక్ష్యమా! ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కోవాలి.

**ఈ సమస్యలు పరిష్కారమవ్వాలంటే..**

1. ముందుగా జి.హెచ్.ఎం.సి ఇంజినీరింగ్



డిపార్టుమెంటువారు వర్షపునీటి కాలువల పూర్తిస్థాయి పూడికతీత పనుల్ని ప్రతీ సంవత్సరం వర్షాకాలానికి ముందే అంటే ఏప్రిల్, మే నెలల్లోనే పూర్తి చేయాలి.

2. ఎక్కడ భూగర్భ డ్రయినేజీ లీకేజీల ద్వారా వర్షపునీటి కాలువలలో కలుస్తోందో గుర్తించి, ఆ లీకేజీలను అరెస్ట్ చేయాలి.

3. అన్ని భూగర్భ డ్రయినేజీ పైప్‌లైన్‌లనూ ఎక్కడా లీకేజీ కాకుండా పటిష్ఠమైన ట్రంక్ పైప్‌లైన్ ద్వారా ఐడీఎల్ చెరువు దగ్గర నిర్మించిన ఎస్‌టీపీకి అనుసంధానించాలి. ఆధునిక సాంకేతికతను వినియోగించుకుంటూ క్రమంగా మహారాష్ట్ర 'అర్వి' తరహాలో వికేంద్రీకృత మురుగు శుద్ధి వ్యవస్థను ప్రవేశపెట్టాలి.

4. ఎస్.టి.పికి చేరిన మానవ వ్యర్థాల మురుగునీటిని సాంకేతిక ప్రమాణాల ప్రకారం ట్రీట్‌మెంట్ చేసి ఆ నీటిని చెరువులోకి పంపించే ఏర్పాటు చేయాలి.

5. ఈ కార్యక్రమాలు క్రమం తప్పకుండా అమలు జరగాలంటే ప్రజాప్రతినిధులు, ప్రభుత్వాధికారులు, సిబ్బందికి చిత్తశుద్ధి ఉండాలి.

ప్రజల సేవలు, సౌకర్యాల కొరకు గడచిన ఆరేళ్లలో ప్రభుత్వోద్యోగులకు 70 శాతం పైగా జీతాలు పెంచినా ఈ పరిస్థితులు ఎందుకు ఇలా దాపురిస్తున్నాయి? వెంటనే సమస్యలను పరిష్కరించే ఏర్పాట్లు చేయవలసిందిగా డిమాండ్ చేస్తున్నాము.

ఈ విషయాలు మాకున్న అవగాహన, కాస్త విషయ పరిజ్ఞానంతో మీకు తెలియచేస్తున్నాము.

**ఇట్లు**
**సత్యనారాయణ వెలిగట్ల,**
**ట్యాక్స్ పేయర్స్ అసోసియేషన్**

(నోట్: ఈ విషయాలను సంబంధిత ఉన్నతాధికారులు, ఇతర ప్రజాప్రతినిధులకు కూడా పంపిస్తాము.)

# సంస్కరణల మందగమనంతో..
# ఆర్థిక స్వేచ్ఛలో 108వ స్థానానికి భారత్

- రాఘవేందర్ అస్కాని, వ్యవస్థాపకులు, స్వతంత్రత సెంటర్ & యూత్ పార్లమెంట్ ప్రోగ్రాం




2021 ప్రపంచ ఆర్థిక స్వేచ్ఛ సర్వేలో 165 దేశాలు పాల్గొంటే, భారత్ గతేడాది కంటే మూడు స్థానాలు దిగి 108వ స్థానంలో నిలిచింది. పొరుగున ఉన్న భూటాన్, శ్రీలంక, నేపాల్‌ల కంటే ఇండియా వెనుకబడి ఉంది.

వ్యక్తిగత, సామాజిక, రాజకీయ, ఆర్థిక ఉన్నతికి - ఆర్థిక స్వేచ్ఛకీ మధ్య బంధం విడదీయలేనిది. ఆర్థిక స్వేచ్ఛ హెచ్చుగా ఉన్న దేశాలు, లేని దేశాలకంటే జీవన ప్రమాణాల్లో ఉన్నతంగా ఉంటున్నాయి.

ఈ ఏడాది నివేదికలో 165 దేశాల్లో ఆర్థిక స్వేచ్ఛను మదింపు చేశారు. అందులో హాంకాంగ్ ఎస్.ఎ.ఆర్ చైనా, సింగపూర్ మళ్లీ మొదటి రెండు స్థానాల్లో ఉన్నాయి. తైవాన్ 17, జపాన్ 18, కొరియా 47, కజిగిస్తాన్ 55, ఫిలిప్పిన్స్ 58, మంగోలియా 61, ఇండొనేషియా 70, థాయ్‌లాండ్ 89, భూటాన్ 92, శ్రీలంక 94, నేపాల్ 99, రష్యా 100 స్థానాల్లో ఉండగా, భారత్ 108వ స్థానంలో ఉంది.

కెనడాకు చెందిన ఫ్రేజర్ ఇన్‌స్టిట్యూట్ ఈ ప్రపంచ ఆర్థిక స్వేచ్ఛ నివేదికను విడుదల చేసింది. అయిదు రంగాలలో కొలమానాలతో దేశాల ర్యాంకులను నిర్ణయించటం జరిగింది. 1) ప్రభుత్వ పరిమాణం, పన్నులు, వ్యయం 2) న్యాయవ్యవస్థ పనితీరు, ఆస్తి హక్కులు, 3) నికర డబ్బు 4) అంతర్జాతీయ వాణిజ్యానికి స్వేచ్ఛ 5) నియంత్రణ

ఈ అయిదు ప్రధాన అంశాల్లో 24 భాగాలు, వాటిల్లో పలు ఉప విభాగాలు ఉన్నాయి. మొత్తంగా సూచికలో 142 వేరియబుల్స్ ఉన్నాయి. ప్రతి భాగాన్ని/ఉప భాగాన్ని అంతర్లీన డేటా ప్రతిబింబించేలా 0 నుండి 10 పాయింట్ల స్కేల్‌లో గణిస్తారు.

ఈ రకంగా వీలైనన్ని ఎక్కువ శాస్త్రీయ ప్రమాణాలతో నివేదికను రూపొందించారు. అలాగే ఇందుకు అవసరమైన గణాంక వివరాలను ఆయా దేశాల నుండి కాకుండా అంతర్జాతీయ సంస్థల నుండి సేకరించారు. సాధించిన పాయింట్ల ఆధారంగా ర్యాంకులు ప్రకటించారు.

ఆర్థిక స్వేచ్ఛకు సంబంధించిన ఐదు రంగాలలో భారతదేశం 1) ప్రభుత్వ పరిమాణంలో 7.39 పాయింట్లతో 49వ ర్యాంకులో 2) న్యాయ వ్యవస్థ పనితీరు, ఆస్తి హక్కుల భద్రతలో 5.51 పాయింట్లతో 65వ ర్యాంకులో 3) నికర డబ్బులో 7.87

పాయింట్లతో 109వ ర్యాంకులో 4) అంతర్జాతీయ వాణిజ్యానికి గల స్వేచ్ఛలో 5.84 పాయింట్లతో 135వ ర్యాంకులో 5) నియంత్రణలో 6.57 పాయింట్లతో 120వ ర్యాంకులో నిలిచినట్లు నివేదిక తెలిపింది.

మొత్తంగా మొదటి రెండు స్థానాల్లో ఉన్న హాంకాంగ్, సింగపూర్‌లకు వరుసగా 8.91, 8.81 పాయింట్లు లభించగా, 108వ స్థానంలోని భారత్‌కు 6.66 పాయింట్లు దక్కాయి.

భారతదేశం ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా ఉన్నప్పటికీ, ఇక్కడ సాధించిన పాయింట్లను దేశంలో పెరిగిన అవినీతి కబళిస్తోంది. దీనికితోడు వ్యవస్థాగతమైన లోటుపాట్లు దీర్ఘకాలిక అభివృద్ధిని దెబ్బతీస్తున్నాయి. సమర్థవంతంగా పనిచేసే న్యాయ, చట్ట వ్యవస్థల లోటు, ఆర్థిక వ్యవస్థలో సర్వత్రా వ్యాపించిన అవినీతి వల్ల.. క్రియాశీలంగా వ్యవహరించే ప్రయివేటు రంగం మందగమనంలో పడింది. అనేక రంగాలలో ప్రభుత్వ పెత్తనం, దుబారాతో కూడిన సబ్సిడీ వ్యవస్థ వల్ల బడ్జెట్ లోటు పెరుగుతోందని నివేదిక పేర్కొంది. భారతదేశంలో ఆర్థిక సంస్కరణలు ఆటుపోట్లతో సాగుతున్నాయి. కీలకమైన సేవారంగాల సరళీకరణ ఆగిపోయింది.

మొత్తంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వ నాయకత్వంలో, భారతదేశం ఆర్థిక స్వేచ్ఛ మూలస్తంభాలలో అతిపెద్ద సవాలును ఎదుర్కొంటోందని ఈ నివేదిక తేటతెల్లం చేస్తోంది. విధానాలు సరళీకరణ వైపు వెళ్లకపోవటం, అహేతుక సామ్యవాద విధానాల కొనసాగింపు, ఉచితాలు, జనాకర్షక పథకాల కారణంగా ఆర్థిక వ్యవస్థ వేగం మందగించింది. అవినీతిని నియంత్రించటంలో అవకాశాలను జారవిడవటంతో మరింత కఠిన సవాళ్లు ఎదురవుతున్నాయి.

**దాదాపు రెండున్నర దశాబ్దాలుగా సాగుతున్న ఫ్రేజర్ అధ్యయనాలు ఎక్కడ ఆర్థిక స్వేచ్ఛ ఉంటే అక్కడ ఆర్థిక వ్యవస్థలో పెట్టుబడుల రేటు హెచ్చుగా, ఆర్థిక ప్రగతి రేటు హెచ్చుగా ఉన్నాయని స్పష్టం చేస్తున్నాయి. పెరుగుతున్న ఆదాయాలు, తరుగుతున్న పేదరికానికి ఆర్థిక స్వేచ్ఛ కీలకమని వెల్లడిస్తున్నాయి. అలాగే ఆర్థిక స్వేచ్ఛ ఉన్న దేశాలలో రాజకీయ, న్యాయ వ్యవస్థలు కూడా ఆ దేశాల తలసరి ఆదాయాలు పెంచటంలో, ఆర్థికాభివృద్ధిని సాధించటంలో ముందున్నాయి.**

## పారిశ్రామికవాడ ఇలా ఉంటే పెట్టుబడులు ఎలా?

విజయనగరం జిల్లా బొబ్బిలిలో పారిశ్రామికవాడలోని ప్రధాన రహదారులు పాదయి అడుగుకో గుంతతో అధ్వాన్నంగా తయారయ్యాయి. ఇలాంటి రహదారులుంటే పరిశ్రమలు పెట్టటానికి ఎవరు ముందుకు వస్తారని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యుడు ఆకుల దామోదరరావు ప్రశ్నించారు. పారిశ్రామికవాడలో రహదారులను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, ఇక్కడ మౌలిక సదుపాయాలు దారుణంగా ఉన్నాయని, అధికారంలోకి వస్తే అభివృద్ధి చేస్తామన్న ప్రభుత్వం గత రెండున్నరేళ్లుగా ఏమి చేశారో వివరాల్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఇప్పటికే పలు పరిశ్రమలు మూతపడి యువత  వలసలు పోతున్నారని, ప్రభుత్వం వెంటనే పారిశ్రామికవాడ పనులపై దృష్టి సారించాలన్నారు.

## కొలతలు, తూనికలపై పర్యవేక్షణకు అన్ని పార్టీల కమిటీ వేయాలి

ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన చౌకధరల దుకాణాలలో పర్యవేక్షణ లోపం వల్ల కొలతలు, తూనికల్లో అక్రమాలు జరుగుతున్నాయని, పర్యవేక్షణకు అన్ని పార్టీలతో ఫుడ్ కమిటీని ఏర్పాటు చేయాలని లోక్‌సత్తా పార్టీ ఎస్.కోట నియోజకవర్గ అధ్యక్షుడు కాంద్రేగుల ప్రసాద్ అన్నారు. ఈ మేరకు ఎమ్మార్వోను కలిసి విజ్ఞాపన అందచేశారు.

# అందరికీ ఆరోగ్యానికి ఆచరణసాధ్య నమూనా

**సమర్థవంతం | అందుబాటు | అతి తక్కువ వ్యయం**

## జులై 2021

(తెలుగులో స్థూల అనువాదం)

(గమనిక: ప్రజలపై ఎటువంటి ఆర్థిక భారం లేకుండా భారతదేశంలో అందరికీ నాణ్యమైన ఆరోగ్యాన్ని జీడీపీలో అతి తక్కువ వ్యయంతో అందించేందుకు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ నేతృత్వంలో ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్) ఇంగ్లీషులో రూపొందించిన సమగ్ర ఆరోగ్య విధానానికి స్థూలంగా తెలుగులో చేసిన అనువాదమిది. ఇందులో పట్టికలు, గణాంక పటాలు, అనెగ్జర్ల వివరాలుండవు. ఆరోగ్య విధానంపై రూపొందించిన పుస్తకంలో పూర్తి సమాచారం ఉంటుంది)



**2. డాక్టర్, రోగి మధ్య సమాచార అంతరం ఆరోగ్య సేవల్లో స్వేచ్ఛామార్కెట్ల వైఫల్యానికి దారితీస్తుంది.**

ప్రపంచబ్యాంకు తన ప్రపంచ అభివృద్ధి నివేదిక, 1993లో ఇలా పేర్కొంది–

అందుబాటులో ఉన్న ప్రతి చికిత్సకు ఫలితం ఎలా ఉండే అవకాశముందో, ఎంత ఖర్చవుతుందో అతను లేదా ఆమెకి తెలిస్తే.. ఆ రోగి, లాభాలు, వ్యయాలను బేరీజు వేసుకుని హేతుబద్ధంగా నిర్ణయం తీసుకునే అవకాశం ఉంటుంది. కానీ రోగులకు అటువంటి పరిజ్ఞానం ఉండదు. వైద్య నిపుణులకు మాత్రం సాధారణంగా తమ వినియోగదారుని కంటే ఎంతో ఎక్కువ అవగాహన ఉంటుంది. సమాచారంలో ఈ అంతరం అంటే అర్థం.. వైద్యుడు కేవలం సేవలను అందించటమే కాకుండా, ఎటువంటి సేవలను అందించాలో కూడా నిర్ణయిస్తాడు. దీనివల్ల మరిన్ని సేవలను అమ్మటం ద్వారా తనకు వచ్చే లాభాలకు – రోగికి ఏది ఎక్కువ ప్రయోజనకరమో అదే చేయాలన్న ఆమె లేదా అతని వైద్య బాధ్యతకు మధ్య.. తీవ్రస్థాయి ప్రయోజనాల సంఘర్షణ ఏర్పడుతుంది. అనారోగ్యం వల్ల నిర్ణయాలు తీసుకోలేని స్థితిలో ఉన్నప్పుడు లేదా ప్రాణానికి ప్రమాదం అనే పరిస్థితుల్లో వేగంగా నిర్ణయాలు తీసుకోవాల్సి వచ్చినప్పుడు రోగి మరింత అననుకూల పరిస్థితుల్లో ఉంటారు.

ఈ సమాచార అంతరం.. చదువు, అందుబాటులో సమాచారం లేని పేదవర్గాలపైనే ఎక్కువ ప్రభావం చూపుతుంది. దీంతో ఆ వర్గాలవారే వైద్య సేవలందించే వారి చేతిలో దోపిడీకి గురయ్యే ప్రమాదాన్ని ఎదుర్కొంటుంటారు. "సరఫరాదారుడు సృష్టించిన డిమాండ్"కి ఇది దారితీస్తుంది. దీంతోపాటు, చెల్లింపుదారుడు బీమా కంపెనీ లేదా ప్రభుత్వం లాగా మూడవ పార్టీ అయినప్పుడు ఈ దోపిడీ అవకాశం మరింత ఎక్కువగా ఉంటుంది. వైద్య సేవలు అందించేవారికి, రోగికి కూడా వ్యయం తగ్గించాల్సిన అవసరం కనిపించదు. ఇలా తమ చర్యలకపర్యవసానాలను వారు పూర్తిగా స్వీకరించరు కాబట్టి.. ఇన్సూరెన్సు నిర్వాహకులు వంటి ఇతరులపైకి ఖర్చుల భారాన్ని బదిలీ చేయటాన్ని "నైతిక విపత్తు" (మోరల్ హెజార్డ్) అంటారు. సందిగ్ధత వల్ల, ఇన్సూరెన్సు నిర్వాహకులు వినియోగదారుని ప్రవర్తనను పూర్తిస్థాయిలో పర్యవేక్షించి అతను/ఆమెను స్వీయనిర్ణయాలకు బాధ్యుల్ని చేయలేకపోవటం వల్ల ఈ పరిస్థితి తలెత్తుతుంది. బీమా వర్తింపు ఉంది కదా అని ఇన్సూరెన్స్ కలిగిన వ్యక్తి ఆయా పర్యవసానాల్ని నియంత్రించటంలో తక్కువ జాగ్రత్తను ప్రదర్శించవచ్చు, లేదా అతి జాగ్రత్తగా ఉండవచ్చు. అమెరికన్ ఆర్థికవేత్త మార్ వి. పాలీ ప్రకారం.. వైద్య సేవల్ని అతిగా వినియో గించటం వల్ల అతను లేదా ఆమె చెల్లించాల్సిన కిస్తీ పెరుగుతుం దని ప్రతి ఒక్కరూ గుర్తించినా, ఆ వినియోగాన్ని తగ్గించుకోవాల నుకోరు. దీనికి కారణమేమంటే, అదనపు వినియోగం వల్ల సంచిత ప్రయోజనం వ్యక్తికి సమకూరుతుంది. కానీ ఆ ఖర్చు భారం మాత్రం ఎక్కువగా ఇతర బీమాదారుల మీద పడుతుంది.

అమెరికా ఆరోగ్య వ్యవస్థ అసమర్థతపై చాలామంది చెప్పారు. కామన్‌వెల్త్ ఫండ్ ఇటీవల చేసిన ఓ విశ్లేషణ ప్రకారం, అమెరికాలో ఆరోగ్య సంరక్షణ కోసం చేసే ఖర్చులో నాలుగో వంతు.. 760 బిలియన్ డాలర్ల నుండి 935 బిలియన్ డాలర్ల వరకు ఏటా వృథా ఖర్చే. మితిమీరిన చికిత్స, లేకుంటే, ఎటువంటి ప్రయోజనం కలిగించని లేదా కొద్దిపాటి ప్రయోజనం కలిగించే లేదా తీవ్ర ప్రమాదానికి అవకాశమున్న మందుల వినియోగం, పరీక్షలు, చికిత్సలు వంటి తక్కువ స్థాయి (లో–వాల్యూ) సేవలు.. ఆ వృథా వ్యయంలో పదో వంతు దాకా ఉంటాయి. ఏటికేడు అమెరికాలో తప్పుడు చెల్లింపుల చట్టం కింద బయటపడుతున్న భారీ అక్రమాలు ఆస్పత్రుల బిల్లుల్లో, ఆరోగ్య రంగంలోనే ఉంటున్నాయి. ఇన్సూరెన్స్ ఆధారిత తృతీయ స్థాయి వైద్యంపై భారీ వ్యయం చేస్తుండటంతో, న్యాయం, అన్యాయం, నైతికం, అనైతికం అనే తేడా లేకుండా ఏదోకరకంగా బిల్లుల్ని పెంచేయాలనే ప్రలోభం వెర్రితలలు వేస్తుంది. ఇందులో రోగి క్షేమం పట్ల లేదా వనరుల్ని హేతుబద్ధంగా, విజ్ఞతతో వినియోగించుకోవటం పట్లా ఏ రకమైన తగిన చిత్తశుద్ధి ఉండదు. జవాబుదారీతనానికి పటిష్ఠమైన యంత్రాంగాలున్న అమెరికాలాంటి దేశంలోనే పరిస్థితి ఇలా ఉంది.

**3. ఇన్సూరెన్స్ మార్కెట్లు, ముఖ్యంగా ఆరోగ్య రంగంలో, అసమర్థతలకు ఆలవాలం**

బీమా హామీదారునికి, వినియోగదారునికి మధ్య తమ వ్యక్తిగత రిస్కులపై సమాచారంలో ఉండే అంతరం 'ప్రతికూల ఎంపిక' (యాడ్‌వర్స్ సెలక్షన్) అనే మరో రకమైన మార్కెట్ వైఫల్యానికి దారితీస్తుంది. పైకి కనిపించని తీవ్ర ఆరోగ్య సమస్యలున్నవారు ఆరోగ్యకరమైన వారి కంటే ఎక్కువగా ఆరోగ్య బీమాని కొనుగోలు చేసే అవకాశముంది. దీనివల్ల, ఏ బీమా కంపెనీ అయినా తన ఖర్చుల్ని భర్తీ చేసుకునేందుకు, సాధారణ వ్యక్తి కంటే రోగ సమస్య ఉన్న వ్యక్తిని దృష్టిలో పెట్టుకునే ఇన్సూరెన్స్ ధరను నిర్ణయించాల్సి ఉంటుంది. ఈ పరిస్థితుల్లో, సాధారణ ఆరోగ్యం కలిగిన వ్యక్తి కూడా ధర చూసి ఇన్సూరెన్స్ అక్కర్లేదనుకుంటాడు. ప్రజలు కవరేజీ తీసుకోకుండా ఉంటే, అనారోగ్యం నుండి ఆర్థిక నష్ట ప్రమాదాన్ని తొలగించే తన లక్ష్యాన్ని సాధించటంలో బీమా మార్కెట్ విఫలమవుతుంది. ఆరోగ్య నష్ట ప్రమాదాలకు అనుగుణంగా కిస్తీలు పెరుగుతున్నకొద్దీ, ఆరోగ్యకరమైన ప్రజానీకం అటువంటి బీమా పథకాల నుండి విరమించుకుంటుంటారు, దీనివల్ల కిస్తీ వ్యయాలు ఇంకా పెరుగుతూ, ఇంకా ఎక్కువమంది ఆరోగ్యవంతులు వాటి నుంచి బయటికొచ్చేస్తుంటారు. చివరికి ఇదో 'మృత్యు వలయం'గా తయారవుతుంది. ఈ పరిణామాలు నాణ్యతలేని బీమా వర్తింపు ధోరణులకు దారితీసి, కొన్ని రకాల వ్యాధులు, చికిత్సలు లేదా రోగులకు వర్తింపును బీమా నిర్వాహకులు తిరస్కరించే అవకాశముంటుంది. ఇన్సూరెన్స్

వర్తింపు అవసరం ఎక్కువగా ఉండే హై రిస్క్ ప్రజానీకాన్ని గుర్తించి కవరేజీ పరిధి నుంచి తప్పించేందుకు ఇన్సూరర్లు తరచూ ప్రయత్నిస్తుంటారు. దీన్ని 'క్రీమ్ స్కిమ్మింగ్' అంటారు. ఈ క్రమంలో నిర్వహణ వ్యయం భారీగా తయారవుతుంది. ఫలితంగా, మార్కెటు విఫలమై, తీవ్ర అనారోగ్యాలకు చికిత్స లభించదు. నివారించదగ్గ మరణాలు, నిరుద్యోగం చోటుచేసుకుంటాయి, కోట్లాదిమంది జీవితాల్లో పేదరికం కొనసాగుతుంటుంది.

ఆరోగ్య సంరక్షణ నిర్వహణ వ్యయాలపై అమెరికా తలసరి 2,500 డాలర్లను ఖర్చు చేస్తోంది. ఇది ఏక చెల్లింపుదారు సామాజిక బీమా నమూనా ఆధారితమైన ఆరోగ్య వ్యవస్థ కలిగిన కెనడా చేస్తున్న వ్యయం (550 అమెరికన్ డాలర్లు) కంటే 4.5 రెట్లు ఎక్కువని 2017లో ఒక అధ్యయం వెల్లడించింది. అసమర్థంగా ఉండటమే కాకుండా, సమానత్వాన్ని సాధించటంలో కూడా అమెరికా బీమా నమూనా విఫలమైంది. ఎఫర్డబుల్ కేర్ చట్టం కింద వైద్యసేవల సహాయ కవరేజీని విస్తరించి బీమా మార్కెట్లలో రాయితీలను ఇచ్చి అమెరికాలో బీమా లేనివారి సంఖ్యను సగానికి తగ్గించినా, దాదాపు 2.5 కోట్ల మంది అమెరికన్లు ఇప్పటికీ ఇన్సూరెన్స్ లేకుండా ఉన్నారు. బీమా లేనివారిలో దాదాపు సగమంది (47%) 2018లో వైద్యసేవల సహాయ (మెడిక్ఎయిడ్) విస్తరణ ద్వారా గానీ, రాయితీ మార్కెటింగ్ పథకాల ద్వారా గానీ ఇన్సూరెన్స్ పొందటానికి తగిన ఆదాయాలు కలిగి ఉన్నవారే. ఎక్కువమంది అమెరికన్లు ఇన్సూరెన్స్ కొనటం కన్నా, అంతకంటే చౌకగా ఉండే జరిమానాలు చెల్లించటానికే మొగ్గు చూపారు. నిజానికి, బీమా చేయించుకున్న ప్రజల శాతం రాబోయే కాలంలో ఇంకా తగ్గుతుందని, 2018లో ఉన్న 90.6 శాతం 2028 నాటికి 89.4 శాతం అవుతుందని అంచనా.

వైద్య సంరక్షణలో పురోగతి, ఆస్పత్రుల్లో పెద్దఎత్తున పెట్టుబడులు సాధారణంగా పేదల కంటే సంపన్నుల ఆరోగ్యానికే ఎక్కువ ఉపయోగపడుతుంటాయి. ఉదాహరణకి అమెరికా నమూనానే తీసుకుంటే, బీమా కలిగినవారు (ఇన్‌సైడర్లు) అత్యాధునిక వైద్య చికిత్సల్ని అందుకుంటుండగా, బీమా లేనివారు (ఔట్‌సైడర్లు) సాధారణ చికిత్సల్ని పొందటం కూడా కష్టంగా ఉంది. ఈ పరిస్థితిని ఆర్థికవేత్త పాల్ క్రుగ్‌మన్ "ఆరోగ్య సంక్షోభం.. దానిపై ఏమిటి చేయటం?" అనే తన వ్యాసంలో వర్ణించి చెప్పారు. నూతన వైద్య సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నకొద్దీ ఆరోగ్య వ్యవస్థ ఇన్‌సైడర్ల మీద ఇంకా ఎక్కువ ఖర్చు చేస్తుంటుంది. ఇలా ఇన్‌సైడర్ల మీద చేస్తున్న అధిక ఖర్చును భర్తీ చేసుకోవటానికి మరింతమందిని ఔట్‌సైడర్లుగా తయారుచేస్తుంది. అంటే, కొందరి అధునాతన వైద్యానికి అయ్యే ఖర్చును చెల్లించటం కోసం ఇంకొందరికి సాధారణ ఆరోగ్య సేవలు కూడా అందకుండా చేయటం. ఈ రకంగా వైద్యరంగంలో పురోగతి అనేకమంది అమెరికన్ల ఆరోగ్యానికి హానికరంగా మారిన ఓ క్రూర వైచిత్రిని మనం ఎదుర్కొంటున్నాం అన్నారాయన.

**4. చౌకగా ఆరోగ్యాన్ని అందుబాటులోకి తేవటం పేదరికాన్ని గణనీయంగా తగ్గిస్తుంది**

చౌకగా అందుబాటులో ఆరోగ్య సేవలుంటే, ప్రజల్ని పేదరికం నుండి బయటపడేయవచ్చని, వారి ఉత్పాదక శక్తిని పెంచవచ్చని చెప్పటానికి ప్రపంచవ్యాప్తంగా కావలసినన్ని ఆధారాలున్నాయి. ఉదాహరణకి, థాయ్‌లాండ్ 2002లో సార్వత్రిక ఆరోగ్య పథకాన్ని (యు.హెచ్.సి) ప్రవేశపెట్టింది. అప్పటి నుండి, ఆ దేశం ఆరోగ్య రంగంలో ఆదర్శప్రాయ ఫలితాలను చూపెట్టింది. ఆరోగ్యానికి పెట్టిన ఖర్చుల తర్వాత పేదరికం ఎంతుందో జాతీయ దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాల శాతం ప్రకారం లెక్కేస్తే.. 2000 సంవత్సరంలో ఆ దేశంలో సుమారు 35.5 శాతంగా తేలింది. 2002లో మొత్తం జనాభా అంతటికీ ఆరోగ్య కవరేజీని సాధించాక, పేదరికం దాదాపు ఆరు రెట్లు తగ్గి 2015లో 6.6 శాతానికి చేరింది. చికిత్స బిల్లులు చెల్లించటం వల్ల పేదరికం కూడా 2015లో నాలుగు రెట్లు తగ్గింది. యు.హెచ్.సి ప్రారంభమైన 2002లో 1.3గా ఉన్న ఈ శాతం 2015లో సుమారు 0.3 శాతానికి పడిపోయింది.

ఆరోగ్య సంరక్షణ సేవల కోసం చేసే వ్యయం భారతదేశంలో పేదరికానికి అతి పెద్ద కారణంగా కొనసాగుతోంది. ఈ కారణంగానే ఏటా కోట్ల మంది దారిద్ర్యరేఖ దిగువనకు జారిపోతున్నారు. 2011-12లో సుమారు 5.5 కోట్ల మంది ఆరోగ్యంపై ఓ.ఓ.పి.ఇ వల్ల పేదలుగా మారారని ఒక అధ్యయనం అంచనా వేసింది (అధ్యాయం 2లో పట్టిక 2.4). కుటుంబ వినియోగ వ్యయంలో ఓ.ఓ.పి.ఇ వాటా 1993-94లో 4.9 శాతం నుండి 2004-05లో 6 శాతానికి, 2011-12లో 7.2 శాతానికి చేరింది. ఈ పెరుగుదల నిరుపేద, అత్యంత సంపన్న జనాభా వర్గాలకే అతి ఎక్కువగా ఉంది. రోగ నిర్ధారణ పరీక్షలు, ఇతర చికిత్సేతర వ్యయాలే ఇందులో ఎక్కువగా ఉన్నాయి (అధ్యాయం 2లో గణాంక పటం 2.6). ఇదేవిధంగా, తీవ్ర అనారోగ్యాలకచికిత్స కోసం ఖర్చు చేసే కుటుంబాలు 2004లో 21 శాతం నుండి 2014లో 25 శాతానికి పెరిగాయి. ఈ పెరుగుదల నిరుపేద వర్గాల్లోనే ఎక్కువగా ఉంది (అధ్యాయం 2లో పట్టిక 2.6).

భారత్‌లో మొత్తం ఆరోగ్య వ్యయంలో ఓ.ఓ.పి.ఇ 59 శాతం ఉండగా, ప్రభుత్వం కేవలం 32 శాతం ఖర్చు చేస్తోంది. ప్రభుత్వ వ్యయ వాటా పెరిగితే పేదల మీద భారం ఎంతో తగ్గుతుంది. పేదల ఆరోగ్యంపై ప్రభుత్వం పెట్టుబడి పెట్టటం పేదరికాన్ని తగ్గించటానికి ఆర్థికంగా, రాజకీయంగాకూడా పటిష్ఠమైన వ్యూహం. మంచి ఆరోగ్యం.. శ్రామిక శక్తి ఉత్పాదకతలో పెరుగుదల, దాన్నుంచి మరిన్ని పెట్టుబడులు, మెరుగైన మానవ వనరులు, మెరుగైన జాతీయ పొదుపు, సంతానోత్పత్తి శాతం, మరణాలు తగ్గటం వంటి జనాభాపరమైన మార్పులు మొదలైన రూపాల్లో ఆర్థికంగా లాభాల్ని అందిస్తుంది. పేలవమైన ఆరోగ్య వ్యవస్థ పేదల జీవనోపాధిపై చూపుతున్న ప్రతికూల ప్రభావాల దృష్ట్యా, సమీక్ష చేసుకుని, విశ్లేషించుకుని, వినూత్న

పరిష్కారాలను ఆవిష్కరించటం మన వ్యవస్థలో భాగస్వాములందరి ఉమ్మడి నైతిక బాధ్యత.

భారతదేశంలోని ఆరోగ్య వ్యవస్థను నిశితంగా విశ్లేషించి, సమీక్షించాల్సిన సమయం ఆసన్నమైంది. విజయవంతమైన అత్యుత్తమ పద్ధతుల్ని స్వీకరించటం, నిరర్థకమైన పద్ధతుల్ని వదిలేయటం, సానుకూల దృక్పథాన్ని జోడించటం, ప్రపంచ ప్రమాణాలను విశ్లేషించటం నుండి మనం ప్రారంభమవ్వాలి. అమెరికా, బ్రిటన్‌లలో భిన్నమైన నమూనాలను నిశితంగా పరిశీలిద్దాం. వారి అనుభవాల నుండి నేర్చుకుందాం. భారతదేశ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థకి కీలక పాఠాలనందించే ఎంతో ముఖ్యమైన వ్యయాలు, ఫలితాలను దిగువన ఇవ్వడమైంది.

**3.2. బ్రిటన్, అమెరికా ఆరోగ్య వ్యవస్థల మధ్య పోలిక**

**3.2.1. ప్రాథమిక ఆరోగ్యం**

బ్రిటన్ ప్రాథమిక ఆరోగ్య నమూనా ప్రభుత్వం, సాధారణ వైద్య సేవలందించేవారి (జనరల్ ప్రాక్టిషనర్లు – జి.పి లు) మధ్య పి.పి.పి మీద ఆధారపడి ఉంటుంది. నమోదు చేసుకున్న ప్రతి రోగిపై ఒక నిర్దిష్ట మొత్తం డబ్బుని జి.పికి ప్రభుత్వం చెల్లిస్తుంది. ప్రజలందరికీ ఉచితంగా ప్రాథమిక వైద్యాన్ని అందిస్తుంది. ఆరోగ్య రికార్డులు, ఆస్పత్రి స్థాయిలో ప్రత్యేకీకరణ (స్పెషలైజేషన్) సేవలకు అత్యవసరాల్లో మినహాయించి మిగతా సందర్భాల్లో జి.పి నుండి సిఫార్సు (రెఫరల్) పద్ధతి.. ఇలా ఒక బలమైన వ్యవస్థ ప్రాథమిక ఆరోగ్యంలో అంతర్భాగంగా ఉంటుంది. అమెరికాలో, ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థ ఎక్కువగా ప్రయివేటు రంగంలోనే ఉంది. బ్రిటన్‌లోలా జి.పిల ద్వారా పటిష్ఠ ప్రాథమిక వైద్య సేవల వ్యవస్థ లేనప్పటికీ, 87 శాతం మంది ప్రజానీకం అనారోగ్యం వస్తే మొదట వారి కుటుంబ/వ్యక్తిగత వైద్యుడినే (ఫిజీషియన్) సందర్శిస్తారు.

అమెరికాలో బ్రిటన్ కంటే తక్కువ మంది ప్రాథమిక వైద్య ఫిజీషియన్లు ఉన్నారు. ప్రాథమిక వైద్యానికి ఒక సంవత్సర కాలంలో జరిగే సంప్రదింపులు కూడా తక్కువే (పట్టిక 3.2). డయాబెటిస్, హైపర్ సెన్సిటివ్ వ్యాధులు, క్యాన్సర్లు వగైరాలు సహా నివారించదగ్గ కారణాల నుండి నివారించదగ్గ మరణాల రేటు అమెరికాలో ఎక్కువ. బ్రిటన్‌లో నివారించదగ్గ మరణాల రేటును ప్రతి 1,00,000 జనాభాకు 2001లో 159 నుండి 2016లో 118కి తగ్గించారు. మరోవైపు, అమెరికాలో నివారించదగ్గ మరణాలు చాలా నెమ్మదిగా తగ్గుతూ 2001లో 195 నుండి 2012లో 166కి దిగాయి. మళ్లీ క్రమంగా పెరుగుతూ 2017లో 174కి చేరాయి. అమెరికాలో ప్రాథమిక, నివారణ వైద్యానికి, దీర్ఘకాల వ్యాధుల నియంత్రణకి వైద్య సేవలు అందుబాటులో లేవనటానికి ఇది సంకేతం. 2015లో కేవలం 8% మంది అమెరికన్లు (35+ వయసు) తమకు సిఫారసు చేసిన అత్యంత ప్రాధాన్యమైన, సరైన క్లినికల్ నివారణ సేవలను పూర్తిస్థాయిలో అందుకున్నారు. దాదాపు 5% మంది వయోజనులు అలాంటి ఏ సేవనూ అందుకోలేదని ఓ అధ్యయనం గుర్తించింది.

**(పట్టిక 3.2: బ్రిటన్, అమెరికాలలో ప్రాథమిక వైద్య సేవలు)**

**3.2.2. ఆస్పత్రి సేవలు**

పట్టిక 3.3 చూపుతున్నట్లు, బ్రిటన్‌లో దాదాపు 80 శాతం ఆస్పత్రులు ప్రభుత్వాస్పత్రులు. అమెరికాలో అందుకు విరుద్ధంగా 80% ఆస్పత్రులు ప్రయివేటు యాజమాన్యంలో, ఎక్కువగా లాభాపేక్షలేని విభాగంలో ఉంటాయి. బ్రిటన్‌లో అందరికీ ఆరోగ్య సేవల వర్తింపు ఉంది. కేవలం 10% మంది మాత్రమే అదనంగా స్వచ్ఛందంగా ప్రయివేటు ఇన్సూరెన్స్ తీసుకుంటారు. అమెరికాలో 68 శాతం మందికి ప్రజలకు ప్రయివేటు బీమా ఉంది. 34 శాతం జనాభా మెడికేర్, మెడిక్‌ఎయిడ్‌లాంటి ప్రభుత్వ బీమా పథకాల పరిధిలోకి వస్తారు. దాదాపు 8% జనాభాకి ఎటువంటి ఇన్సూరెన్స్ లేదు.

**(పట్టిక 3.3: బ్రిటన్, అమెరికాలలో ఆస్పత్రి సేవల నమూనాలు)**

**3.2.3. వ్యయ భారాలు**

**1. ఆరోగ్య సంరక్షణ చెల్లింపులు** – గణాంక పటాలు 3.2ఎ, 3.2బిలు సూచిస్తున్నట్లు, ఆరోగ్య వ్యయంలో 80 శాతాన్ని బ్రిటన్‌లో ప్రభుత్వమే భరిస్తుంది. అదే అమెరికాలో, ప్రభుత్వం, ప్రయివేటు వ్యయం దాదాపు సమానం. బ్రిటన్‌లో మిగిలిన 20 శాతం వ్యయంలో ఎక్కువ భాగం వ్యక్తులు సొంతంగా చేసేది. అమెరికాలో ప్రయివేటు వ్యయంలో 62 శాతం ప్రయివేటు ఇన్సూరెన్స్ చేస్తుంది. బ్రిటన్‌లో 10 శాతం మంది ప్రయివేటు మార్కెట్‌లో సేవలను అందుకునేందుకు అదనంగా స్వచ్ఛంద ప్రయివేటు బీమాని తీసుకుంటున్నారు.

**2. వ్యయంలో తీరుతెన్నులు** – అమెరికా, బ్రిటన్‌లలో ఆరోగ్య వ్యయాల తీరుతెన్నుల్ని 3.3ఎ నుండి జి వరకు గణాంక పటాలు తేటతెల్లం చేస్తాయి. జి.డి.పిలో ప్రభుత్వ ఆరోగ్య వ్యయం వాటా రెండు దేశాల్లో ఒకేలా ఉంటుంది. ప్రయివేటు వ్యయం చాలా ఎక్కువగా ఉండటం వల్ల, ప్రభుత్వ, ప్రయివేటు కలిపి మొత్తం వ్యయం అమెరికాలో రెట్టింపు ఉంటుంది. తలసరి ఆరోగ్య వ్యయం అమెరికాలో భారీగా పెరుగుతుండగా, ఆరోగ్య వ్యయంలో ఓ.ఓ.పి.ఇ వాటా మాత్రం స్వల్పంగా తగ్గుముఖం పట్టింది. ఇందుకు విరుద్ధంగా, బ్రిటన్ ప్రభుత్వం చేస్తున్న తలసరి ఆరోగ్య వ్యయం నిలకడగా ఉంది. ప్రభుత్వం ఖర్చులు తగ్గించుకునేందుకు ప్రిస్క్రిప్షన్ మందులు మొదలైన వాటికి ఉమ్మడి చెల్లింపులు వంటి పద్ధతుల్లో పౌరులు కూడా కొంత భారాన్ని పంచుకునే పద్ధతుల్ని ప్రోత్సహించటంతో ఓ.ఓ.పి.ఇలో మాత్రం కొంత పెరుగుదల నమోదవుతోంది. ఆరోగ్య సేవల వ్యయంలో చెల్లింపులకు సంబంధించిన అన్ని మూలాల నుండీ అమెరికా ఆరోగ్య వ్యవస్థ వ్యయంలో వేగంగా పెరుగుదల నమోదవుతోంది. ఆరోగ్య సేవల ఖర్చుల నిరంతరం పెరుగుదలకు ఈ చెల్లింపులు అద్దం పడుతున్నాయి. ప్రయివేటు వ్యయం భారీ స్థాయిలో ఉన్నప్పటికీ, ఆరోగ్యంపై ప్రభుత్వ తలసరి వ్యయం అమెరికాలో గణనీయంగా పెరుగుతోంది. ప్రయివేటు రంగంలో బీమా ఆధారిత పద్ధతులు ఆర్థికంగా

ఆచరణసాధ్యం కాదని స్పష్టంగా రుజువు చేస్తోంది.

**(గణాంక పటం 3.2ఎ: బ్రిటన్ ఆరోగ్య వ్యయం పథకాల వారీగా**
**గణాంక పటం 3.2బి: అమెరికా ఆరోగ్య వ్యయం పథకాల వారీగా**
**గణాంక పటం 3.3: ఆరోగ్య వ్యయంలో పోకడలు - బ్రిటన్, అమెరికా)**

**3. బ్రిటన్, అమెరికాలలో కొన్ని ఆస్పత్రి సేవల వ్యయాల పోలిక -**

బ్రిటన్, అమెరికాలలోని కొన్ని పద్ధతులు, మందులు, డయాగ్నోస్టిక్‌లను పోల్చిన వివరాలను 3.4ఎ నుండి సి వరకు గణాంక పటాలు తెలియచేస్తున్నాయి. ఆస్పత్రి, ఫిజీషియన్ చికిత్సల సగటు ఖర్చు బ్రిటన్‌లో కంటే అమెరికాలో రెండు నుంచి నాలుగు రెట్లు ఎక్కువ. మందులు బ్రిటన్‌లో కంటే రెండు నుండి 8 రెట్లు ఎక్కువ. దీంతోపాటు యాంజియోగ్రామ్, కొలొనోస్కోపీ ఈ రెండు రోగ నిర్ధారణ పరీక్షలకు తప్ప అమెరికాలో డయాగ్నోస్టిక్‌ల వ్యయం బ్రిటన్‌లో కంటే ఎక్కువ.

**(గణాంక పటం 3.4: బ్రిటన్, అమెరికాలలో ఆస్పత్రి సేవల వ్యయాల పోలిక)**

అన్ని వివరాలు విస్పష్టంగా వెల్లడిస్తున్నట్లు, అమెరికాలో వైద్య సేవల ధరలు విపరీత స్థాయిలో పెరుగుతున్నాయి. ఇందుకు అనేక కారకాలున్నాయి. వయసు మీరుతున్న జనాభా, కొత్త సాంకేతికతల విస్తరణ, ఆత్మరక్షణ వైద్యం, సాంస్కృతిక ప్రభావాలు, ప్రయివేటు బీమా మార్కెట్ ఆధిపత్యం వీటిలో భాగం. వైద్య వ్యయాల్ని నియంత్రించటంలో అమెరికా వైఫల్యానికి మూలం.. ఆరోగ్య రంగాన్ని వ్యాపారీకరించటంలో ఉంది. వైద్య అవసరాలపై డబ్బులు దండుకునే అవకాశాలకు వీలుగా వనరుల కేటాయింపులు చేయటం పెరిగిపోతోంది. దీనివల్ల మితిమీరిన చికిత్సలు చేయటం లేదా అవసరానికి తగ్గ చికిత్సలు చేయకపోవటం, ధరలు పెరగటం చోటు చేసుకుంటున్నాయి సమర్థత, సమత్వాలను సాధించటంలో అమెరికా ఆరోగ్య వ్యవస్థ విఫలమవుతోంది.

మరోవైపు, పి.పి.పిల ద్వారా ఖర్చుకు తగ్గ ఫలితాలను సాధించే నమూనాను అనుసరించటం, పటిష్ఠమైన ప్రాథమిక ఆరోగ్య నెట్‌వర్క్, దాన్ననుసరించి నాణ్యమైన ఆస్పత్రి సేవల వ్యవస్థల ద్వారా బ్రిటన్ ధరల్ని అదుపులో ఉంచుతోంది. 2016లో కామన్వెల్త్ నిధి తోడ్పాటున్న పదకొండు అధికాదాయ దేశాల మధ్య చేసిన సర్వేలో.. తాము అధిక ధరల వల్ల ఆరోగ్య సేవల్ని అందుకోలేకపోతున్నామని అమెరికాలో తక్కువ ఆదాయం గల 43 శాతం వయోజనులు తెలిపారు. ఈ శాతం మిగిలిన దేశాలన్నిటికన్నా ఎక్కువ (గణాంక పట్టిక 3.5). మిగతా దేశాల్లో ఈ శాతాలు 8 నుండి 31 మధ్య (బ్రిటన్ నుండి స్విట్జర్లాండ్ వరకు వరుసగా) మాత్రమే ఉన్నాయి. ఆరోగ్యానికి ఖర్చు భారం గురించి మిగతా ప్రజలతో పోలిస్తే పెద్దగా ఫిర్యాదు చేయని అల్పాదాయ వయోజనులున్న దేశం బ్రిటన్ మాత్రమే.

**(గణాంక పటం 3.5: వైద్య సేవలు ఖరీదవటం వల్ల అందుకోలేకపోతున్న వయోజనుల శాతం గతేడాది, 2016)**

**3.2.4. ఆరోగ్య సేవల్లో ఫలితాలు**

వివిధ ఆరోగ్య సంరక్షణ ప్రమాణాలపై ఓ.ఇ.సి.డి సగటుతో పోలుస్తూ అమెరికా, బ్రిటన్ గణాంకాల్ని 3.6ఎ, 3.6బి గణాంక పటాల్లో చూడవచ్చు. 16 విభిన్న పరామితులను ఈ విధంగా విభజించారు– ఆరోగ్య సేవల అందుబాటు, నష్ట ప్రమాద కారకాలు, ఆరోగ్య సేవల నాణ్యత, ఆరోగ్య స్థితి.

1. **ఆరోగ్య సేవల అందుబాటు –** గణాంక పటం 3.6ఎ లో చూపినట్లు, జనాభాపరంగా ఆరోగ్య కవరేజీ కోణంలో, బ్రిటన్ సహా చాలా ఓ.ఇ.సి.డి దేశాలు సార్వత్రిక (లేదా దాదాపు సార్వత్రిక) కవరేజీని కొన్ని కీలక సేవల విషయంలో సాధించాయి. అమెరికా విషయంలో 90 శాతం లోపు జనాభాకు మాత్రమే ఏదోక రకమైన ఆరోగ్య కవరేజీ ఉంది. మరోవైపు, జనాభా కవరేజీ ఒక్కటే కూడా సరిపోదు. సేవల్లో వ్యయ భారాన్ని ఎంత మేరకు భరించాల్సి ఉంటుంది అనే అంశం కూడా ఆరోగ్య సేవల అందుబాటును ప్రభావితం చేస్తుంది. ఓ.ఇ.సి.డి దేశాల్లో దాదాపు మూడొంతుల ఆరోగ్య సేవల వ్యయాల్ని ప్రభుత్వం లేదా తప్పనిసరి ఆరోగ్య బీమా పథకాలు భరిస్తాయి. కానీ అమెరికాలో ప్రభుత్వం మొత్తం వ్యయాల్లో కేవలం 50 శాతం భరిస్తుంది.

**(గణాంక పటం 3.6ఎ: ఓ.ఇ.సి.డి సగటుతో పోలిస్తే బ్రిటన్, అమెరికాలలో ఆరోగ్య సేవల అందుబాటు)**

2. **సేవల నాణ్యత –** మంచి నాణ్యత గల ఆరోగ్య సంరక్షణకు ఆరోగ్య సేవలు సురక్షితంగా, సరైనరీతిలో, వైద్య పరంగా ప్రభావవంతంగా, రోగి అవసరాలకు తగ్గట్లుగా ఉండటం అవసరం. ఆస్తమా, దీర్ఘకాల అబ్‌స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్ (సి.ఓ.పి.డి)లకు నివారించదగ్గ ఆస్పత్రి చేరికల వివరాలను చూస్తే.. ప్రాథమిక వైద్య సేవలు ఎంత సురక్షితంగా, సక్రమంగా ఉన్నాయో తేటతెల్లమవుతుంది. అక్యూట్ మియోకార్డియల్ ఇన్‌ఫార్క్షన్ (ఏ.ఎం.ఐ) తర్వాత 30 రోజుల్లో మరణం, రొమ్ము క్యాన్సర్ నుండి కోలుకోవటం.. ద్వితీయ స్థాయి, క్యాన్సర్ సేవల క్లినికల్ నాణ్యతను తెలియచేస్తాయి. ప్రాథమిక, ద్వితీయ స్థాయి వైద్య సేవల నాణ్యత అమెరికాలో బ్రిటన్‌లోని స్థాయిలోనే ఉన్నాయి. రొమ్ము క్యాన్సర్ సేవలు అమెరికాలో బ్రిటన్‌లో కంటే మెరుగ్గా ఉన్నాయి. ఆస్పత్రిలో చేరితే, లేదా తగినంత బీమా వర్తింపు ఉంటే అమెరికా ప్రపంచస్థాయి అత్యాధునిక వైద్యాన్ని అందిస్తుంది.
3. **ప్రమాద కారకాలు –** పొగతాగటం, మద్యం అలవాటు, స్థూలకాయం మూడు పెద్ద ఎన్.సి.డి ప్రమాద కారకాలు. ప్రపంచవ్యాప్తంగా ఎక్కువ మరణాలకు అవి కారణమవుతున్నాయి. పొగతాగటం, మద్యం వినియోగం అమెరికాలో కంటే బ్రిటన్‌లో ఎక్కువగా ఉంది. డయాబెటిస్, గుండె సంబంధ వ్యాధులు, క్యాన్సర్ సహా అనేక దీర్ఘవ్యాధులకు పెద్ద ప్రమాద కారణం అయిన స్థూలకాయం అమెరికాకు పెద్ద సమస్యగా మారింది.

(ఇంకా ఉంది...)



# ప్రజాస్వామ్యంలో నిర్ణయాలు ఎలా తీసుకోవాలో భవిష్యత్ తరాలకు సాగు చట్టాలు ఓ గొప్ప కేస్ స్టడీ



ఎన్నికల రాజకీయం కోసం నూతన సాగు చట్టాలను రద్దు చేసి రైతులకు సంకెళ్లను కొనసాగించటం దురదృష్టకరం. ప్రజాస్వామ్యంలో నిర్ణయాలు ఎలా తీసుకోవాలో భవిష్యత్ తరాలకు ఇదో గొప్ప కేస్ స్టడీ. ఈ చట్టాల వల్ల అద్భుతాలేమీ జరగవుగానీ, రైతులకు మెరుగైన ఆదాయం అందించే దిశగా ఓ ముందడుగని అప్పట్లోనే చెప్పాను. ఈ చట్టాలు లేకున్నా.. కాంట్రాక్టు వ్యవసాయాన్ని అమలు చేసుకోవచ్చు, నిత్యావసర సరకుల చట్టం వినియోగాన్ని నియంత్రించే అధికారం ప్రభుత్వం చేతుల్లోనే ఉంటుంది. ఒకప్పుడు కంప్యూటర్లను కూడా ఈ చట్టాల తరహాలోనే అడ్డుకున్నారు. ఆఫీసుల్లో కంప్యూటర్ల వినియోగానికి వ్యతిరేకంగా ఏటా సమ్మెలు చేస్తుండేవారు. కానీ ఈవేళ కంప్యూటర్లు వద్దు అని ఎవరైనా అడ్డుకుంటే యువత ఊరుకోరు. మరోవైపు, ఒక కొత్త మార్పును ప్రవేశపెట్టే సమయంలో ప్రజలకు, ప్రతిపక్షాలకు నచ్చచెప్పే నాయకత్వ స్థాయిని ప్రదర్శించటం అవసరం. పీవీ నరసింహారావు ప్రధానిగా ఉన్నప్పుడు ఆయన ప్రభుత్వానికి పార్లమెంటులో పెద్ద మెజారిటీ లేదు, ఆయనకు సొంత పార్టీలోనూ బలం లేదు. అయినా నరసింహారావు ఇంతకంటే పెద్ద మార్పుల్ని సాధించి చూపారు. ఎక్కడా ఆర్భాటాలు లేకుండా, రెచ్చగొట్టకుండా అందరినీ కలుపుకుని సంస్కరణల్ని అమల్లోకి తెచ్చారు. ఎవరన్నా విమర్శిస్తే.. ఏముందయ్యా, నెహ్రూ గారి విధానాలనే కొనసాగిస్తున్నాం, చిన్న చిన్న మార్పులు మాత్రమే చేస్తున్నాం అని నచ్చచెప్పేవారు. ఆ తర్వాత వాజ్‌పేయి, మన్మోహన్ సింగ్ కూడా అదే తరహాలో అనవసర ఆర్భాటాలు లేకుండా విపక్షాలను కూడా విశ్వాసంలోకి తీసుకుని మార్పుల్ని సాధించారు. ఆ తరహా పరిణతి ఈవేళ కొరవడటంతోపాటు, విధానాలను విమర్శించేవారందరినీ దేశద్రోహులుగా ముద్రవేసే రాజకీయం వల్ల మంచికి కూడా వ్యతిరేకత ఎక్కువయ్యే పరిస్థితి ఏర్పడింది. దీనివల్ల.. ప్రజాస్వామ్యం పనిచేయదు, చైనా తరహా నియంతృత్వం మేలనే ప్రమాదకర వాదనలు ప్రబలే అవకాశం ఉంది. ఆందోళనకారులు సైతం అంబేద్కర్ నిర్దేశించిన రాజ్యాంగబద్ధ పద్ధతుల్ని అపహాస్యం చేసే విధంగా కార్యక్రమాలు చేయటం విచారకరం. ఎన్నిసార్లు ఉద్యమాలలో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడతారు, పౌరుల హక్కుల్ని అడ్డుకుంటారు? ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ చూపి అందరినీ కలుపుకునే విధంగా పరిణతితో వ్యవహరించాలి. వ్యవసాయానికి ప్రధానంగా కావలసినది చట్టాలకన్నా విధానాలు. ఎన్నో అద్భుత అవకాశాలున్నా వ్యవసాయం అట్టడుగున కునారిల్లుతోంది. దేశ జనాభాలో సగం మంది ఆధారపడిన వ్యవసాయాన్ని సమున్నత స్థాయికి తీసుకొచ్చి రైతులకు సంకెళ్లు తెంచటంతోపాటు దేశ ఆర్థిక వ్యవస్థను కూడా బలోపేతం చేసేలా సరైన విధానాలను ఏకాభిప్రాయంతో తీసుకురావాలి.

- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్, ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు

RNI. Regd No. 69976/98 Postal Reg. No. HD-913/2021-2023 Published on 10th December, 2021 Posting Date 15 &16th of every month



# వ్యవసాయ సంక్షోభంపై పార్లమెంటులో సమగ్ర చర్చ జరపాలి



వివిధ కారణాల చేత నూతన సాగు చట్టాలను వ్యతిరేకించేవారు ఉండవచ్చు కానీ, వ్యవసాయం సంక్షోభంలో ఉందనటంలో అందరిలో ఏకాభిప్రాయం ఉంది. అందుకే వ్యవసాయ రంగానికి పరిష్కారాలపై పార్టీలకతీతంగా పార్లమెంటులో సమగ్ర చర్చకు ప్రభుత్వం ముందుకు రావాలి. ప్రధానంగా రైతుల సమస్యలకు మూడు కోణాల్లో పరిష్కారాల్ని సాధించాలి. ఒకటి, పండించిన పంటకు లాభసాటి ధర లభించేందుకు నిర్దిష్ట ఏర్పాట్లు. రెండు, రైతు కుటుంబాలపై విద్య, ఆరోగ్యం భారం లేకుండా ప్రభుత్వమే వాటిని నాణ్యతతో అందించటం. మూడు, రైతులు తమ అవసరాల కోసం పెద్ద నగరాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా గ్రామాలకు ఆర్థిక కేంద్రాలుగా చిన్న పట్టణాలను అభివృద్ధి చేయటం.

- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్,
ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు

*If undelivered please return to:*

*LOKSATTA UDYAMA SAMSTHA,*
*Tulips Apartments, 6-3-655,*
*Flat.No. 407,*
*Behind civil supplies office,*
*Somajiguda,*
*Hyderabad - 500 082*

**Edited, Printed and Published by Dr. Jayaprakash Narayan, National Coordinator, Loksatta for and behalf of Foundation for Democratic Reforms, Tulips Apartments, 6-3-655, Flat.No. 407, Behind civil supplies office, Somajiguda, Hyderabad - 500 082. Printed at Kala Jyothi Process Pvt Ltd, 1-1-60/5, RTC "X" Roads, Hyderabad 500 020**